AKHANDAA SURYAA

PRGI NO : TGTEL/25/A1809

# అఖండ సూర్య

అజేయ ప్రజా స్వరం

తెలుగు దినపత్రిక

Simultaneously Published from Hyderabad and Vijayawada

E-Paper:https://epaper.akhandasurya.com

సంపుటి : 01 | సంచిక : 332 | హైదరాబాద్, జూన్, మంగళవారం 23, 2026 | పేజీలు : 12 | వెల : 6.00



## కోర్టుకు అల్లు అర్జున్ డుమ్మా!

- షూటింగ్ సాకుతో పిటిషన్..
- విచారణ జూలై 6కు వాయిదా
- సంధ్య థియేటర్ కేసు విచారణ
- ఇతర 18 మంది నిందితుల హాజరు
- బాండ్లపై సంతకాలు

అఖండసూర్య, హైదరాబాద్

టాలీవుడ్ ప్రముఖ కథానాయకుడు, 'ఐకాన్ స్టార్' అల్లు అర్జున్ సోమవారం నాంపల్లి కోర్టు విచారణకు హాజరు కాలేదు. ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని సంధ్య థియేటర్ వద్ద గతంలో జరిగిన ఘోర తొక్కిసలాట ఘటనకు సంబంధించిన కేసులో ఆయన ఈరోజు కోర్టుకు వ్యక్తిగతంగా హాజరుకావాల్సి ఉంది. ఈ మేరకు గతంలోనే న్యాయస్థానం సమన్లు జారీ చేసిన సంగతి తెలిసిందే. అయితే, ప్రస్తుతం తాను సినిమా షూటింగ్‌లో బిజీగా ఉన్నందున భౌతికంగా హాజరుకావడం సాధ్యం కాదంటూ అల్లు అర్జున్ తన న్యాయవాది ద్వారా కోర్టుకు సమాచారం అందించారు. వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరుతూ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. హైదరాబాద్‌లోని సంధ్య థియేటర్ ప్రాంగణంలో జరిగిన ప్రమాదంపై నమోదైన కేసులో తీవ్రత దృష్ట్యా ఈ నెల 22న అల్లు అర్జున్ ఖచ్చితంగా కోర్టుకు రావాలని నాంపల్లి న్యాయస్థానం గతంలోనే స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. అయితే, కోర్టు గడువు ముగిసే సమయానికి కూడా నటుడు అక్కడ ప్రత్యక్షం మిగతా 7లో..

# ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు రక్షణ శాఖ మద్దతు



- మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో కీలక హామీ
- రాజ్‌నాథ్‌తో ఢిల్లీలో సీఎం రేవంత్ రెడ్డి భేటీ
- గాంధీ సరోవర్ ప్రాజెక్టు భూముల బదిలీపై కృతజ్ఞతలు
- ఎయిర్‌పోర్ట్ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం
- దేశ భద్రతకు అత్యంత కీలకమైన ప్రాజెక్ట్
- విమానాశ్రయంలో కార్గో, ఎంఆర్‌వో వసతుల ఏర్పాటు
- అంతర్జాతీయ ఎయిర్‌లైన్స్ హ్యాంగర్స్ ఏర్పాటు
- దేవరకద్ర డీఆర్డీవోకు తక్షణ అనుమతులు ఇవ్వాలి
- సానుకూలంగా స్పందించిన కేంద్ర రక్షణ మంత్రి
- సమావేశంలో పాల్గొన్న ఇరు శాఖల ఉన్నతాధికారులు

అఖండసూర్య, హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంలో రవాణా, పారిశ్రామిక రంగాల వృద్ధికి ఊతమిచ్చేలా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఢిల్లీ వేదికగా కీలక అడుగులు వేశారు. దేశ రాజధానిలోని రక్షణ శాఖ కార్యాలయం 'కర్తవ్య భవన్' లో కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ భేటీలో భారత వాయుసేన ఆధ్వర్యంలో నిర్మించ తలపెట్టిన ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్‌ను అన్ని రకాల అత్యాధునిక వసతులతో అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేయాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు. సరిహద్దు రక్షణతో పాటు పౌర విమానయానానికి అనుకూలంగా ఈ విమానాశ్రయాన్ని తీర్చిదిద్దాలని కోరారు. ఈ సమావేశం ప్రారంభంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'గాంధీ సరోవర్ ప్రాజెక్టు' నిర్మాణానికి అడ్డుగా ఉన్న రక్షణ శాఖ భూములను రాష్ట్ర ప్రభుత్వానికి బదిలీ చేసేందుకు కేంద్రం సానుకూలంగా స్పందించి, భూములను కేటాయించినందుకు గాను రాష్ట్ర ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలియజేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఇలాంటి సానుకూల సహకారం భవిష్యత్తులోనూ కొనసాగాలని ఆకాంక్షించారు. తెలంగాణ ప్రభుత్వ అత్యంత ప్రాధాన్యత కలిగిన ప్రాజెక్టులలో ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ ఒకటని సీఎం రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ విమానాశ్రయ విస్తరణ, అభివృద్ధికి అవసరమైన భూసేకరణ ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం వేగవంతం చేస్తుందన్నారు. అలాగే విమానాశ్రయ పరిధిలోకి వచ్చే విద్యుత్, నీటి సరఫరా వంటి యుటిలిటీస్ బదిలీ అంశాలలో కేంద్ర రక్షణ శాఖకు, భారత వాయుసేనకు తెలంగాణ ప్రభుత్వం తరఫున వంద శాతం పూర్తి సహకారం అందిస్తామని కేంద్ర మంత్రికి భరోసా ఇచ్చారు. ఆదిలాబాద్‌లో రాబోయే ఎయిర్‌పోర్ట్ కేవలం ఒక ప్రాంతానికి పరిమితం కాదని, ఇది దేశ సమగ్రతకు, సరిహద్దు రక్షణకు సంబంధించిన అత్యంత కీలకమైన అంశమని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. భారత వాయుసేన తన వ్యూహాత్మక అవసరాల కోసం ఈ విమానాశ్రయాన్ని భారీగా విస్తరిస్తున్న నేపథ్యంలో, రక్షణ శాఖ తీసుకునే ప్రతి నిర్ణయానికి రాష్ట్ర యంత్రాంగం అండగా ఉంటుందన్నారు. దేశ రక్షణ రంగాన్ని బలోపేతం చేసే ఏ కార్యక్రమానికైనా తెలంగాణ ప్రభుత్వం ఎల్లప్పుడూ మొదటి వరుసలో ఉంటుందని రక్షణ మంత్రికి వివరించారు. భారత వాయుసేన రక్షణ అవసరాల కోసం నిర్మించే ప్రత్యేక టెర్మినల్‌తో పాటు, సాధారణ ప్రయాణికుల సౌకర్యార్థం పౌర విమానయాన శాఖ (సివిల్ ఏవియేషన్) ఆధ్వర్యంలో ఒక ప్యాసింజర్ టెర్మినల్ బిల్డింగ్‌ను కూడా ఇక్కడ నిర్మించాలని సీఎం మిగతా 7లో..



## మత్తు వదలండి.. మైదానాలు చేరండి

- యువతకు రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి వాకిటి శ్రీహరి పిలుపు..
- మహబూబ్‌నగర్‌లో రూ. 12.53 కోట్లతో క్రీడా పనులకు శంకుస్థాపన
- పాలమూరు క్రీడాభివృద్ధికి వంద కోట్లయినా ఖర్చు చేస్తామన్న మంత్రి
- ఒలింపిక్స్‌లో పతకమే లక్ష్యం: ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి
- క్రీడల బడ్జెట్‌ను రూ. 640 కోట్లకు పెంచిన సీఎం రేవంత్ రెడ్డి
- 350 మంది కొత్త కోచ్‌ల నియామకం.. సీఎం కప్‌తో ప్రతిభకు గుర్తింపు

అఖండసూర్య, హైదరాబాద్

"యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి.. స్మార్ట్‌ఫోన్లు, వ్యసనాల మత్తును వదిలి మైదానాల్లోకి అడుగుపెట్టాలి" అని రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి వాకిటి శ్రీహరి పిలుపునిచ్చారు. సోమవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియం మైదానంలో తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాట్స్) ఆధ్వర్యంలో రూ. 12.53 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పలు ఆధునిక క్రీడా మౌలిక సదుపాయాల నిర్మాణ పనులకు ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డితో కలిసి మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణను దేశంలోనే క్రీడల హబ్‌గా మార్చేందుకు కట్టుబడి ఉందన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో క్రీడాకారుల నైపుణ్యాన్ని పెంచేందుకు ప్రభుత్వం భారీ నిధులను కేటాయించిందని మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. ఈ రూ. 12.53 కోట్ల నిధులతో ఇండోర్ స్టేడియం మైదానంలో అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా రూ. 10.70 కోట్లతో 400 మీటర్ల 8 లైన్ల సింథటిక్ అథ్లెటిక్స్ ట్రాక్ నిర్మించనున్నారు. దీనితో పాటు రూ. 1 కోటి వ్యయంతో నాలుగు ఓపెన్ జిమ్‌లు, రూ. 51 లక్షలతో ఇండోర్ జిమ్ మరియు మహిళల అథ్లెటిక్స్ హాస్టల్ భవనాన్ని నిర్మించనున్నారు. మిగిలిన రూ. 32 లక్షలను ఇతర అనుబంధ క్రీడా వసతుల కోసం ఖర్చు చేయనున్నట్లు మంత్రి వివరించారు. క్రీడలు అనేవి కేవలం టైమ్‌పాస్ వినోదం మాత్రమే కాదని, మనిషి జీవనశైలిని, క్రమశిక్షణను మార్చే ఒక శక్తివంతమైన సాధనమని మంత్రి శ్రీహరి పేర్కొన్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని వివిధ నియోజకవర్గాల్లో మిగతా 7లో..

## వర్షా కాలంలో ప్రజల భద్రతే ప్రాధాన్యం

- అధికారులకు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కీలక ఆదేశాలు
- జూన్ నుంచి అక్టోబర్ వరకు అధికారులు ఫీల్డ్‌లోనే ఉండాలి
- అత్యవసర పరిస్థితుల కోసం ముందస్తుగా యంత్రాలు, సామగ్రి సిద్ధం
- ముంపు ప్రాంతాల గుర్తింపు.. ప్రత్యామ్నాయ మార్గాల ఏర్పాటు
- గ్రీన్, ఎల్లో, ఆరెంజ్, రెడ్ కలర్ కోడ్ హెచ్చరికల వ్యవస్థ
- 204 మిల్లీమీటర్ల వర్షం దాటితే 'రెడ్ అలర్ట్'
- నిరంతర విధి నిర్వహణ.. ప్రత్యేక ఎస్ఓపీ విడుదల



అఖండసూర్య, హైదరాబాద్

రాష్ట్రంలో వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో ప్రజలకు రవాణా పరంగా ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసేందుకు తెలంగాణ రోడ్లు, భవనాల శాఖ సర్వసన్నద్ధమైంది. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు.. వరదలు, భారీ వర్షాల వల్ల రోడ్లు, వంతెనలు దెబ్బతినకుండా ఉండేందుకు, అత్యవసర సమయాల్లో వేగంగా స్పందించేందుకు వీలుగా ఒక ప్రత్యేక 'స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్' (ఎస్ఓపీ) ను విడుదల చేసినట్లు రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ప్రకటించారు. వర్షాలు, వరదల సమయంలో రవాణా వ్యవస్థకు విఘాతం కలగకుండా నిరంతరం క్షేత్ర స్థాయిలో అందుబాటులో ఉండి పనిచేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఆర్ అండ్ బీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ జారీ చేసిన ఈ నూతన మిగతా 7లో..

## శాంతి బాటలో అమెరికా ఇరాన్

- స్విట్జర్లాండ్ చర్చలు సఫలం..
- కీలక ఒప్పందాలకు గ్రీన్ సిగ్నల్
- మధ్యవర్తిత్వంలో పాక్ సఫలం
- విచారణ పర్యవేక్షణకు హై లెవల్ కమిటీ
- లెబనాన్‌లో కాల్పుల విరమణకు 'డీకాన్ఫ్లిక్షన్' సెల్
- హర్మూజ్ జలసంధిలో వాణిజ్య నౌకలకు రక్షణ
- స్తంభింపజేసిన ఆస్తుల విడుదల..
- నౌకాశ్రయాల దిగ్బంధనం ఎత్తివేత



అఖండసూర్య, హైదరాబాద్

అంతర్జాతీయ రాజకీయాల్లో దశాబ్దాలుగా నెలకొన్న ఉద్రిక్తతలకు తెరదించుతూ స్విట్జర్లాండ్ వేదికగా అమెరికా, ఇరాన్ దేశాల మధ్య జరిగిన అత్యంత కీలకమైన దౌత్య చర్చలు ఎట్టకేలకు ముగిశాయి. ఇరు దేశాల మధ్య అత్యంత సానుకూల వాతావరణంలో ఈ శాంతి చర్చలు సాగినట్లు మధ్యవర్తులుగా వ్యవహరించిన పాకిస్థాన్, ఖతార్ దేశాలు అధికారికంగా ప్రకటించాయి. ప్రపంచ శాంతికి ముప్పుగా మారిన అణు కార్యక్రమ నియంత్రణ, ఇరాన్‌పై ఆర్థిక ఆంక్షల ఎత్తివేత, పరస్పర వివాదాల పరిష్కారం కోసం ఇరుపక్షాలు ఒక మిగతా 7లో..



## పాక్ ఐఎస్ఐ స్లీపర్ సెల్ గుట్టురట్టు

- ఛత్తీస్‌గఢ్‌లో పంజాబ్ యువకుడి అరెస్ట్..
- పవర్ కంపెనీలో కాంట్రాక్ట్ కార్మికుడిగా ఉంటూ గూఢచర్యం
- అద్దెదారుల తనిఖీల్లో దొరికిపోయిన సేవక్ సింగ్
- మొబైల్ డేటాలో పాకిస్థాన్ వాట్సాప్ చాటింగ్‌లు లభ్యం
- ఎన్‌టీపీసీ, జేఎస్‌డబ్ల్యూ ప్లాంట్ల లొకేషన్లు శత్రువుల చేతికి
- డ్రోన్ల ద్వారా ఆయుధాల సరఫరా.. 'టార్గెట్ కిల్లింగ్స్' కు ప్లాన్

అఖండసూర్య, హైదరాబాద్

దేశంలో భారీ విధ్వంసానికి వ్యూహం పన్నుతున్న పాకిస్థాన్ గూఢచారి సంస్థ 'ఐఎస్ఐ' కి చెందిన ఒక ప్రమాదకరమైన స్లీపర్ సెల్ సభ్యుడిని ఛత్తీస్‌గఢ్ పోలీసులు శనివారం అత్యంత చాకచక్యంగా అరెస్ట్ చేశారు. నిందితుడిని పంజాబ్ రాష్ట్రానికి చెందిన సేవక్ సింగ్ (23) గా అధికారులు గుర్తించారు. నిందితుడి వద్ద ఉన్న మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకుని కాల్ రికార్డులను పరిశీలించగా, అంతర్జాతీయ అనుమానాస్పద నంబర్లతో నిరంతరం వీడియో కాల్స్, వాట్సాప్ చాటింగ్ జరిపినట్లు పక్కా ఆధారాలు లభించాయి. దీంతో జాతీయ భద్రతకు భంగం కలిగించేలా పాక్ ఐఎస్ఐతో అక్రమ సంబంధాలు నడుపుతున్న ఈ వ్యక్తిపై పోలీసులు దేశద్రోహం మిగతా 7లో..

## మహారాష్ట్ర రాజకీయాల్లో పెను భూకంపం

- సీఎం షిందే వర్గంలోకి 'యూబీటీ' ఆరుగురు రెబెల్ ఎంపీలు..
- పార్లమెంటులో పెరగనున్న సీఎం షిందే వర్గం బలం
- ఆపరేషన్ టైగర్ ఏడాది పొడవునా సాగుతుంది: ప్రతాప్ సర్నాయిక్
- అవమానాలు భరించలేకే పార్టీ వీడుతున్నా: రెబెల్ ఎంపీ నగేశ
- రాజ్యాంగాన్ని మార్చేందుకే బీజేపీ కుట్ర: ఆదిత్య ఠాక్రే ఆగ్రహం
- జూన్ 27 నుంచి మహారాష్ట్రవ్యాప్తంగా ఉద్ధవ్ ఠాక్రే పర్యటనలు



అఖండసూర్య, హైదరాబాద్

మహారాష్ట్ర రాజకీయ వేదికపై మరో భారీ రాజకీయ ముసాయిదా మార్పిడి కలకలం రేపుతోంది. మాజీ ముఖ్యమంత్రి ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన (యూబీటీ) పార్టీకి కోలుకోలేని పెద్ద దెబ్బ తగిలింది. ఆ పార్టీకి చెందిన ఆరుగురు తిరుగుబాటు (రెబెల్) లోక్‌సభ సభ్యులు సోమవారం అధికారికంగా ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిందే నేతృత్వంలోని అసలు శివసేన వర్గంలో చేరబోతున్నట్లు ఆ పార్టీ కీలక నేత, మహారాష్ట్ర మంత్రి ప్రతాప్ సర్నాయిక్ సంచలన ప్రకటన చేశారు. ఈ ఆరుగురు ఎంపీల రాకతో దేశ రాజధాని ఢిల్లీలోని పార్లమెంటులో సీఎం షిందే నేతృత్వంలోని శివసేన బలం భారీగా పుంజుకోనుంది. ఈ తిరుగుబాటు ఎంపీలు ఇప్పటికే లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను కలిసి, తమను షిందే వర్గంలో విలీనం చేయాలని కోరుతూ అధికారిక లేఖను కూడా అందజేయడం విశేషం. మహారాష్ట్ర మంత్రి ప్రతాప్ సర్నాయిక్ సోమవారం ఉదయం మీడియాతో మాట్లాడుతూ ఈ విలీన ప్రక్రియపై పూర్తి స్పష్టతనిచ్చారు. సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు ఆరుగురు యూబీటీ ఎంపీలు అధికారికంగా తమ శివసేన పార్టీ కండువా కప్పుకోనున్నారని మిగతా 7లో..

## బ్రిటన్ ప్రధాని రాజీనామా

- లేబర్ పార్టీ సారథ్యానికీ గుడ్‌బై
- దివాళా తీసిన పార్టీని సంస్కరించాను: కీర్ స్టార్మర్
- దేశంపై ప్రేమతోనే నా ఈ రాజీనామా నిర్ణయం
- రాజు చార్లెస్‌కు సమాచారం.. సెప్టెంబరుకల్లా కొత్త ప్రధాని
- జూలై 9 నుంచి కొత్త నాయకుడి ఎంపిక ప్రక్రియ ప్రారంభం
- రేసులో ముందున్న ఆండీ బర్న్‌హామ్.. మారిన ఆరుగురు ప్రధానులు
- మిత్రుడి నియామక వివాదం.. స్టార్మర్‌పై పెరిగిన ఒత్తిడి



అఖండసూర్య, హైదరాబాద్

అంతర్జాతీయ రాజకీయ వేదికపై ఒక అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. యునైటెడ్ కింగ్‌డమ్ ప్రధానమంత్రి కీర్ స్టార్మర్ తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించి ప్రపంచవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించారు. ప్రధాని పదవితో పాటు అధికార లేబర్ పార్టీ నాయకత్వ బాధ్యతల నుంచి కూడా తాను తప్పుకుంటున్నట్లు ఆయన స్పష్టం చేశారు. తన సొంత పార్టీ సభ్యుల నమ్మకాన్ని, అభిప్రాయాలను గౌరవిస్తూ, దేశ ప్రయోజనాల కోసమే తాను ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు స్టార్మర్ వెల్లడించారు. అయితే, బ్రిటన్‌కు కొత్త ప్రధాని ఎన్నిక పూర్తయ్యే వరకు తాను ఆపద్ధర్మ ప్రధానిగా బాధ్యతలు నిర్వహిస్తానని ఆయన పేర్కొన్నారు. తాను గతంలో లేబర్ పార్టీ నాయకత్వ బాధ్యతలను చేపట్టినప్పటి పరిస్థితులను కీర్ స్టార్మర్ ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఆ సమయంలో పార్టీ రాజకీయంగా, ఆర్థికంగా, నైతికంగా పూర్తిగా దివాళా తీసిన స్థితిలో ఉందని ఆయన వ్యాఖ్యానించారు. ముఖ్యంగా పార్టీలో వేళ్లూనుకుపోయిన యూదు వ్యతిరేక విషబీజాలను సమూలంగా పారద్రోలి, పార్టీని పూర్తిగా ప్రక్షాళన చేశానని చెప్పారు. దేశ రక్షణ, జాతీయ భద్రత వంటి అత్యంత కీలకమైన అంశాలపై బ్రిటిష్ ప్రజల్లో లేబర్ పార్టీ పట్ల తిరిగి గట్టి నమ్మకాన్ని కల్పించగలిగానని ఆయన మిగతా 7లో..



## వర్షా ధార లోతట్టు ప్రాంతాలను పరిశీలించిన మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్

**అఖండ సూర్య, అఖండ సూర్య :**

జమ్మికుంట పట్టణ పరిధిలో ఉదయం పూట కురిసిన వర్షానికి గాను హౌసింగ్ బోర్డ్ కాలనీ నుంచి అంబేద్కర్ కాలని మీదగా వచ్చేటటువంటి వరదనీరు డ్రైన్ పరిస్థితిని పరిశీలించిన మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్.అనంతరం వారు మాట్లాడుతూ జమ్మికుంట పట్టణ పరిధిలోని 30 వార్డులకు గాను వర్షాల కారణంగా నీటి సమస్య తలెత్తకుండా ఉండేందుకు ముందస్తు ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలుపుతూ ఎక్కడ కూడా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మా పాలకవర్గం అనునిత్యం అందుబాటులో ఉంటామని తెలిపారు.

## మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి: డీసీపీ భాస్కర్



**మంచిర్యాల,అఖండ సూర్య, జూన్ 22**

అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా నిరోధక దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న అవగాహన వారోత్సవాల్లో భాగంగా శ్రీరాంపూర్ పరిధిలోని విశ్వశాంతి కేరళ స్కూల్‌లో సోమవారం కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంచిర్యాల డీసీపీ ఎ.భాస్కర్ మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. హానికరమైన విషయాలకు ధైర్యంగా "నో" చెప్పే అలవాటు పెంపొందించుకోవాలని అన్నారు. డ్రగ్స్ వల్ల ఆరోగ్యం, కుటుంబం, సమాజంపై తీవ్ర ప్రభావం పడుతుందని తెలిపారు.పరిసరాల్లో మాదకద్రవ్యాలకు సంబంధించిన అనుమానాస్పద కార్యకలాపాలు గమనిస్తే వెంటనే తల్లిదండ్రులు లేదా పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. కార్యక్రమంలో ఏసీపీ ఆర్.ప్రకాశ్, ఇన్‌స్పెక్టర్ అశోక్ కుమార్, ఎస్ఐ సంతోష్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మహిళలకు రక్షణగా షీ టీమ్స్



- **షీ టీమ్ ఎస్ఐ ఉషారాణి**

**మంచిర్యాల,అఖండ సూర్య;**

మహిళలు ధైర్యంగా ఉండాలని అండగా రక్షణగా షీ టీమ్స్ ఉన్నాయని మంచిర్యాల జిల్లా షీ టీమ్ ఎస్ఐ ఉషారాణి పేర్కొన్నారు. సోమవారం మహిళలను బలోపేతం చేయడానికి సీసీసీ నస్పూర్ టౌన్‌షిప్‌లో సింగరేణి పారిశుధ్య కార్మికులకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సమాజంలో తెల్లవారుజాము నుంచే విధుల నిర్వహణ కోసం రోడ్లపైకి వచ్చే మహిళా పారిశుధ్య కార్మికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మహిళలకు చట్టపరంగా కల్పించబడిన హక్కులు, వేధింపుల నుంచి ఎలా రక్షణ పొందాలో కార్మికులకు వివరించారు. ఈవ్‌టీజింగ్, సైబర్ నేరాలు, ట్రాఫిక్ నిబంధనలు, షీ టీమ్స్ విధులు, మహిళల భద్రతకు సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించారు. అత్యవసర పరిస్థితుల్లో పోలీసులను డయల్100, రామగుండం షీ టీమ్ వాట్సాప్ నంబర్ 6303923700, మంచిర్యాల జిల్లా షీ టీమ్ నంబర్ 8712659385 సంప్రదించాలని తెలిపారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని భరోసా కల్పించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ రాష్ట్రవ్యాప్తంగా పటిష్టమైన చర్యలు చేపడుతోందన్నారు. మహిళలు ఎటువంటి వేధింపులకు గురైనా భయపడకుండా వెంటనే పోలీసులను సంప్రదించి ఫిర్యాదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా షీ టీమ్ సిబ్బంది, కానిస్టేబుల్స్ సతీష్, జ్యోతి, కాంట్రాక్టర్ గోపాలరావు, సూపర్‌వైజర్ రఘు, సింగరేణి పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజులు నియంత్రించాలి

- **జిల్లా విద్యాశాఖ అధికారికి వినతి పత్రం అందజేసిన బీఆర్ఎస్వీ నాయకులు**

**మంచిర్యాల,అఖండ సూర్య:జూన్ 22**

ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజులు నియంత్రించాలని, ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్వీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం మంచిర్యాల జిల్లా విద్యాశాఖ అధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్వీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు బడికల శ్రావణ్, నియోజకవర్గ అధ్యక్షుడు దగ్గుల మధుకుమార్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలు అధిక ఫీజులు వసూలు చేస్తూ పేద మధ్య తరగతి ప్రజలను ఆర్థికంగా దోసుకుంటున్నాయని అన్నారు. కేవలం దనర్జనే ధ్యేయంగా విద్యార్థులను వారి తల్లిదండ్రులను మోసం చేస్తూన్నా ప్రభుత్వం పట్టించుకోకుండా విద్యా సంస్థల యాజమాన్యాలకు వత్తాసు పలుకుతుందన్నారు. అధిక ఫీజుల వసూలు నియంత్రణ కోసం కమిటీ వేస్తాం అని ప్రభుత్వం చెప్పి ఇప్పటి వరకు కమిటీ వేయకపోవడం కార్పొరేట్ వ్యవస్థకు ఆజ్యం పోస్తుందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు గుర్తించి వారిని పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ జిల్లా నాయకులు అరుణ్, రిషి, నార్ల వంశీ, నక్క తిరుపతి, సాజిద్, అరుణ్, కంపెల్లి శ్రీకాంత్, జిలకర మహేష్, చంద్ర కిరణ్, లక్ష్మీకాంత్, రాజేందర్, బెల్లంపల్లి పట్టణ ప్రధాన కార్యదర్శి బుద్ధర్తి సుమంత్, కార్యదర్శి వడ్డేపల్లి నితీష్ పాల్గొన్నారు.




# ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

- **జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి. ఎస్ లత**

**జగిత్యాల కలెక్టరేట్, అఖండ సూర్య;**

ప్రజావాణి అర్జీల పై సమగ్ర విచారణ జరిపి సమస్యలను త్వరగా పరిష్కరించాలని అధికారులను జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి. ఎస్ లత అధికారులను అదేశించారు.సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి. ఎస్ లత, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. రాజా గౌడ్ తో కలిసి ప్రజల నుండి ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు.ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి. ఎస్ లత మాట్లాడుతూ పలు సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని పలు మండలాల నుండి ప్రజలు సమస్యలు విన్నవించుకోడానికి ప్రజావాణికి వస్తారని, అధికారులు వారి శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు సమస్యల పై సమగ్ర విచారణ చేపట్టి పరిష్కారానికి చొరవ చూపాలని అన్నారు. అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కాగా ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 113 ఫిర్యాదులు, వినతులు వచ్చాయని, వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు.అనంతరం ఇదివరకు ప్రజావాణి లో వచ్చిన 182 పెండింగ్ దరఖాస్తులు త్వరగా పరిష్కరించాలని లేని యెడల సంబంధిత జిల్లా అధికారి బాధ్యునిగా చేస్తూ మెమో జారీ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా రెవెన్యూ అధికారి ప్రసాద్, జగిత్యాల ఆర్డీవో మధు సూదన్, సంబంధిత జిల్లా స్థాయి అధికారులు, మున్సిపల్ కమిషనర్ లు మరియు తదితరులు పాల్గొన్నారు.



# జీవో నెంబర్ 42 కి విరుద్ధంగా అధిక ఫీజులు వసూలు

- **ప్రైవేట్ పాఠశాలల పైన చర్యలు తీసుకోవాలి**
- **ఆల్ ఇండియా స్టూడెంట్ జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అమ్మ వెంకటేష్**

**అఖండ సూర్య, జమ్మికుంట, (జూన్ 22)**

జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రైవేట్ పాఠశాలలు జీవో నెంబర్ 42 కి విరుద్ధంగా అధిక ఫీజులు వసూలు చేస్తూ ప్రభుత్వ నియమ నిబంధనలను తుంగలో తొక్కి వారి ఇష్టా రాజ్యాంగ వ్యవహరిస్తున్నారని ఆల్ ఇండియా స్టూడెంట్ జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అమ్మ వెంకటేష్ మండల విద్యాధికారికి వినతి పత్రం అందజేసారు. అనంతరం వారు మాట్లాడుతూ.. నేడు ప్రైవేట్ పాఠశాలలో ఐఐటి మెడికల్ ఫౌండేషన్ కర్కులం ఆక్టివిటీస్ పేరిట విద్యార్థుల తల్లి దండ్రుల నుండి అధిక ఫీజులు వసూలు చేస్తూ వారి రక్తాన్ని జలగల పిలుస్తున్నారని, అధిక ఫీజుల దోపిడీ మీద ఉన్న ఆలోచన విద్యార్థుల భవిష్యత్తు మీద లేకుండా పోయిందని, విద్యదానం చేయాల్సినటువంటి విద్యా సంస్థలు విద్యార్థుల పాలిట శాపంగా మారి వేలాది రూపాయల ఫీజులను దండుకుంటున్నారని నేడు ప్రైవేట్ విద్యా సంస్థలు డబ్బుల మీద ఉన్నటువంటి వ్యామోహం విద్యార్థుల భవిష్యత్తు మీద లేకుండా పోయింది ప్రతి విద్య సంవత్సరం విద్యార్థుల మార్కుల పాస్ పర్సంటేజ్ లో మాత్రం విద్యాసంస్థలు పూర్తిస్థాయిలో విఫలమవుతున్నాయి. అధిక ఫీజుల దోపిడీ మీద ఉన్నటువంటి ఆలోచన విద్యార్థులు భవిష్యత్తు మీద ఉంటే బాగుంటుందని, విద్యార్థుల భవిష్యత్తును ఆలోచించకుండా అధిక ఫీజుల దోపిడికి పాల్పడుతున్నటువంటి పలు ప్రైవేట్ పాఠశాల పైన ఎంక్వయిరీ చేసి శాఖ పరమైనటువంటి చర్యలు తీసుకోవాలని కోరడం జరుగుతుందని అమ్మ వెంకటేష్ తెలిపారు.ఈ కార్యక్రమంలో జమ్మికుంట మండల అధ్యక్షుడు గడ్డం సత్య విష్ణు, వరుణ్, కర్మల, సాయిచరణ్, సాయికుమార్, వినయ్, తదితరులు పాల్గొన్నారు



# పీఆర్సీ నివేదిక తెప్పించుకొని వెంటనే అమలు చేయాలి

**బోనకల్, అఖండ సూర్య:**

ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు తెలంగాణ రెండవ పిఆర్సీ కోసం ఆత్రుతగా ఎదురుచూస్తున్నారని, 2023 జులై నుండి అమలు కావాల్సిన నూతన పీఆర్సీ 35 నెలల కాలం పూర్తి అయినందున ప్రభుత్వం వెంటనే నివేదికను తెప్పించుకుని సంఘాలతో చర్చించి అమలుచేయాలని టిఎస్ యూటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. సంఘ సభ్యత్వ క్యాంపైన్ ను సోమవారం మండలంలో ఆయన ప్రారంభించి మాట్లాడారు. 2024 మార్చి నుండి రిటైర్ అయిన 15 వేలమంది ఉద్యోగులు, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన రిటైర్మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని, ఉద్యోగుల పెండింగ్ బిల్లులు అన్నీ క్లియర్ చేయాలని డిమాండ్ చేశారు. సిపిఎస్ ఉపాధ్యాయుల డిఎ బకాయిలు విడుదల చేయాలని, బకాయి ఉన్న ఐదు వాయిదాల డిఎ లను ప్రకటించాలని,హెల్త్ కార్డులపై వెంటనే వైద్యం అందించాలని, ఉపాధ్యాయుల సర్వీసు నిబంధనలను రూపొందించి పర్యవేక్షణ అధికారుల పదోన్నతులు చేపట్టాలని కోరారు. సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ పునరుద్ధరించాలని, 2003 డిఎస్సీ టీచర్లకు పాత పెన్షన్ అమలు చేయాలని, కెజిబివి, సమగ్ర శిక్షా ఉద్యోగులకు బేసిక్ పే ఇవ్వాలని,సమ్మె కాలపు వేతనం మంజూరు చేయాలని కోరారు. విద్యాహక్కు చట్టాన్ని సవరించి ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులను టెట్ నుండి మినహాయించాలని, బోధించే సబ్జెక్టులలో టెట్ పరీక్షలు నిర్వహించాలని, అర్హత మార్కుల శాతాన్ని తగ్గించాలని, సర్వీస్ వెయిటేజ్ ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం 27,000 ప్రభుత్వ పాఠశాలలను 4000 పాఠశాలలుగా కుదించాలనే ఆలోచన విరమించుకోవాలని, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసే విధంగా తగుచర్యలు తీసుకోవాలని, మొదటి దశలో ప్రతి గ్రామపంచాయతీలో ఒక పాఠశాలను ఆదర్శ పాఠశాలగా అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. నర్సరీ ,కేజీ తరగతులను ప్రవేశపెట్టి, తరగతి ఒక ఉపాధ్యాయుడిని కేటాయించి ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేయాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో నమోదు పెంచడం కొరకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం వెంటనే పాఠ్యపుస్తకాలు, వర్క్ బుక్కులు, నోటు పుస్తకాలు, యూనిఫామ్స్ పాఠశాలలకు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. పర్యవేక్షణ వ్యవస్థను పటిష్టం చేయాలని, పర్యవేక్షణ పోస్టులను వెంటనే భర్తీ చేయుటకు సర్వీస్ రూల్స్ సమస్యను పరిష్కరించాలని కోరారు. తెలంగాణ రాష్ట్రంలో ఉన్న బడులను అభివృద్ధి చేయాలని, నూతన ఆవాసాలు పెరిగినందున పాఠశాలలను ప్రారంభించాలని, ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయడం ద్వారా మాత్రమే సమాజంలో అంతరాలు తొలగిపోతాయని అన్నారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కొరత ఉంది, ఉపాధ్యాయుల అసమతుల్యత , ప్రాథమిక పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ లేకపోవడం లోపాలు. వీటిని సరిదిద్దేందుకు కృషి చేయకపోవడం శోచనీయం. 15% బడ్జెట్ కేటాయిస్తామని వాగ్దానం చేసి అధికారంలోకి వచ్చిన తర్వాత మూడవ విడత బడ్జెట్ లో కూడా 8.22% దాటలేదు. యంగ్ ఇండియా, టిపిఎస్ పేరుతో జనాకర్షక పాఠశాలలు కాకుండా ప్రజలందరికీ అందుబాటులో ఉన్న ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి గుగులోత్ రామకృష్ణ, సద్దా బాబు, లక్ష్మణరావు, గోపాలరావు, నర్సింహారావు, నిర్మల, సౌభాగ్యలక్ష్మి, కోటేశ్వరరావు, నాగమహేష్, శ్రీను, భాణోతు రమేష్, నరేంద్ర సింహ, హరికృష్ణ, కేశవరావు, కిలారు శీను, డి వీరన్న రామారావు పాల్గొన్నారు.



# పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాలు, ఇందిరమ్మ ఇళ్లపై ప్రత్యేక కార్యదర్శి క్షేత్ర స్థాయి తనిఖీ

- **విద్యార్థులు లక్ష్యంతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలి :సిక్తా పట్నాయక్**

**జగిత్యాల, అఖండ సూర్య: జూన్ 22**

ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల ప్రత్యేక కార్యక్రమం అమలును పరిశీలించేందుకు ప్రభుత్వం నియమించిన ప్రత్యేక అధికారి, రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి సిక్తా పట్నాయక్ సోమవారం జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్‌తో కలిసి జగిత్యాల జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలును క్షేత్రస్థాయిలో తనిఖీ చేస్తూ సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా పూడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించిన సిక్తా పట్నాయక్ విద్యా ప్రమాణాలు, విద్యార్థుల హాజరు, బోధన విధానాలు, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలుపై జిల్లా విద్యాశాఖాధికారి, పాఠశాల ప్రధానోపాధ్యాయులతో సమీక్ష నిర్వహించారు.పదో తరగతి విద్యార్థులతో ప్రత్యేకంగా సమావేశమైన ఆమె, రాబోయే పరీక్షలను దృష్టిలో ఉంచుకుని ఇప్పటి నుంచే లక్ష్యంతో కూడిన ప్రణాళిక రూపొందించుకుని కష్టపడి చదవాలని సూచించారు. ప్రతి విద్యార్థి తన భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పట్టుదలతో శ్రమించి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు.విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న పాఠ్యపుస్తకాలు, నోటుబుక్కులు పూర్తిగా అందాయా అని ఆరా తీశారు. అలాగే మధ్యాహ్న భోజన పథకం అమలు, కోడిగుడ్ల సరఫరా, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాల గురించి నేరుగా విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.ఉపాధ్యాయుల హాజరు, బోధన నిర్వహణపై ప్రధానోపాధ్యాయులను ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు. గత విద్యా సంవత్సరంలోని ఎస్.ఎస్.సి ఫలితాలపై జిల్లా విద్యాశాఖాధికారి నుంచి సమాచారం సేకరించారు.అనంతరం పాఠశాలలోని డైనింగ్ హాల్, మధ్యాహ్న భోజన వంటశాలను పరిశీలించారు. ఎండీఎం నిర్వాహకులతో మాట్లాడి ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారమే విద్యార్థులకు భోజనం అందించాలని, పరిశుభ్రత ప్రమాణాలను పాటిస్తూ ఎలాంటి లోపాలకు తావు లేకుండా నిర్వహణ చేపట్టాలని సూచించారు.పాఠశాల ఆవరణలో కిచెన్ గార్డెన్‌ను సక్రమంగా నిర్వహించాలని సూచించిన ఆమె, మధ్యాహ్న భోజన పథకం నిర్వహణలో ఎల్పీజీ గ్యాస్ వినియోగంపై కూడా వివరాలు తెలుసుకున్నారు.విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, విద్య జీవితంలో అత్యంత విలువైన సంపద అని, క్రమశిక్షణతో చదువుకుని భవిష్యత్తులో ఉన్నత స్థానాలు అధిరోహించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్‌తో కలిసి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి, పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. తదుపరి కొడిమ్యాల మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి రోగులకు అందుతున్న వైద్య సేవలు, మందుల లభ్యత, వైద్య సిబ్బంది పనితీరు, ఆరోగ్య కేంద్రంలో ఉన్న సౌకర్యాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు కొనసాగించాలని సూచించారు.అనంతరం మల్యాల మండలం సర్వాపూర్ గ్రామంలో నిర్మాణంలో ఉన్న, పూర్తయిన ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి ఇళ్ల నిర్మాణ పురోగతి, ప్రభుత్వం అందిస్తున్న రూ.5 లక్షల ఆర్థిక సహాయంపై వివరాలు తెలుసుకున్నారు. పూర్తయిన ఇళ్లను సందర్శించి, నాణ్యతతో పాటు ఆకర్షణీయంగా నిర్మించినందుకు అభినందించారు.నిర్మాణంలో ఉన్న ఇళ్ల పనులను కూడా నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకం ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి సొంతింటి కల సాకారం అవుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, జిల్లా విద్యాశాఖాధికారి కె. రాము, డీ.పీ.ఓ మదన్‌మోహన్, స్థానిక తహసీల్దార్, ఎం.పీ.డీ.వో, జిల్లా విద్యాశాఖ కోఆర్డినేటర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



# జగిత్యాల పాత బస్టాండ్ వద్ద పోలీసు పెట్రోల్ బంక్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి

- **ముఖ్యమంత్రి కి మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి లేఖ**

**జగిత్యాల టౌన్,అఖండ సూర్య;**

జగిత్యాల పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ప్రతిపాదిత పెట్రోల్, డీజిల్ పంపును తక్షణమే ఏర్పాటు చేయాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డి మాట్లాడుతూ, పాత బస్టాండ్ సమీపంలోని పోలీసు క్వార్టర్స్ స్థలాన్ని వాణిజ్యపరంగా వినియోగించే అవకాశం ఉందన్నారు. ఆ ప్రదేశంలో పెట్రోల్ బంక్ ఏర్పాటు చేస్తే వాహనదారులకు మెరుగైన సేవలు అందడంతో పాటు ట్రాఫిక్ రద్దీ సమస్యకు కొంతమేర పరిష్కారం లభిస్తుందని తెలిపారు. ఈ ప్రతిపాదనకు సంబంధించి జిల్లా పోలీసు శాఖ ఉన్నతాధికారుల అనుమతులు కూడా లభించినట్లు సమాచారం ఉందని పేర్కొన్నారు. ఈ పెట్రోల్ బంక్ ఆదర్శవంతంగా నిర్వహించబడితే వచ్చే ఆదాయాన్ని పోలీసు సిబ్బంది కుటుంబాల సంక్షేమ కార్యక్రమాలకు వినియోగించే అవకాశం ఉంటుందని చెప్పారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ పంపు ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడంతో పాటు పోలీసు శాఖకు మంచి పేరు తీసుకువస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. జిల్లా ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని పెట్రోల్ బంక్ ఏర్పాటుకు వెంటనే చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రిని కోరినట్లు తెలిపారు. ముఖ్యమంత్రికి రాసిన లేఖ ప్రతిని పోలీసు ఉన్నతాధికారులకు పంపడంతో పాటు సోమవారం జగిత్యాల జిల్లా పోలీసు హెడ్ క్వార్టర్స్ లో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ కు లేఖను అందజేశారు.





## పదవ తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ

**గొల్లపెల్లి, అఖండ సూర్య:**
జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్లో సోమవారం ఎడమల భోజేందర్ రెడ్డి పదవ తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఉపకార వేతనాలను పంపిణీ చేశారు. ప్రథమ స్థానం సాధించిన చీర వైష్ణవి కి రూ.15 వేలు, ద్వితీయ స్థానం సాధించిన బండారు కీర్తికి రూ. 10 వేలు, తృతీయ స్థానం సాధించిన రంగు రసజ్ఞకు 5 వేల రూపాయలు ప్రోత్సాహకంగా అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు ఇంకా ఉన్నత స్థాయికి రావాలని అన్నారు.ఈ కార్యక్రమంలో చందు, రంజిత్ రెడ్డి ,రమేశ్ మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ రవి లు పాల్గొన్నారు.

## మత్తు పదార్థాలు జీవితాన్ని నాశనం చేస్తాయి




- **తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా చదవాలి**
- **యువత చదువుపై ఏకగ్రత పెంచుకోవాలి**
- **హుజురాబాద్ ఏసిపి మాధవి**

**అఖండ సూర్య, హుజురాబాద్,**

మత్తు పదార్థాలు వాడిన ప్రతి ఒక్కరి జీవితాన్ని నాశనం చేస్తాయని హుజురాబాద్ ఏసిపి మాధవి అన్నారు. కరీంనగర్ జిల్లా సిపి గౌస్ ఆలం ఆదేశాల మేరకు సోమవారం రోజున హుజురాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన మత్తు పదార్థాల అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ముఖ్యంగా యువత మత్తు పదార్థాలకు బానిసై తమ బంగారు భవిష్యత్తు నాశనం చేసుకుంటున్నారని అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలపై ఎన్నో ఆశలు పెట్టుకొని చదివిస్తారని వారి ఆశయాలకు అనుగుణంగా చదివి ప్రయోజకులు కావాలని అన్నారు. మత్తు పదార్థాల వాడకం వల్ల సంఘ విద్రోహ చర్యలకు పాల్పడే అవకాశం ఉంటుందని అన్నారు. ప్రతి విద్యార్థి తమ జీవితంలో ఒక గొప్ప ఆశయాన్ని ఏర్పాటు చేసుకొని దానికి అనుగుణంగా చదవాలని అన్నారు. విద్యార్థులు చదువుపై ఏకాగ్రత పెంచుకోవాలని అన్నారు. విద్యార్థులు చదువుకునే విద్యాసంస్థల వద్ద పరిసర ప్రాంతాల్లో మత్తు పదార్థాలు వాడకం కనిపిస్తే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని అన్నారు. వత్తు పదార్థాలకు దూరంగా ఉండి చదువుకు దగ్గరగా ఉంటే వృద్ధిలోకి వస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ కరుణాకర్ తో పాటు కళాశాల అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

## జిల్లా వైద్య & ఆరోగ్య శాఖ నూతన కార్యాలయాన్ని ప్రారంభించిన జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



**అఖండ సూర్య సంగారెడ్డి**
జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన నూతన జిల్లా వైద్య & ఆరోగ్య శాఖ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్య, ఆరోగ్య సేవలు అందించడంలో జిల్లా వైద్య & ఆరోగ్య శాఖ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. నూతన కార్యాలయం ద్వారా శాఖ కార్యకలాపాల నిర్వహణ మరింత సమర్థవంతంగా జరిగి, ప్రజలకు వేగవంతమైన సేవలు అందుతాయని పేర్కొన్నారు. జిల్లా ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య & ఆరోగ్య శాఖ అధికారి లలిత దేవి .కార్యాలయ సిబ్బంది, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యల పరిష్కారానికి వేదికగా ప్రజావాణి

- **ఫిర్యాదుదారులతో ప్రత్యక్షంగా మాట్లాడి సమస్యలు తెలుసుకున్న జిల్లా ఎస్పీ.**
- **ప్రతి ఫిర్యాదుపై నిష్పక్షపాత విచారణ జరిపి సత్వర న్యాయం అందించాలని అధికారులకు ఆదేశాలు.**
- **జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోండి. - జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్.**

**అఖండ సూర్య సంగారెడ్డి:**



జిల్లా ప్రజల సమస్యల సత్వర పరిష్కారానికి ప్రతి సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ఈ రోజు ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్., ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఫిర్యాదుదారులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి సమస్యలను ఓపికగా విని, సంబంధిత అంశాలపై స్థానిక ఎస్.హెచ్.ఓ లతో ఫోన్ ద్వారా మాట్లాడి వివరాలు తెలుసుకొని, ప్రతి ఫిర్యాదును నిష్పక్షపాతంగా విచారణ జరిపి, బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, మీ సమస్యలకు స్థానిక పోలీస్ స్టేషన్లలో పరిష్కారం దొరకనప్పుడు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి సేవలు వినియోగించుకోవాలని ప్రజలకు సూచించారు. ప్రజావాణి ద్వారా అందిన ప్రతి ఫిర్యాదులపై జిల్లా పోలీసు కార్యాలయం నుంచి ప్రత్యేక పర్యాయవేక్షణ కొనసాగుతుందని, సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ తెలిపారు. ప్రజలకు త్వరితగతిన, పారదర్శకంగా న్యాయం అందించడమే సంగారెడ్డి జిల్లా పోలీసు శాఖ లక్ష్యమని ఎస్పీ పేర్కొన్నారు.

# సింగరేణి విశ్రాంత ఉద్యోగులకు రు.30 లక్షల ప్రమాద బీమా

**మంచిర్యాల,అఖండ సూర్య :**
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సింగరేణి విశ్రాంత ఉద్యోగులకు 30 లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పించినందుకు సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు, ఉద్యోగుల సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా (SBI) మెయిన్ బ్రాంచ్ మేనేజర్ అలోక్ వర్మ ను సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం మంచిర్యాల జిల్లా ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్బీఐ మేనేజర్ మాట్లాడుతూ ఎస్బీఐ బ్యాంకు లలో ఖాత లు కలిగి ఉన్న 70 సంవత్సరాల లోపు కోల్ మైన్స్ పెన్షనర్లకు ప్రమాద బీమా కింద 30లక్షల వరకు మరణించిన వారి కుటుంబానికి ఆసరాగా అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని కోల్ మైన్స్ పెన్షన్ దారులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు . సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు మాట్లాడుతూ కోల్ మైన్స్ పెన్షన్ దారులకు 30 లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పించిన ఎస్బీఐ యాజమాన్యానికి , రాష్ట్ర ముఖ్యమంత్రికి, మంత్రులకు, సింగరేణి సి అండ్ ఎండి కి, డైరెక్టర్ లకు కృతజ్ఞతలు తెలిపారు. 130 సంవత్సరాల సింగరేణి చరిత్ర లో ఇతర ఏ సంస్థ లో లేని విధంగా కోల్ మైన్స్ పెన్షన్ దారులకు 30 లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పించడం వారి కుటుంబానికి బరోసా , చేయూత అందించడం ఒక్క గొప్ప చరిత్రాత్మకమైన నిర్ణయమని పేర్కొన్నారు . ఈ కార్యక్రమంలో ఎస్బీఐ బ్యాంకు అకౌంటెంట్ రంజిత్ కుమార్, సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం, తెలంగాణ ఉద్యమ కారుల ఐక్య వేదిక అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్య, గౌరవ అధ్యక్షుడు రాళ్లబండి రాజన్న , ప్రధాన కార్యదర్శి పుదారి నర్సయ్య, ఉపాధ్యక్షుడు ఏ.గంగయ్య, పి.రాంరెడ్డి , బూర్ల జ్ఞాని , కార్యదర్శి అడిచర్ల రాజేశం, నాయకులు గుజ్జ చందు , సర్వేశ్వర చారి పాల్గొన్నారు.



# కాలుష్యాన్ని కప్పిపుచ్చే సుందరీకరణ నాటకాలను ఆపాలి


- **జిల్లా ప్రజావాణిలో కలెక్టర్ గారికి దోమడుగు కాలుష్య వ్యతిరేక పోరాట కమిటీ మరియు టీపీ జె.ఏ.సి సంయుక్త వినతి**

**అఖండ సూర్య సంగారెడ్డి**
ఏళ్ల తరబడి పారిశ్రామిక వ్యర్థాలతో కాలుష్యమయమైన దోమడుగు నల్లకుంట చెరువును రసాయన రహితంగా శుభ్రం చేయకుండా, కేవలం "సుందరీకరణ" పేరుతో ఆ కాలుష్యాన్ని కప్పిపుచ్చే చర్యలకు పాల్పడుతున్న హెటెరో కంపెనీ యాజమాన్యానికి స్థానిక తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్ సహకరించడం అత్యంత విచారకరమని దోమడుగు కాలుష్య వ్యతిరేక పోరాట కమిటీ మరియు తెలంగాణ పీపుల్స్ జె.ఏ.సి ( తీపి జెఏసి ) నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం సంగారెడ్డి కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా ప్రజావాణి కార్యక్రమంలో నూతన కలెక్టర్ గారిని కలిసి నిరసన వ్యక్తంచేస్తూ ఒక సమగ్ర వినతిపత్రాన్ని సమర్పించారు. దీనిపై కలెక్టర్ గారు సానుకూలంగా స్పందిస్తూ, ఈ వ్యవహారాన్ని పూర్తి స్థాయిలో పరిశీలిస్తామని హామీ ఇచ్చారు.

**ఉత్తర్వులను తుంగలో తొక్కారు:**
గతంలో 201213లో చెరువు నీరు పింక్ రంగులోకి మారినప్పుడు, నాటి కలెక్టర్ గారి ఆదేశాల మేరకు పీసీబీ ఉత్తర్వులు జారీ చేసి, కలుషిత నీటిని కంపెనీయే సొంత ఖర్చుతో ఖాళీ చేయించేలా చర్యలు తీసుకుంది. కానీ ఆ తర్వాత ప్రతి సంవత్సరం కంపెనీ దొంగచాటుగా రసాయనాలను వదులుతూనే ఉంది. ఈ ఏడాది జనవరి 1న పీసీబీ తాజా క్లోజర్ వార్నింగ్ ఇచ్చినా యాజమాన్యం తీరు మారలేదు.

**కోర్టు పరిధిలో ఉండగానే అక్రమ పనులు**
ఈ కాలుష్య సమస్యపై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ సుమోటో కేసు (239/2025) విచారణలో ఉన్నది. కోర్టు పరిధిలో నడుస్తుండగా, చెరువులోని రసాయన విషాన్ని శాస్త్రీయంగా శుద్ధి చేయకుండా, సాక్ష్యాలను నాశనం చేయడానికి కంపెనీ చేస్తున్న సుందరీకరణ పనులకు మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్ ఎలా సహకరిస్తారని నేతలు నిలదీశారు. మున్సిపల్ కమిషనర్‌కు రాతపూర్వక అభ్యంతర లేఖ ఇచ్చినప్పటికీ ఎలాంటి ఉలుకూ పలుకూ లేకుండా మౌనంగా ఉండటం వారి నిస్సహాయతను చూపుతోంది.

**జీవించే హక్కును కాపాడాలి**



రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం ప్రతి పౌరుడికి స్వచ్ఛమైన గాలి, నీరు పొందే హక్కు ఉంది. ఈ కాలుష్యం వల్ల గ్రామంలో మహిళలకు గర్భవిచ్ఛిన్నాలు, క్యాన్సర్లు, కిడ్నీ వ్యాధులు పెరుగుతూ ప్రజల ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి. కడుపులో విషం నింపి, ముఖానికి పౌడర్ రాసినట్లుగా చేస్తున్న ఈ సుందరీకరణ పనులను తక్షణమే నిలిపివేసి, సుప్రీంకోర్టు 'Polluter Pays' సూత్రం ప్రకారం చెరువును పూర్తిస్థాయిలో రసాయన రహితంగా ప్రక్షాళన చేయాలని డిమాండ్ చేశారు.

**హాజరైన ప్రతినిధులు**
ఈ ప్రజావాణి కార్యక్రమంలో కాలుష్య వ్యతిరేక పోరాట కమిటీ దోమడుగు కన్వీనర్లు మంగయ్య, బాల్ రెడ్డి, కోకన్వనర్లు సత్తిరెడ్డి, రాఘవరెడ్డి, వెంకటేష్, రాజు చారి, శ్రీనివాస్ రెడ్డి మరియు టీపీ జె.ఏ.సి జిల్లా చైర్మన్ వై. అశోక్ కుమార్, కోకన్వినర్లు ఆర్. లక్ష్మి, ఏ. మానస తదితరులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి





- **యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండి ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలి**
- **జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**

**అఖండ సూర్య సంగారెడ్డి**
మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ బాధ్యతా యుతంగా వ్యవహరించాలని, ముఖ్యంగా యువత డ్రగ్స్ మరియు ఇతర వ్యసనాలకు దూరంగా ఉండి తమ భవిష్యత్తును సురక్షితంగా తీర్చిదిద్దుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న “నషా ముక్త్ భారత్ సప్తాహ్” కార్యక్రమంలో భాగంగా సోమవారం జిల్లా కలెక్టరేట్ లో కలెక్టర్ ప్రతీక్ జైన్ “నషా ముక్త్ భారత్ అభియాన్ - వికసిత్ భారత్ కి పహచాన్” పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని, మాదకద్రవ్యాల వ్యసనం వ్యక్తిగత ఆరోగ్యానికే కాకుండా కుటుంబాలు, సమాజం మరియు దేశ అభివృద్ధికి కూడా తీవ్ర ముప్పుగా మారుతుందని అన్నారు. మాదకద్రవ్యాల నిర్మూలన కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. జూన్ 17 నుండి జూన్ 26 వరకు నిర్వహిస్తున్న “నషా ముక్త్ భారత్ సప్తాహ్ - 2026” ద్వారా మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై ప్రజలకు అవగాహన కల్పించడం, యువతను వ్యసనాలకు దూరంగా ఉంచడం, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి తోడ్పడడం ప్రధాన లక్ష్యమని తెలిపారు. మాదకద్రవ్యాల వ్యసనానికి గురైన వారికి సకాలంలో సహాయం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం 14446 నేషనల్ డీఅడిక్షన్ హెల్ప్‌లైన్ సేవలను అందుబాటులో ఉంచిందని, అవసరమైన వారు ఈ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా కలెక్టర్లు సంగీత, పాండు, జిల్లా సంక్షేమ అధికారి లలిత కుమారి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. లలితా దేవి, డీఆర్‌డీఓ జ్యోతి, జిల్లా పరిషత్ సీఈఓ జానకి రెడ్డి, రెవెన్యూ డివిజనల్ అధికారి రాజేందర్, తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ప్రగతి ప్రణాళిక కార్యక్రమాలపై సమగ్ర నివేదికలు అందించాలి



- **జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**

**అఖండ సూర్య సంగారెడ్డి**
ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా జిల్లాలో నిర్వహించిన వివిధ కార్యక్రమాలకు సంబంధించిన సమగ్ర నివేదికలను శాఖల వారీగా సిద్ధం చేసి సమర్పించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ గ్రీవెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం అనంతరం అన్ని శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, రెవెన్యూ అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, ప్రగతి ప్రణాళిక కార్యక్రమాల అమలును పర్యవేక్షించి, సమీక్షించేందుకు ప్రభుత్వం అన్ని జిల్లాలకు ప్రత్యేక అధికారులను నియమించిందన్నారు. సంగారెడ్డి జిల్లాకు ప్రత్యేక అధికారిగా నియమితులైన ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ, సీనియర్ ఐఏఎస్ అధికారి డా. క్రిస్టినా జడ్ చోంగ్తు జిల్లాకు విచ్చేసి ప్రగతి ప్రణాళిక కార్యక్రమాల అమలుపై సమీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ఆయా శాఖలు తమ పరిధిలో గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిలలో అలాగే వార్డులు, మున్సిపల్ పట్టణాల్లో నిర్వహించిన గ్రామ సభలు, ప్రత్యేక సమావేశాలు, అవగాహన కార్యక్రమాలు తదితర కార్యక్రమాల పూర్తి వివరాలను సమగ్రంగా సిద్ధం చేసి సోమవారం సాయంత్రంలోపు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రగతి ప్రణాళిక సభల సందర్భంగా ప్రజల నుంచి అందిన వినతులు, సమస్యలు, వాటి పరిష్కారానికి చేపట్టిన చర్యలు, శాఖల వారీగా థీమ్ ఆధారంగా అమలు చేసిన కార్యక్రమాలు, వివిధ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారులకు చేకూరిన ప్రయోజనాలు, సాధించిన లక్ష్యాలు తదితర అంశాలను నివేదికల్లో స్పష్టంగా పొందుపరచాలని సూచించారు. ప్రజా పాలన లక్ష్యాలను సమర్థవంతంగా అమలు చేయడంలో ప్రతి శాఖ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, నివేదికలు ఖచ్చితమైన సమాచారంతో సిద్ధం చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు, అన్ని శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.



## సంపాదకీయం




# ఏపీలో సర్.. డర్

**తిరుపతి, అఖండ సూర్య :**

అధికార పార్టీ అయినా.. అపోజిషన్ లీడర్లు అయినా ఇప్పుడు అందరికీ ఒకటే ఫోబియా. తమిళనాడు, పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో ప్రభుత్వాలు మారాయి.. బెంగాల్‌లో దీదీకి చుక్కలు కనిపిస్తున్నాయి. అటు టీఎంసీ, ఇటు డీఎంకే ఓడటమే కాదు.. రెండు పార్టీల అధినేతలు సీఎంగా ఉండి సొంత సీటులో ఓటమి చవిచూశారు. ఇదంతా సరే. ఆ స్టేట్స్‌లో వాళ్లిద్దరు ఓడితే.. ఏపీలో పార్టీలకు, లీడర్లకు టెన్షన్ ఎందుకనే కదా డౌట్. అక్కడికే వస్తున్నా.. కేంద్రం చేపట్టిన సర్ ప్రక్రియే.. బెంగాల్‌లో గెలుపోటముల్ని డిసైడ్ చేసిందన్న ప్రచారంతో ఢిల్లీ టు అమరావతి.. ఆ సర్ చుట్టూనే రాజకీయాలు చక్కర్లు కొడుతున్నాయి. ముఖ్యంగా ఏపీలో అపోజిషన్‌లో వైసీపీ అయితే ఫుల్ అటెన్షన్ మోడ్‌లోకి వచ్చేసింది. అందరికంటే ముందే సర్ పై తాడేపల్లి క్యాంప్ ఆఫీస్‌లో కీలక సమావేశం నిర్వహించిన జగన్.. లీడర్లకు దిశానిర్దేశం చేశారు. అలర్ట్‌గా ఉండాలని.. ఎక్కడా తమ పార్టీకి చెందిన ఓటర్ల ఓట్లు పోకుండా క్రాస్ వెరిఫికేషన్ చేసుకోవాలని సూచించారు.స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్`సర్. మరణించిన, చిరునామా మారిన, అలాగే డూప్లికేట్ ఓట్లను తొలగించడం, కొత్త ఓటర్లను నమోదు చేయడం సర్ ముఖ్య ఉద్దేశం. 2002 ఓటరు జాబితాతో మ్యాపింగ్ చేసుకుంటూ, తాజా ఓటర్ల వివరాలు సేకరిస్తూ వస్తున్నారు. బూత్ లెవల్ అధికారులు డోర్ టు డోర్ సర్వే చేస్తున్నారు. ఏపీలో ఈ నెల 15న మొదలైన ఈ ప్రక్రియ వచ్చే నెల 15 వరకు.. నెలరోజుల పాటు కొనసాగుతుంది. బూత్ లెవల్ ఆఫీసర్లు ఇంటికి వచ్చినప్పుడు ఓటర్లు లేకపోతే అంతే సంగతులు. ఈ మాటే అటు పార్టీలకు.. ఇటు లీడర్లకు కంటిమీదు కునుకు లేకుండా చేస్తోంది. డిసెంబర్‌లో కొన్ని రాష్ట్రాల్లో జరిగిన ఎసఐఆర్ ప్రక్రియ ఈ ఏడాది జరిగిన రెండు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలను తీవ్రంగా ప్రభావితం చేసిందన్న వాదన బలంగా ఉంది. సర్ ప్రక్రియనే కొందరు ముఖ్యనేతల తలరాతలను మార్చేసిందన్న టాక్ వినిపిస్తోంది. సర్ ప్రక్రియ కింద ఒక్క తమిళనాడు రాష్ట్రంలోనే 97లక్షల ఓట్లు తొలగించినట్లు అంచనా. ఈ ఓట్లు తొలగింపు దాదాపు 40 అసెంబ్లీ నియోజకవర్గాల ఫలితాలపై తీవ్ర ప్రభావం చూపిందని అంటున్నారు. డీఎంకే అధినేత స్టాలిన్ పోటీ చేసిన కొలత్తూరు నియోజకవర్గంలో ఏకంగా లక్షకు పైగా ఓట్లను ఎసఐఆర్ ప్రక్రియలో తొలగించారు. ఆయన కొలత్తూరులో 8వేల 795 ఓట్ల తేడాతో ఓడిపోయారు. పెద్దఎత్తున జరిగిన ఓట్లు తొలగింపే కొలత్తూరులో స్టాలిన్‌ను ఓటమి పాలు చేసిందని బలంగా నమ్ముతున్నారు డీఎంకే నేతలు. ఇక పశ్చిమ బెంగాల్‌లో 91 లక్షలకు పైగా ఓట్లు డిలీటయ్యాయి. ఆ స్టేట్‌లోని మొత్తం ఓట్లలో ఇది దాదాపు 12 శాతం. ఒక్క ఓటుతోనే నేతల జాతకాలు, తలరాతలు మారుతున్న పరిస్థితి. అలాంటిది 12 శాతం ఓట్లు లేకుండా పోతే..రిజల్ట్ షాకింగ్‌గా ఎందుకుండవన్న చర్చ జరుగుతోంది. బెంగాల్‌లో 294 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 30 స్థానాల్లో గెలుపు మార్జిన్ కంటే, అక్కడ తొలగించిన ఓట్లే ఎక్కువ. టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ పోటీ చేసిన భవానీపూర్‌లో 50 వేల ఓట్లు డిలీట్ అయ్యాయట. ఆమె 15 వేల ఓట్లతో ఓడిపోయారు. ఆ రెండు రాష్ట్రాల్లో జరిగిన ఓట్ల తొలగింపు..ఫలితాలు తారుమారైన సీన్‌ను గుర్తు చేసుకుంటే చాలు..ఏపీల పార్టీలకు వణుకు పుడుతోందటబెంగాల్, తమిళనాడు ఎన్నికలకు ముందు S.ఎ.ఖీపై ఏ పార్టీ పెద్ద సీరియస్‌గా కాన్సన్‌ట్రేట్ చేయలేదు. వన్స్ అక్కడ సీన్ మారిపోవడంతో ఏకంగా వరుసపెట్టి సమావేశాలు నిర్వహిస్తూ క్యాడర్‌ను అలర్ట్ చేస్తున్నాయి పార్టీలు. సిట్టింగ్ ఎమ్మెల్యేలే కాకుండా ప్రతిపక్ష నేతలు తమ అనుచరులను.. సర్ ప్రక్రియ చేపడుతున్న సిబ్బంది వెంట తిప్పుతున్నారు. బూత్ లెవల్ ఏజెంట్లను యాక్టివ్ చేస్తున్నారు. ఏ ఓటు తీసేస్తున్నారు.? ఏ ఓటు కలుపుతున్నారన్న దానిపై నాయకులు ఏ రోజుకు ఆ రోజు డేటా తెప్పించుకుని పరిశీలిస్తున్నారట. ముఖ్యంగా గత ఎన్నికల్లో తక్కువ మార్జిన్‌తో అంటే ఐదు నుంచి పదివేలలోపు ఓట్ల తేడాతో విజయం సాధించిన నేతల గుండెల్లో ఎసఐఆర్ గుబులు రేపుతోందట. ఈ ప్రక్రియ వచ్చే ఎన్నికల ఫలితాలపై ఎలాంటి ప్రభావం చూపిస్తుందన్న కంగారు నాయకుల్లో మొదలైంది.అర్బన్ ఏరియాల్లో కంటే రూరల్ ఏరియాలోని దీని ప్రభావం ఎక్కువగా కనిపిస్తోంది. చాలామంది గ్రామీణ ప్రాంతాల్లో నివసించే ఓటర్లు ఉపాధి కోసం లేక వివిధ పనుల నిమిత్తం దగ్గరలో ఉన్న నగరాలకు వెళ్తుంటారు. సర్ ప్రక్రియ కోసం సిబ్బంది ఇంటికి వెళ్లినప్పుడు.. డోర్ లాక్ చేసి ఉంటే ఓట్లు గల్లంతయ్యే ప్రమాదం ఉందని అంటున్నారు. తాము ఊర్లోనే నివసిస్తున్నామని రుజువు చూపిస్తే తప్ప ఓటు నిలబడే అవకాశం లేదట.ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పలువురు అధికార పార్టీ నేతలు అయితే ఎన్నికల సిబ్బంది వెంట తమ షాడో టీమ్‌లను పంపిస్తున్నారు. తమకు అనుకూలమైన ఓటర్లను తొలగించడానికి సిద్ధపడితే వెంటనే అడ్డు చెబుతున్నారు. ఎసఐఆర్ ప్రక్రియలో పాల్గొంటున్న సిబ్బందికి కూడా ఇది కొత్త తలనొప్పులు తెచ్చిపెడుతోంది. తమ ఓట్లను కాపాడుకునేందుకు ఇటు అధికార పార్టీ, అటు ప్రతిపక్ష పార్టీలు ఈ నెల రోజులు నానా తంటాలు పడాల్సిన పరిస్థితి చాలా స్పష్టంగా కనిపిస్తోంది.ఏపీలో సర్ ప్రక్రియ ముగిసేలోపు ఎన్ని ఓట్లు గల్లంతవుతాయోనన్న భయం నాయకులను వెంటాడుతోంది. గత ఎన్నికల్లో తక్కువ మార్జిన్‌తో ఓడిపోయిన వారిలోనే కాకుండా, తక్కువ మార్జిన్‌తో గెలిచిన వారిపై కూడా ఎసఐఆర్ ప్రభావం ఎంతవరకు ఉంటుందో చూడాలి మరి.

# కదిరిలో సవాళ్లు.. ప్రతి సవాళ్లు

**అనంతపురం, అఖండ సూర్య :**

సత్యసాయి జిల్లాలో టీడీపీ వర్సెస్ వైసీపీ రాజకీయాలు జోరుగా సాగుతున్నాయి. ముఖ్యంగా కదిరి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ , వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మధ్య మాటల యుద్ధం తారాస్థాయికి చేరుకుంది. స్థానిక టీడీపీ ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రవీణ్ రెడ్డి మధ్య నడుస్తున్న వ్యక్తిగత ఆరోపణలు, సవాళ్లు కదిరి రాజకీయాలను వేడెక్కిస్తున్నాయి. ఇరు పార్టీల నేతలు అవినీతి, కబ్జాలు, కుటుంబ సభ్యులపై ఆరోపణలతో బహిరంగ చర్చలకు సై అంటూ సవాళ్లు విసురుకుంటున్నారు. కదిరి టీడీపీ ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ ఇటీవల చేసిన వ్యాఖ్యలపై వైసీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రవీణ్ రెడ్డి తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి స్థాయి వేరు.. ఆయన తండ్రి వైఎస్సార్ కూడా ముఖ్యమంత్రిగా పనిచేశారు. అలాంటి నాయకుడి భార్యను అకారణంగా రాజకీయాల్లోకి లాగి అవమానిస్తావా అంటూ ప్రవీణ్ రెడ్డి ఎమ్మెల్యేను నిలదీశారు. నీతి, నిజాయితీల గురించి మాట్లాడే ముందు ఎమ్మెల్యే తన గతం, చరిత్ర గురించి ఆలోచించుకోవాలని, మహిళల గురించి మాట్లాడే ముందు కొంత సంస్కారం నేర్చుకోవాలని హితవు పలికారుఎమ్మెల్యే ప్రసాద్ అవినీతి గురించి మాట్లాడితే కదిరి ప్రజలు నవ్వుకుంటున్నారని ప్రవీణ్ రెడ్డి ఎద్దేవా చేశారు. కదిరి నియోజకవర్గంలో బ్రాందీ షాపులు, పల్లెల్లో బెల్ట్ షాపులు పెట్టించి.. మద్యం బాటిల్‌పై రూ. 20 నుండి రూ. 40 వరకు అధికంగా అమ్మించి కమిషన్లు దండుకుంటోంది ఎమ్మెల్యే కాదా? అని ప్రశ్నించారు. ఆ అక్రమంగా వసూలు చేసిన డబ్బులు మీ ఇంట్లో వాళ్లు ఇస్తున్నారా అని మేము అడిగితే అది తప్పు అవుతుందా? అని ఘాటుగా నిలదీశారు. అంతేకాకుండా, కదిరిలో ఎమ్మెల్యే తన ఇంటి ముందున్న దేవుడి మాన్యం స్థలాన్ని 15 ఏళ్లుగా కబ్జా చేసి సొంత పార్కింగ్‌గా వాడుకోవడం నిజం కాదా అంటూ దేవాదాయ శాఖ భూముల కబ్జాపై సంచలన ఆరోపణలు చేశారు. గడిచిన రెండున్నరేళ్ల కాలంలో కదిరి నియోజకవర్గానికి ఎమ్మెల్యే చేసిన అభివృద్ధి శూన్యమని ప్రవీణ్ రెడ్డి విమర్శించారు. ముఖ్యంగా కదిరిలో మైనార్టీ ముస్లింలపై ఎమ్మెల్యే కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. పేద ముస్లింలు పెళ్లిళ్లు చేసుకునే ప్రభుత్వ షాదీ మహల్‌కు రెండున్నరేళ్లుగా ఎందుకు తాళాలు వేశారు? వారు చేసిన పాపం ఏంటి? అని ప్రశ్నించారు. ఇది చాలదన్నట్లు, కదిరి కాలేజీ సర్కిల్‌లో కోట్ల రూపాయల విలువైన వక్ఫ్ బోర్డు స్థలంలో ముస్లింల సమాధులను సైతం తొలగించి, ఆ స్థలాన్ని కబ్జా చేసి ప్లాట్లుగా వేసి అమ్ముకోవాలని ఎమ్మెల్యే ప్రయత్నించడం వాస్తవం కాదా అంటూ నిలదీశారు.కదిరిలో తాను అడిగిన సూటి ప్రశ్నలకు ఎమ్మెల్యే ప్రసాద్ నేరుగా సమాధానం చెప్పాలని, తన అనుచరులను ప్రయోగించి పారిపోవద్దని ప్రవీణ్ రెడ్డి సవాల్ విసిరారు. వారిని బలి చేయవద్దు. రేపు ప్రభుత్వం మారితే నీకంటే ముందు వాళ్లే కేసుల్లో ఇరుక్కుంటారు, అప్పుడు వారి పరిస్థితి ఏమిటో ఆలోచించు అని హెచ్చరించారు. మనం ఇద్దరం నేరుగా కూర్చుని కదిరి అభివృద్ధిపై, కబ్జాలపై మాట్లాడుకుందాం. ఏ చర్చకైనా నేను సిద్ధం అంటూ బహిరంగ చర్చకు సవాల్ విసిరారు. ప్రస్తుతం కదిరిలో వైసీపీ వర్సెస్ టీడీపీ మధ్య జరుగుతున్న ఈ మాటల యుద్ధం రోజురోజుకూ తీవ్రరూపం దాల్చుతోంది. భూకబ్జాలు, మద్యం మాఫియా, వక్ఫ్ ఆస్తుల ఆక్రమణల వంటి కీలకమైన ఆరోపణలు తెరపైకి రావడంతో స్థానిక రాజకీయాలు వేడెక్కాయి. ప్రవీణ్ రెడ్డి విసిరిన ఈ సవాళ్లపై ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ , టీడీపీ శ్రేణులు ఏ విధంగా స్పందిస్తాయో, ఈ బహిరంగ చర్చ సవాల్ ఎక్కడి వరకు దారితీస్తుందో అని కదిరి ప్రజలు ఆసక్తిగా గమనిస్తున్నారు.



# విరాళాల వివాదం



అయోధ్య వేర్వేరు సందర్భాల్లో దేశ విదేశాల దృష్టిని ఆకర్షించింది. అయితే ఈసారి కారణం ఆలయ ఉద్యమం, దాని వైభవం లేదా భక్తుల రద్దీ కాదు.శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ పనితీరు, ఆలయ విరాళాల చుట్టూ తలెత్తుతున్న తీవ్ర అవకతవకల ఆరోపణలు చర్చనీయాంశంగా మారాయి.సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ రామ్ జన్మభూమి ట్రస్ట్‌ను లక్ష్యంగా చేసుకుని తీవ్ర విమర్శలు చేశారు.ట్రస్ట్ కళ్లముందే ఆలయ విరాళాలు, కానుకల లెక్కల్లో పెద్ద ఎత్తున తేడాలు జరిగాయని, రామాలయ కానుకల నుంచి కోట్ల రూపాయలు మాయమయ్యాయని ఆయన ఆరోపిస్తున్నారు.ఆయనతో పాటు కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీలతో పాటు స్థానిక మాజీ కరసేవకుడు సంతోష్ దూబే, బీజేపీ నాయకుడు డాక్టర్ రజనీశ్ సింగ్ తదితరులు ఈ అవకతవకలను ప్రస్తావిస్తూ జవాబుదారీతనం ఉండాలని డిమాండ్ చేస్తున్నారు.రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం ప్రస్తుతం ఈ ఆరోపణలపై విచారణ సాగిస్తోంది. అయితే, ఈలోగా అయోధ్య స్థానికులు, ఇక్కడికి వచ్చే భక్తులలో తీవ్ర నిరాశ, ఆగ్రహం స్పష్టంగా కనిపిస్తున్నాయి.కోట్లమంది నమ్మకం, త్యాగాల ఫలితంగా నిర్మితమైన ఆలయం చుట్టూ ఇలాంటి ఆర్థిక ఆరోపణలు రావడంపై భక్తులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దీన్ని అయోధ్యకు మచ్చ తెచ్చే అంశంగా భావిస్తే, మరికొందరు పారదర్శకత కోసం విచారణ అవసరమని అంటున్నారు.ఈ వివాదాలన్నింటికీ కేంద్ర బిందువుగా మారిన శ్రీ రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్‌లో జనరల్ సెక్రటరీ, విశ్వహిందూ పరిషత్ ఉపాధ్యక్షుడైన చంపత్ రాయ్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది.2020 ఫిబ్రవరిలో అయోధ్య కేసులో సుప్రీంకోర్టు తీర్పు తర్వాత, న్యాయస్థానం ఆదేశాల మేరకు కేంద్ర ప్రభుత్వం శ్రీ రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్‌ను ఏర్పాటు చేసింది. 15 మంది సభ్యులతో కూడిన ఈ ట్రస్ట్‌లో అధ్యక్షుడిగా మహంత్ నృత్య గోపాల్ దాస్, కోశాధికారిగా స్వామి గోవింద్ దేవ్ గిరి, సీనియర్ న్యాయవాది కె. పరాశరన్, డాక్టర్ అనిల్ మిశ్రా, కామేశ్వర్ చౌపాల్, మహంత్ దినేంద్ర దాస్ సహా పలువురు మత, సామాజిక ప్రతినిధులు ఉన్నారు.ట్రస్ట్ జనరల్ సెక్రటరీగా ఉన్న చంపత్ రాయ్.. దీని రోజువారీ కార్యకలాపాలను పర్యవేక్షించే అత్యంత కీలకమైన అధికారి. ఆలయ నిర్మాణ ప్రాజెక్టు, విరాళాలు `కానుకల నిర్వహణ, అధికారిక సంప్రదింపుల బాధ్యత ఆయనపైనే ఉండటంతో మీడియా ప్రతినిధులు ఆయన సమాధానం కోసం ప్రయత్నిస్తున్నారు.ఇటీవల విడుదల చేసిన ఒక వీడియోలో చంపత్ రాయ్ ఈ ఆరోపణలను ఖండించారు."శ్రీ రామ జన్మభూమి తీర్థ క్షేత్రం తన వివిధ పనులకు సంబంధించి సమయానుసారం ఆడిట్ నిర్వహిస్తూనే ఉంటుంది. హుండీ కౌంటింగ్ రూమ్ ఆడిటింగ్‌ను రామాలయ తీర్థ క్షేత్ర ట్రస్టీలు, కార్యకర్తలు, స్టేట్ బ్యాంక్ ఉద్యోగులు కలిసి చేస్తారు. ఈ ప్రక్రియ చాలా రోజుల పాటు సాగుతుంది. ప్రస్తుతం ఆ పనే జరుగుతోంది. ఇప్పటివరకు ఎలాంటి తప్పులూ మా దృష్టికి రాలేదు" అన్నారు. చంపత్ రాయ్‌ను సంప్రదించడానికి ప్రయత్నించినప్పటికీ ఎలాంటి స్పందనా రాలేదు. ఆయన సాధారణంగా అయోధ్యలోని కరసేవక్ పురంలో నివసిస్తుంటారు. కానీ, మేం అక్కడికి వెళ్లినప్పుడు.. గత ఏడెనిమిది రోజులుగా, అంటే సిట్ దర్యాప్తు ప్రారంభమైనప్పటి నుంచి ఆయన ఆలయ ప్రాంగణంలోనే ఉంటున్నారని విశ్వహిందూ పరిషత్ సభ్యుడొకరు మాకు తెలిపారు.అయోధ్యలోని స్థానికులు, వ్యాపారులు, సంత్`మహంత్‌లు లేదా రామాలయంతో సంబంధం ఉన్న సామాజిక, మతపరమైన సంస్థల ప్రతినిధులు.. ఇలా వరితో మాట్లాడినా, వారిలో చాలామంది తాజా వివాదం విని తామేమీ ఆశ్చర్యపోలేదని చెప్పారు. గత కొన్నేళ్లుగా ఆలయం, ట్రస్ట్‌కు సంబంధించి రకరకాల వార్తలు, చర్చలు ఎప్పటికప్పుడు బయటకు వస్తూనే ఉన్నాయని, అందుకే ఈ ప్రశ్నలు తలెత్తడం తమకు కొత్తేమీ కాదని కొందరు అభిప్రాయపడ్డారు.అయితే చంపత్ రాయ్ పాత్రపై అభిప్రాయాలు భిన్నంగా ఉన్నాయి. అవకతవకల్లో చంపత్ రాయ్ వ్యక్తిగత ప్రమేయం ఉండే అవకాశం లేదని ఆయన మద్దతుదారులు నమ్ముతున్నారు.మరోవైపు, విమర్శకులు మాత్రం ఆయనకు తెలియకుండా ఇంత పెద్ద స్థాయిలో పొరపాట్లు జరగడం అసాధ్యమని వాదిస్తున్నారు. వ్యక్తిగత నిజాయితీ ఎలా ఉన్నా, సంస్థలో జరిగే వాటికి



ఆయనే జవాబుదారీ వహించాలని స్పష్టం చేస్తున్నారు. ట్రస్ట్‌పై ఇలాంటి ఆరోపణలు రావడం ఇదే మొదటిసారి కాదు. జూన్ 2021లో అయోధ్యలో కొనుగోలు చేసిన ఒక భూమికి సంబంధించి ట్రస్ట్‌పై ఆరోపణలు వచ్చాయి. ఆమ్ ఆద్మీ పార్టీ, సమాజ్‌వాదీ పార్టీ నాయకులు దీనిపై స్పందిస్తూ.. 'ఒక వ్యక్తి రెండు కోట్ల రూపాయలకు కొన్న భూమిని, ఆ ఒప్పందం జరిగిన కొద్ది నిమిషాలకే ట్రస్ట్ 18.5 కోట్ల రూపాయలు చెల్లించి కొనుగోలు చేసింది' అని ఆరోపించారు.ఈ మొత్తం వ్యవహారంపై విచారణ జరపాలని వారు డిమాండ్ చేశారు. ఆ సమయంలో కాంగ్రెస్‌తో పాటు పలు ప్రతిపక్ష పార్టీలు కూడా ఈ విషయంలో పారదర్శకత ఉండాలని కోరాయి.అయితే, చంపత్ రాయ్, ట్రస్ట్ ఈ ఆరోపణలను తిరస్కరించారు. భూమి కొనుగోళ్లన్నీ పారదర్శకంగా జరిగాయని, చెల్లింపులన్నీ బ్యాంకింగ్ మార్గాల ద్వారానే చేశామని, మార్కెట్ ధర కంటే తక్కువకే ఆ భూమిని ట్రస్ట్ కొనుగోలు చేసిందని స్పష్టం చేశారు.ఈ ఆరోపణలు 'తప్పుదోవ పట్టించేవిగా, 'రాజకీయ దుర్బుద్ధితో కూడినవిగా' ఉన్నాయని చంపత్ రాయ్ కొట్టిపారేశారు.కానీ, రాజకీయ పార్టీలు ఇప్పుడు మరోసారి ఈ అంశాన్ని తెరపైకి తెస్తున్నాయి. 2021లో కూడా ఈ ఆరోపణలపై విచారణ జరిగిందని, అయితే దాని వల్ల ఏమీ తేలలేదని సమాజ్‌వాదీ పార్టీ నాయకుడు, అయోధ్య మాజీ ఎమ్మెల్యే పవన్ పాండే అంటున్నారు.ఆ విచారణ ఎలాంటిది, ఎవరు చేశారు, దాని వల్ల తేలిందేమిటి అనే విషయాలపై ఇప్పటివరకు ఎలాంటి కచ్చితమైన సమాచారం లభించలేదు.

# మూడు సముద్రాలపై భారత్ పట్టు



ఆకాశం, నీరు, నిప్పు.. ఈ మూడింటి ఆధారంగానే మనిషి మనుగడ సాగుతూ ఉంటుంది. వీటి మీద పట్టు చిక్కితే మనిషి జీవితం సులభం అవుతుంది. మనిషి అంటే కేవలం ఒకరు మాత్రమే కాదు.. ఈ యావత్ ప్రపంచం. నిప్పు మీద పట్టును కాస్త పక్కన పెడితే.. గగనం.. సంద్రం మీద పట్టు సాధించిన వారే గొప్పగా మనుగడ సాగిస్తూ ఉంటారు.ప్పటివరకు ప్రపంచంలో అమెరికా.. రష్యా.. చైనా.. ఇంకా కొన్ని దేశాలు గగనతలం మీద పట్టు సాధించాయి.. సముద్రంలో కూడా సత్తా చాటాయి. అందువల్లే ఈ దేశాలకు ప్రపంచం మీద పెత్తనం ఎక్కువగా ఉంటుంది. అవి ఏం చెప్తే అదే చేయాలి. ఎలాంటి ఆదేశాలిస్తే వాటిని పాటించాలి.. అయితే ఇప్పుడు భారత్ వాటి సరసన చేరింది. మరి కొద్ది రోజుల్లో అయితే వాటిని మించిపోతుంది. దీనికి ప్రధాన కారణం దేశ ప్రధాని నరేంద్ర మోడీ తీసుకున్న నిర్ణయాలు.గడచిన కొంతకాలంగా మన దేశ నౌకాదళ వ్యవస్థలోకి 40 యుద్ధ.. సర్వే నౌకలు.. జలాంతర్గాములు వచ్చాయి. ఇంకా 45 తదుపరి దశలో ఉన్నాయి. అంతేకాదు అత్యాధునిక స్వదేశీ పరిజ్ఞానంతో తయారుచేసిన స్టెల్త్ ఫ్రీగేట్ ఐఎనఎస్ దునగిరి, సర్వే నౌక, ఐఎనఎస్ సంషోదక్, జలాంతర్గామి వ్యతిరేక యుద్ధనౌక ఐఎనఎస్ అగ్రయ్ అనే మూడు నౌకలను ప్రధానమంత్రి ప్రారంభించారు. కోల్ కతా లోని శామ ప్రసాద్ ముఖర్జీ పోర్టు వద్ద జరిగిన కార్యక్రమంలో వీటిని జాతికి అంకితం చేశారు. ఈ మూడు నౌకలు అత్యంత ప్రత్యేకమైనవి. వీటివల్ల మన నౌకాదళం మరింత బలాన్ని పెంచుకుందిఇది అత్యంత పెద్దది. స్టెల్త్ ఫ్రిగేట్ విభాగంలో ఇది బాహుబలి లాగా ఉంటుంది. శత్రువుల రాడార్లు.. సెన్సార్లకు ఏమాత్రం చిక్కదు. పైగా ఇది అత్యాధునిక టెక్నాలజీతో పనిచేస్తూ ఉంటుంది. మన నౌకా దళంలో ఐఎనఎస్ నీలగిరికి ప్రత్యేకమైన పేరు ఉంది. ఈ ప్రాజెక్టు 17 ఏ లో భాగంగానే దీనిని నిర్మించారు. ఇందులో బ్రహ్మోస్ మిస్సైల్స్.. మిడిల్ రేంజ్ మిస్సైల్స్.. మల్టీ ఫంక్షన్ సర్వే లైన్స్.. ట్రాక్ గైడెన్స్ రాడార్.. సోనార్ సెన్సార్లు.. ఎలక్ట్రానిక్ వార్ ఫెయిర్ వ్యవస్థలు ఇందులో ఉంటాయి. ఇది ఏకంగా 149 మీటర్ల పొడవు..6670 టన్నుల బరువు ఉంటుంది. ఇది గంటకు 52 కిలోమీటర్ల వేగంతో దూసుకుపోతుందిఇది హై అండ్ టెక్నాలజీ తో రూపొందించిన హైడ్రోగ్రాఫిక్ సర్వే నౌక. ఇది పూర్తిగా సముద్ర గర్భాన్ని మ్యాపింగ్ చేస్తూ ఉంటుంది. మహా సముద్రాల లోతును కొలుస్తూ ఉంటుంది. సముద్ర మార్గాలను నిత్యం అన్వేషిస్తూ ఉంటుంది. దీని పొడవు 110 మీటర్లు. బరువు 3400 టన్నులు ఉంటుంది. ఇది గంటకు 18 నాటికల్ మైళ్ల వేగంతో ప్రయాణం సాగిస్తూ ఉంటుంది. దీనిని దేశ అవసరాల కోసం ఉపయోగించుకోవచ్చు. నీటి అడుగున ఇది మ్యాపింగ్ చేస్తూ ఉంటుంది. దూర ప్రాంతాలకు సంబంధించిన సమాచారాన్ని సేకరిస్తూ ఉంటుంది. అటానమస్ అండర్ వాటర్ వాహకాలు ఇందులో ప్రత్యేకంగా ఉన్నాయి. మనుషులు లేకుండానే దీని ద్వారా సముద్ర అంతర్భాగంలో పరిశోధనలు సులభంగా చేయవచ్చు దునగిరి, సంషోదక్ వంటి వాటితో పోల్చి చూస్తే అగ్రయ్ అత్యంత చిన్న నౌక.. ఇది పూర్తిగా జలాంతర్గామి విధ్వంసక యుద్ధ నౌక. ఇది శత్రు జలాంతర్గములను గుర్తిస్తూ ఉంటుంది. వాటిని నిత్యం ట్రాక్ చేస్తూ ఉంటుంది. తేలికపాటి టార్పెడో లేదా రాకెట్ల ద్వారా వాటిని ఇది ధ్వంసం చేస్తూ ఉంటుంది. ఇందులో షాలో వాటర్ సోనార్ వ్యవస్థ ఉంటుంది. ఇది అత్యంత కఠినమైన జలాల్లో కూడా పని చేస్తూ ఉంటుంది.

# నష్టాల బాటలో ఎల్ ఐసీ

**ముంబై, అఖండ సూర్య :**

స్టాక్ మార్కెట్ అంటేనే ఒడుదొడుకులు ఉంటాయ. విపరీతమైన రిస్క్ ఉంటుంది. ఏ కారణాలతో సూచీలు రాణిస్తాయో, ఏ కారణాలతో పడతాయో, ఏ స్టాక్ ఎప్పుడు పెరుగుతుందో ఎప్పుడు ఎందుకు పడుతుందో ముందుగానే ఊహించడం కాస్త కష్టమే. ఎన్నో అంశాలు ఇక్కడ ముడిపడి ఉంటాయి. ఈ ఏడాది మార్చి నుంచి దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీగా పతనమైన సంగతి తెలిసిందే. అమెరికా`ఇరాన్`ఇజ్రాయెల్ ఉద్రిక్తతలు ఇందుకు కారణం. క్రూడాయిల్ ధరలు విపరీతంగా పెరగడంతో స్టాక్ మార్కెట్లలో కూడా నష్టాలు వచ్చాయి. విదేశీ పెట్టుబడిదారులు పెద్ద మొత్తంలో తమ పెట్టుబడుల్ని ఉపసంహరించుకోవడంతో అమ్మకాల ఒత్తిడి నెలకొంది. దీంతో ఆ మధ్య భారత మార్కెట్ సూచీలు భారీగా తగ్గాయి.ఇటీవల అమెరికా` ఇరాన్ మధ్య శాంతి ఒప్పందం కుదరగా సూచీలు పుంజుకున్నాయి. కిందటి వారంలో జూన్ 15`19 మధ్య 5 ట్రేడింగ్ సెషన్లలో బొంబాయి స్టాక్ ఎక్స్చేంజి సూచీ సెన్సెక్స్ 1275 పాయింట్లు లేదా 1.68 శాతం ఎగబాకింది. ఈ క్రమంలోనే ఆయా కంపెనీల షేర్లు పుంజుకున్నాయి. టాప్`10 కంపెనీల్లో 9 కంపెనీల మార్కెట్ వాల్యుయేషన్ రూ. 2.15 లక్షల కోట్ల మేర పెరగడం విశేషం. ఆయా కంపెనీల మార్కెట్ విలువనే మదుపరుల సంపదగా పరిగణిస్తుంటారు. దీంతో ఈ మేర ఇన్వెస్టర్లకు కూడా భారీగా లాభాలు వచ్చాయని చెప్పొచ్చు.ఇక గత వారంలో అత్యధికంగా భారతీ ఎయిర్‌టెల్ మార్కెట్ విలువ 5 రోజుల వ్యవధిలో రూ. 52,432.67 కోట్లు పెరిగి రూ. 11.62 లక్షల కోట్లకు చేరుకుంది. లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఒఎఅ) మార్కెట్ క్యాపిటలైజేషన్ కూడా రూ. 51,675.23 కోట్లు పెరగడంతో ఇప్పుడు రూ. 5.56 లక్షల కోట్లుగా ఉంది. బజాజ్ ఫైనాన్స్ మార్కెట్ వాల్యుయేషన్ రూ. 26,553 కోట్లు పెరగడంతో ప్రస్తుతం రూ. 5.98 లక్షల కోట్లకు చేరుకుంది.మార్కెట్ విలువ పరంగా భారత్‌లో అతిపెద్ద కంపెనీగా ఉన్నటువంటి రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎం`క్యాప్ గత వారం రూ. 22,464 కోట్లు పెరగడంతో రూ. 17.71 లక్షల కోట్లుగా ఉంది. లార్సెన్ అండ్ టుబ్రో ఎం`క్యాప్ రూ. 21,929 కోట్లు పెరిగి రూ. 5.79 లక్షల కోట్లుగా ఉంది. ఎస్బీఐ మార్కెట్ విలువ 5 రోజుల్లో రూ. 16 వేల కోట్లకుపైగా పెరగడంతో ప్రస్తుతం ఎం క్యాప్ రూ. 9.55 లక్షల కోట్లకు చేరుకుంది.అతిపెద్ద ప్రైవేట్ బ్యాంక్ ఊఆఈఅ బ్యాంక్ మార్కెట్ విలువ రూ. 11,948 కోట్లు పెరిగి రూ. 12.01 లక్షల కోట్ల వద్ద ఉంది. హిందుస్థాన్ యునిలివర్ మార్కెట్ విలువ రూ. 6661 కోట్లు పెరిగి రూ. 5.15 లక్షల కోట్లుగా ఉంది. ఐసీఐసీఐ బ్యాంక్ ఎం క్యాప్ గత వారంలో రూ. 4724 కోట్లు పెరిగి రూ. 9.66 లక్షల కోట్ల వద్ద ఉంది. ఇదిలా ఉండగా అతిపెద్ద భారత ఐటీ కంపెనీ టీసీఎస్ మార్కెట్ విలువ కిందటి వారం రూ. 12,699 కోట్లు తగ్గి రూ. 7.69 లక్షల కోట్లుగా నమోదైంది.

# టీడీపీలో డిజిటల్ సర్వే ప్రకంపనలు

**విజయవాడ, అఖండ సూర్య :**



ఏపీలో కూటమి పాలనకు రెండేళ్లు అవుతోంది. మూడో సంవత్సరంలో అడుగు పెట్టింది. ఈ క్రమంలో ఎమ్మెల్యేల పనితీరుపై అనేక రకాల విమర్శలు వచ్చాయి. మంత్రుల వ్యవహార శైలిపై కూడా అనేక రకాల ఆరోపణలు ఉన్నాయి. కానీ రెండేళ్ల పాలనలో భారీ వివాదాలు రాకుండా పూర్తి చేయగలిగారు పాలనను. ప్రభుత్వ పెద్దలపరంగా బాగానే కష్టపడుతున్నారు. దానికి తగ్గట్టుగానే మంచి ఫలితాలు వస్తున్నాయి. అయినా సరే ఈ రెండేళ్లలో లోపాలతో పాటు మైనస్లను సరి చేసుకుని ముందుకెళ్తేనే కూటమికి మరో ఛాన్స్ ఉంటుంది. అందుకే ఎప్పటికప్పుడు ఎమ్మెల్యేలతో పాటు మంత్రుల పనితీరుపై ఫీడ్ బ్యాక్ తెలుసుకుంటున్నారు సీఎం చంద్రబాబు. ఇంకోవైపు ప్రముఖ మీడియా సంస్థలు సైతం అంచనా వేస్తున్నాయి.

**ఓ డిజిటల్ మీడియా సర్వే..**

తాజాగా మంత్రుల పనితీరుపై ఓ ప్రముఖ డిజిటల్ మీడియా ఒక సర్వే చేసినట్లు తెలుస్తోంది. కచ్చితంగా వచ్చే ఎన్నికల్లో గెలిచేవారు, పర్వాలేదనిపించుకున్న వారితో పాటు ఓడిపోతారు అనే విషయాన్ని ఆ సర్వే తెలుసుకున్నట్లు తెలుస్తోంది. ఇప్పుడున్న సీఎం చంద్రబాబుతో పాటు 24 మంది మంత్రుల్లో తొమ్మిది మంది కచ్చితంగా గెలుస్తారని సదరు సర్వే తేల్చి చెప్పింది. సీఎం చంద్రబాబు కుప్పం నుంచి మరోసారి గెలుస్తారు అని ఈ సర్వే తేల్చింది. 1983 నుంచి కుప్పం నియోజకవర్గం నుంచి గెలుస్తూ వచ్చారు చంద్రబాబు. 2019లో వైసీపీ గెలుపుతో పాటు కుప్పం నియోజకవర్గంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ గెలిచింది. దీంతో వై నాట్ కుప్పం అని నినాదంతో ముందుకు సాగిన వైసీపీకి 2024 ఎన్నికల్లో షాక్ తప్పలేదు. మరోసారి కుప్పం నుంచి చంద్రబాబు కచ్చితంగా గెలుస్తారని ఈ సర్వే తేల్చింది. పిఠాపురం నుంచి పవన్ కళ్యాణ్ మరోసారి తప్పకుండా గెలుస్తారని ఈ సర్వే ద్వారా తేలింది. మొన్నటి ఎన్నికల్లో పొత్తులో భాగంగా పోటీ చేసిన పవన్ కళ్యాణ్ కు 70 వేలకు పైగా మెజారిటీ వచ్చింది ఈ నియోజకవర్గం నుంచి. మంత్రితో పాటు డిప్యూటీ సీఎం గా ఉండడంతో పిఠాపురం నియోజకవర్గాన్ని ఎంతగానో అభివృద్ధి చేస్తున్నారు. అందుకే ఇక్కడ ప్రజలు మరోసారి పవన్ కళ్యాణ్ కి అవకాశం ఇస్తారు అని ఈ సర్వే ద్వారా తేలింది. మంగళగిరి నుంచి నారా లోకేష్ కచ్చితంగా గెలుస్తారు. మంత్రిగా ఉంటూ ఇదే నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓడిపోయారు.. అయినా సరే మంగళగిరి నియోజకవర్గాన్ని తన సొంత డబ్బులతో అభివృద్ధి చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత కనివిని ఎరుగని అభివృద్ధి మంత్రంతో ముందుకు వెళ్తున్నారు. అందుకే అక్కడి ప్రజలు మరోసారి లోకేష్ కు అవకాశం ఇస్తారని తెలిపోయింది. టెక్కలి నుంచి మరోసారి కింజరాపు అచ్చం నాయుడు గెలుపు తథ్యమని తేలిపోయింది. ఇక్కడ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ చాలా వీక్ గా ఉంది. ఆపై మంత్రికి మంచి ఇమేజ్ ఉంది. టెక్కలి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నారన్న పేరు ఉంది. అందుకే ఇక్కడ ప్రజలు మరోసారి ఛాన్స్ ఇచ్చే అవకాశం ఉంది. పాలకొల్లు నుంచి మరోసారి నిమ్మల రామానాయుడుకు ప్రజలు అవకాశం ఇవ్వనున్నారు. తెలుగుదేశం పార్టీకి మంచి పట్టున్న నియోజకవర్గం. ఆ పార్టీ ఆవిర్భావం నుంచి ఒకసారి మాత్రమే ఓడిపోయింది. నిమ్మల రామానాయుడు నిత్యం ప్రజల్లోనే ఉంటారు. మంచి నేతగా పేరు ఉంది. ఇక్కడ వైసిపి కొత్త ప్రయోగాలు చేస్తోంది కానీ వర్కౌట్ కాలేదు. రేపల్లె నుంచి అనగాని సత్యప్రసాద్ మరోసారి గెలుస్తారని ఈ సర్వే ద్వారా తేలింది. అక్కడ ఆయన హ్యాట్రిక్ విజయం సాధించారు. స్థానికంగా మంచి పట్టు సాధించారు. సత్యప్రసాద్ను ఓడించేందుకు వైసిపి చేయని ప్రయత్నం అంటూ లేదు. కానీ అవేవీ వర్కౌట్స్ కాలేదు. ఈసారి కూడా ఆయనదే విజయం అని తేలిపోయింది. అద్దంకి నుంచి గొట్టిపాటి రవికుమార్ మరోసారి కచ్చితంగా విజయం సాధిస్తారు. ఈ నియోజకవర్గంలో టిడిపి తో పాటు వైసీపీకి పట్టు ఉంది. కానీ వ్యక్తిగతంగా గొట్టిపాటి రవికుమార్ తన ఇమేజ్ పెంచుకున్నారు. ఆయన ఏ పార్టీ నుంచి పోటీ చేసిన గెలుపు తథ్యం అన్నట్టు పరిస్థితి ఉంది. అందుకే మరోసారి ఆయన విజయం ఖాయమని తేలిపోయింది. గజపతినగరం నుంచి కొండపల్లి శ్రీనివాస్ గెలుపు మరోసారి ఖాయం అన్నట్టు ఉంది. తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచిన ఆయనకు మంత్రివర్గంలో స్థానం దక్కింది. మంచి ఇమేజ్ ఉంది. అందుకే అక్కడి ప్రజలు ఆయన నాయకత్వానికి మొగ్గు చూపుతున్నట్లు స్పష్టమైంది. నిడదవోలు నుంచి మరోసారి జనాలు కందుల దుర్గేష్ కు ఛాన్స్ ఇస్తారని ఈ సర్వే ద్వారా స్పష్టమైంది. పొత్తు ఉన్నంతవరకు నిడదవోలులో కూటమి గెలుపు ఖాయం. పైగా దుర్గేష్ గెలిచిన నాటి నుంచి నియోజకవర్గాన్ని తనదైన రీతిలో అభివృద్ధి చేస్తున్నారు. అది కలిసి వచ్చే అంశం. ఇలా తొమ్మిది మంది కూటమి పాలనలో కచ్చితంగా గెలుస్తారు అని స్పష్టం కావడం విశేషం.

# చక్రాయపేట అక్రమ ఇసుక క్వారీ వద్దకు

## వైసీపీ ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి

**కడప, అఖండ సూర్య**

కడప జిల్లా చక్రాయపేట అక్రమ క్వారీ కుంటలో పడి జయంత్ రెడ్డి, రాజవర్ధన్ రెడ్డి మృతి చెందిన ఘటనపై ఎంపి అవినాష్ రెడ్డి స్పందించారు. సోమవారం ఉదయం క్వారీ వద్దకు వెళ్లారు. చిన్నారుల మృతదేహాలకు నివాళులు అర్పించి తల్లిదండ్రులను ఓదార్చారు. రాత్రి నుండి ఘటనాస్థలిలోనే చిన్నారుల మృతదేహాలతో తల్లిదండ్రులు, గ్రామస్థులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. చిన్నారుల మృతదేహాలను చూడడానికి చుట్టుపక్కల గ్రామాల నుండి ప్రజలు తరలివచ్చారు.





# గూడూరు మండల కమిటీ ఎన్నిక

**అఖండ సూర్య, గూడూరు:**

గూడూరు మండల కురువ సంఘం కమిటీ ఎన్నిక ను సోమవారం బీరప్ప స్వామి దేవాలయంలో జిల్లా నాయకులు నిర్వహించారు. గౌరవ అధ్యక్షులుగా మద్దిలేటి( పెంచికలపాడు ) అధ్యక్షులుగా రంగ స్వామి ( గూడూరు) ఉపాధ్యక్షులుగా సుధాకర్ ( గుడిపాడు) వర్కింగ్ ప్రెసిడెంట్. చంద్రశేఖర్ ( పెంచికలపాడు ) సలహాదారుగా హనుమంతు (గూడూరు)ప్రధానకార్యదర్శిగా చిన్న సూరన్న( జూలకల్లు) ట్రెజరీ B. యుగంధర్ ( నాగలాపురం) ఆర్గనైజింగ్ సెక్రటరీగా శివకృష్ణ ( పెంచికలపాడు) సహాయ కార్యదర్శిగా. శివ (గూడూరు) ఎల్లప్ప (బూడిదపాడు) ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందన్నారు.

# 25 న చంద్రబాబు మంత్రాలయం రాక





**అఖండ సూర్య మంత్రాలయం:**

మంత్రాలయం నియోజకవర్గనికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి మరియు నవ్యాంధ్ర రూపకర్త తెలుగువారి ఆత్మవిశ్వాసం నారా చంద్రబాబు నాయుడు ఈనెల 25 వ తేదీన అనగా(గురువారం ) మంత్రాలయం కు విచేయుచున్నారు.తెలుగుతమ్ముళ్లకు రాబోవు స్థానిక సంస్థల ఎన్నికలు, రెండేళ్లలో సాధించిన ప్రగతిని, ప్రజలకు అందించిన సంక్షేమ అభివృద్ధి గురించి దిశ నిర్దేశం చెయ్యడానికి విచ్చేయుచున్న సందర్భంగా సోమవారం మంత్రాలయం,మాధవరం మరియు కోసిగి నందు హెలిప్యాడ్ మరియు సభ ప్రాంగణ ముఖ్య నాయకులు మరియు పోలీసు అధికారులతో స్థల పరిశీలనలో భాగంగా మంత్రాలయం నియోజకవర్గం టీడీపి ఇంచార్జి రాఘవేంద్ర రెడ్డి సోదరుడు రామకృష్ణ రెడ్డి తనయుడు రాకేష్ రెడ్డి మరియు కౌతాళం మండల అధ్యక్షులు సురేష్ నాయుడు పరిశీలిచడం చెయ్యడం జరిగినది .ఈ కార్యక్రమములో సీనియర్ నాయకులు ముత్తురెడ్డి,రామిరెడ్డి, గోపాల్ రెడ్డి,నర్సిరెడ్డి,హరివిలి వీరేష్, కోసిగయ్య యువ నాయకులు రాకేష్ రెడ్డి మరియు మీడియా మిత్రులు, పోలీసు అధికారులు పాల్గొనడం జరిగినది

# రైతన్న మీకోసం ఏవో కృష్ణారెడ్డి



**జూపాడుబంగ్లా అఖండ సూర్య**

22/06/2627/06/26 జూపాడు బంగ్లామండలంలోని అన్ని గ్రామాలలో వ్యవసాయశాఖ అనుబంధ శాఖలు రెవిన్యూ వారు అందరు " రైతన్న మీకోసం " కార్యక్రమం జరుగుతుంది అని తెలియజేయడం జరిగింది.


**ముఖ్యంగా ఇందులో రైతులకు తెలియజేయడం ఏమిటంటే**

అన్నదాత సుఖీభవ డబ్బులు రైతులకు వేయడం... పెట్టుబడి సహాయం కొరకు. ఎల్ నీనో కారణంగా... ఈ ఖరీఫ్ నందు తక్కువ వర్షపాతం నమోదవుతుందని తెలియతజేస్తూ పంటలు తక్కువ నీటితో పండే పప్పు ధాన్యాల పంటలు వేసుకోవాలెనని తెలియజేయడంజరిగింది. ప్రకృతి వ్యవసాయంవైపుగా రైతులను తీసుకోపోవడం గురించి రైతుసోదరులకు తెలియజేయడం. రైతులు అధిక ఎరువులు వాడకుండా అవసరమైన ఎరువులు మాత్రమే వాడాలని, యూరియా డి ఎ పి ఎరువులు రైతులకు అవసమైనవి అప్ ద్వారా ఎక్కడైనా తీసుకునే వెసులుబాటు కల్పించడం జరిగింది అని తెలిపారు

# పెండెకంటి ఆంజనేయ స్వామి దేవాలయం లో 41 రోజుల పూజ

**అఖండ సూర్య మంత్రాలయం:-**

మంత్రాలయం నియోజకవర్గం కోసిగి మండలం కోసిగిలోని స్టానిక రంగప్ప గట్టు దగ్గర వెలసిన శ్రీ పెండెకంటి ఆంజనేయ స్వామి 41 రోజుల పూజ కార్యక్రమం జరిగింది. ఇందులో భాగంగా ముందుగా స్వామి వారికి మంగళ స్నానం,ఆకుల పూజ, కుంకుమ హర్చన,అభిషేకం,జాలాభిషేకం హారతి పూజలు చేసారు.ఆలయ కమిటీ పెద్దలు వైసీపీ కోసిగి మండల అధ్యక్షుడు లవకుశ ఈరన్న,ఊసేని,రాముడు ఇతరుల ఆధ్వర్యంలో ఈ వేడుకకు ముఖ్య అతిధిగా వైస్సార్సీపీ కోసిగి మండల ఇంచార్జి మురళీమోహన్ రెడ్డి హాజరయ్యి స్వామి ని దర్శనం చేసుకొని ప్రసాదం స్వీకరించరు.ఈ కార్యక్రమంలో నాడిగేని నాగరాజు,దొడ్డి నరసన్నకాంట్రాక్టు నాగరాజు,ప్రతాప్,అంజి,ఈరేష్, ఇతరుల మరియు భక్తులు పాల్గొన్నారు.



# కార్యకర్త కష్టమే తన కష్టం మంత్రాలయం టీడీపీ ఇన్చార్జి



**అఖండ సూర్యమంత్రాలయం:-**

మంత్రాలయం నియోజకవర్గ పరిధిలో ఇటీవల జరిగిన పలు ఘటనల్లో గాయపడిన బాధితులను కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో మంత్రాలయం నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జి ఎన్.రాఘవేంద్ర రెడ్డి పరామర్శించారు. మంత్రాలయం వైసీపీ మూకలు చేసిన దాడిలో టీడీపీ కార్యకర్త ఈరన్న గాయపడిన విషయం తెలుసుకొని ఆస్పత్రికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అలాగే రోడ్డు ప్రమాదంలో గాయపడిన కల్లుకుంట గ్రామానికి చెందిన శ్రీరాములు తమ్ముడు టిడిపి కార్యకర్తను అలాగే మేకడోన ప్రాంతానికి చెందిన టీడీపీ కార్యకర్తను పరామర్శించి ధైర్యం చెప్పారు.టీడీపీ కార్యకర్తలను బెదిరించి, దాడులు చేసి వెనక్కి తగ్గించవచ్చని ఎవరైనా భావిస్తే అది వారి భ్రమ. ప్రతి కార్యకర్త వెనుక పార్టీ మరియు నేను అండగా ఉంటాం అంటూ రోజు రోజుకి మంత్రాలయంలో మితిమీరుతున్న గొడ్డలి పార్టీ నేతలు గాని కార్యకర్తలు గాని మీ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని నడుచుకోవడం మంచిది అంటూ ఇంచార్జి మాట్లాడడం జరిగింది.ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడిన మంత్రాలయం టిడిపి ఇన్చార్జి ఎన్.రాఘవేంద్ర రెడ్డి కష్టకాలంలో పార్టీ కార్యకర్తలు మరియు ప్రజలకు అండగా నిలవడం తమ బాధ్యత అని, ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# గ్రేడ్3 ఏఎన్ఎం లకు తక్షణ మే ప్రమోషన్లు కల్పించాలి





- **హెల్త్ సెక్రెటరీల పై పని భారం తగ్గించాలి.ఎం. రమేష్ బాబు ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి**

**జూపాడుబంగ్లా అఖండ సూర్య**

రాష్ట్రవ్యాప్తంగా గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న హెల్త్ సెక్రెటరీలు,ఏఎన్ఎంలపై పెరుగుతున్న పని ఒత్తిడిని ప్రభుత్వం తక్షణమే తగ్గించాలని, జీఎన్ఎం శిక్షణ పూర్తి చేసిన గ్రేడ్3 ఏఎన్ఎంలకు వెంటనే పదోన్నతులు కల్పించాలని, గ్రేడ్ 3 ఏఎన్ఎం లకు గ్రేడ్ 2లో ప్రమోషన్ కల్పించాలని ఎపి సచివాలయ హెల్త్ సెక్రటరీ ల అసోసియేషన్, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎం రమేష్ బాబు కోరారు.. సోమవారం జూపాడు బంగ్లా మండలం లో పీజీఆర్ఎస్ లో అధికారులకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, 2019లో నియమితులైన హెల్త్ సెక్రెటరీలు సచివాలయ వ్యవస్థతో పాటు వైద్య ఆరోగ్య శాఖ అధికారుల ఆదేశాల మధ్య తీవ్ర పని ఒత్తిడిని ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రజారోగ్య సేవలు అందించాల్సిన వారితో ఇంటింటి సర్వేలు, ఓటరు జాబితాల తయారీ, ఇతర శాఖలకు సంబంధించిన పనులు చేయించడం వల్ల వారి అసలు విధులకు ఆటంకం కలుగుతోందన్నారు.సుమారు 43మొబైల్ యాప్‌లలో వివిధ రకాల సమాచారాన్ని నమోదు చేయాల్సి రావడం వల్ల క్షేత్రస్థాయిలో వైద్య సేవలపై ప్రతికూల ప్రభావం పడుతోందని, ఉద్యోగులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారని పేర్కొన్నారు. హెల్త్ సెక్రెటరీలపై ఉన్న యాప్‌ల భారాన్ని తగ్గించడంతో పాటు వారి విధులు, బాధ్యతలపై స్పష్టత నిస్తూ ప్రత్యేక జాబ్ చార్ట్ రూపొందించాలని ప్రభుత్వాన్ని కోరారు.అలాగే సచివాలయాల్లో గ్రేడ్3 ఏఎన్ఎంలుగా విధులు నిర్వహిస్తూ రెండేళ్లపాటు జీఎన్ఎం శిక్షణ పూర్తి చేసిన ఉద్యోగులకు గతంలో ఇచ్చిన హామీల మేరకు ప్రమోషన్లు కల్పించాలని ఎం.రమేష్ బాబు డిమాండ్ చేశారు..ప్రస్తుతం జరుగుతున్న కౌన్సిలింగ్‌లో అర్హులను పరిగణనలోకి తీసుకోకపోవడం అన్యాయమని పేర్కొన్నారు. జీవో ఎంఎస్ నం.179ను అమలు చేసి అర్హులైన గ్రేడ్3 ఏఎన్ఎంలందరికీ గ్రేడ్2 కింద పదోన్నతులు కల్పించాలని కోరారు.ఫేస్ యాప్, బయోమెట్రిక్ హాజరు విధానాల వల్ల ఎదురవుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని మాన్యువల్ హాజరు రిజిస్టర్లను కూడా అందుబాటులో ఉంచాలని సూచించారు.సచివాలయాల్లో పనిచేస్తున్న ఏఎన్ఎంలందరినీ మెడికల్ అండ్ హెల్త్ శాఖ పరిధిలోకి తీసుకువచ్చి ప్రత్యేక పర్యవేక్షణ వ్యవస్థ ఏర్పాటు చేయాలని, రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఏఎన్ఎం పోస్టులను కొత్త నియామకాల ద్వారా భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు

# ఈ యాప్ పద్ధతి ను తీసి పాత పద్ధతి లో ఎరువులు ఇవ్వాలి:రైతు సంఘం డిమాండ్

**అఖండ సూర్య మంత్రాలయం :-**

కౌతాళం మండల కేంద్రం నందు రైతు సంఘం ఆధ్వర్యంలో నష్టదాయకమైన ఎరువుల యాప్ ను రద్దు చేయాలని, ఈ యాప్ వల్ల చాలామంది రైతులకు నష్టం కలుగుతుందని కౌతాళం మండల తాహ సిల్దార్ రజిని కాంత్ , మండల వ్యవసాయ అధికారి కాకర్ల శేషాద్రి కు స్పందనలో మెమొరండం ఇవ్వడం అయినది.ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కే మల్లయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వము అదును చూసి ఎరువుల ధరలను పెంచి, రైతులు బాగుపడకూడదని ఉద్దేశంతో ఎరువులు యాప్ ను తెచ్చి రైతులను దివాలా తీయించి, కార్పొరేట్ శక్తులకు భూములను అప్పగించాలని ఉద్దేశంతో ఈ యాప్ లను తీసుకురావడమైనదని ఆయన అన్నారు. ఎరువుల అంగళ్లు వారు యూరియా ఎరువులతో పాటు లింకు పెట్టి ఇతర ఎరువులను అంటగడుతున్నారు అని ఆయన అన్నారు. మండలంలో చాలామంది కౌలుకు భూములు చేస్తున్నారు ఈ యాప్ వల్ల కౌలు రైతులకు ఎరువులు దొరకవు అని ఆయన అన్నారు అదే రకంగా మండలంలో హంపి విరపాక్ష స్వామి దేవాలయం భూములు, రాఘవేంద్ర స్వామి దేవాలయం భూములు, గ్రామాల్లో ఉన్న దేవుళ్ళ భూములు రైతులు చేస్తున్నారు. వీరికి ఏ రకంగా ఎరువులు ఇస్తారని ఆయన వ్యవసాయ అధికారిని ప్రశ్నించడం అయినది. అందుకు ఈ యాప్ తీసేసి పాత పద్ధతిలో ఎరువులు ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం అయినది.ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి బి ఈరన్న, రైతు సంఘం నాయకులు సత్యప్ప, ఈరన్న, వెంకటేష్, చిన్న మారయ్య, తదితరులు పాల్గొన్నారు.



# చైతన్య యూత్ ఆధ్వర్యంలో చలివేంద్రం



**అఖండ సూర్య,గూడూరు:**

వేసవి కాలాన్ని పురష్కరించుకొని శ్రీ తిమ్మ గురుడు స్వామి జాతర సందర్భంగా గూడూరు బస్టాండ్ లో చైతన్య యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసుకున్న చలివేంద్రం ఎంతోమంది దాహార్తి తీర్చడం జరిగిందని మాజీ జెడ్పిటిసి సభ్యులు ఎల్. వెంకటేశ్వర్లు పేర్కొన్నారు ఈ సంవత్సరం ఇంకా ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున మరికొద్ది రోజులు చలివేంద్రాన్ని చలివేంద్రాన్ని నిర్వహిస్తామని నిర్వాహకులు ఎల్ వెంకటేశ్వర్లు చైతన్యత అధ్యక్షులు తెలిపారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంఘం ఏర్పడి 35 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మేము నిర్వహిస్తున్న కార్యక్రమాలకు మాకు సహకరించిన వారందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతున్నారు అన్నారు ఇప్పుడున్న యువత కూడా ప్రజలకు ఉడత భక్తి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు

# బూత్ కన్వీనర్ లతో సమావేశం



- **ఎర్రగొండపాలెం శాసనసభ్యులు తాటి పత్రి చంద్రశేఖర్**

**అఖండ సూర్య. పుల్లలచెరువు**

పుల్లలచెరువు మండల కేంద్రంలో పుల్లలచెరువు మండల లోని బూత్ కన్వీనర్ లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎర్రగొండపాలెం శాసనసభ్యులు మరియు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ (సార్ ) ప్రక్రియను బూత్ కన్వీనర్లు అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని సూచించారు.క్షేత్రస్థాయిలో ఓటర్ల జాబితా పరిశీలన, మార్పులుచేర్పులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ప్రతి బూత్ పరిధిలో అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా పర్యవేక్షించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మండల వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

# డీటీవోను ఢీకొన్న టిప్పర్.. అక్కడికక్కడే మృతి

**భూపాలపల్లి, అఖండ సూర్య**

వాహనాలు తనిఖీ చేస్తున్న రవాణా శాఖ అధికారిని బొగ్గు టిప్పర్ లారీ ఢీకొట్టింది. దాంతో జిల్లా రవాణ శాఖాధికారి వెంకన్న అక్కడికక్కడే మృతిచెందారు. ఘటనలో మృతదేహం నుజ్జు నుజ్జైయింది. భూపాలపల్లి జిల్లా గణపురం మండలం చెల్పూర్ శివారులోని ఆర్టీవో కార్యాలయం ఎదుట పరకాల ? భూపాలపల్లి హైవేపై ఘటన జరిగింది. మృతుడు వెంక్న 15 రోజుల క్రితమే భూపాలపల్లికి బదిలీ మీద వచ్చారు. పోలీసులు టిప్పర్ డ్రైవర్ను అదుపులోకి తీసుకున్నారు. అనూహ్యంగా జరిగిన ఈ ఘటనలో లారీ నేరుగా డీటీఓ వెంకన్నను వెనుక నుంచి ఢీకొట్టినట్లు సమాచారం. ప్రమాద తీవ్రతకు ఆయన తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. సంఘటనా స్థలంలో ఉన్న ఇతర సిబ్బంది, వాహనదారులు ఒక్కసారిగా భయాందోళనలకు గురయ్యారు. ప్రమాదం జరిగిన క్షణాల్లోనే ఆ ప్రాంతంలో విషాద వాతావరణం నెలకొంది.సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన టిప్పర్ లారీని స్వాధీనం చేసుకున్న పోలీసులు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టినట్లు సమాచారం. వెంకన్న మరణవార్త జిల్లా అధికార వర్గాల్లో తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించింది. విధి నిర్వహణలో నిబద్ధతతో పనిచేసే అధికారిగా ఆయనకు మంచి గుర్తింపు ఉన్నట్లు సహచరులు తెలిపారు. రవాణా శాఖలో పలు బాధ్యతలు నిర్వహించిన ఆయన ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేసేవారని అధికారులు పేర్కొన్నారు. ఈ ఘటనతో ప్రభుత్వ విధులు నిర్వర్తించే సిబ్బంది భద్రతపై కూడా ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ముఖ్యంగా జాతీయ, రాష్ట్ర రహదారులపై వాహనాల తనిఖీలు నిర్వహించే అధికారులు, సిబ్బందికి మరింత భద్రత కల్పించాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.



# బేగంపేట లో మల్కాజిగిరి సిపి, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి పర్యటన

**బేగంపేట, అఖండ సూర్య :**

మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలో పలు ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో పరిస్థితిని అంచనా వేయడానికి మరియు క్షేత్రస్థాయిలో సహాయక చర్యలను సమీక్షించడానికి మల్కాజిగిరి సిపి సుమతి మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి తో కలిసి బేగంపేట చికోటీ గార్డెన్ వద్దకు చేరుకుని వర్ష ప్రభావిత ప్రాంతాలను సందర్శించారు. ట్రాఫిక్ అంతరాయాలను పరిష్కరించడానికి తీసుకుంటున్న చర్యలను వారు దగ్గరుండి సమీక్షించారు. వర్షాకాలం కావున పోలీసు అధికారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని, ట్రాఫిక్ సజావుగా సాగేలా చూడాలని, అవసరంలో ఉన్న పౌరులకు సహాయం చేయాలని, పౌర, విపత్తు నిర్వహణ సంస్థలతో సమన్వయం చేసుకోవాలని సూచించారు.పోలీసులకు సహకరించడానికి స్థానికులు స్వచ్ఛందముగ ముందుకు వచ్చి తగిన సహకారం అందించాలనీ ఆమె స్థానికులను కోరారు.

# ఇసుక మాఫియా అక్రమాలకు బలైన నిండు ప్రాణం

**భద్రాద్రి కొత్తగూడెం, అఖండ సూర్య :**

అంబులెన్స్కు సైతం దారి ఇవ్వకుండా లారీలను రహదారిపై అడ్డంగా నిలిపడంతో ఒక నిండు ప్రాణం పోయింది. అంబులెన్స్ కు దారి లేకపోవడంతో కుటుంబ సభ్యులు భుజంపై రోగిని మోసుకెళ్లిన ఘటన ఇది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మణుగూరు మండలం సాంబాయిగూడెం నుండి రామానుజవరం వరకు రహదారిపై అడ్డంగా ఇసుక లారీలు నిలిపారు. అదే మార్గంలో మణుగూరు మండలం దమ్మక్కపేట గ్రామంలో పురుగుల మందు తాగిన వంశీ(35) అనే వ్యక్తిని ఆసుపత్రికి తరలిస్తుండగా, కనీసం అంబులెన్స్కు కూడా ఇసుక లారీలు దారి ఇవ్వలేదు. చివరకు రోగి వంశీని భుజంపై మోసుకుని వెళ్ళే సరికి ప్రాణాలు కోల్పోయాడు. ఇసుక లారీలు రోడ్డును బ్లాక్ చేయడం తోనే వంశీ మృతి చెందాడని చేస్తున్న కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# మెరుగైన వైద్య సేవలు అందించాలి: ఎమ్మెల్యే



**సూర్యాపేట, అఖండ సూర్య :**

పట్టణంలోని హుజూర్ నగర్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన జి వీ హాస్పిటల్ ను స్థానిక సభ్యురాలు పద్మావతి రెడ్డి ప్రముఖ వైద్యులు జాస్తి సుబ్బారావు తో కలసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె హెల్త్చెకప్చేయించుకున్నారు.అనంతరం ఆమె మాట్లాడుతూదిన దినాభివృద్ధి చెందుతున్న కోదాడ పట్టణానికి జీ వీ హాస్పిటల్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు కోదాడ ప్రాంత ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా మెరుగైన వైద్య సేవలు అందించి మంచి పేరు తెచ్చుకోవాలని డాక్టర్లకు యాజమాన్యానికి సూచించారు. పేదలకు అతి తక్కువ ఖర్చులో నాణ్యమైన వైద్య సేవలను అందించాలన్నారు.వైద్యులు సేవాభావంతో పనిచేస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని, రాబోయే రోజుల్లో వైద్యం అంటే కోదాడ గుర్తుకు వచ్చేలా పనిచేయాలని గుర్తుచేశారు.జీవి హాస్పిటల్ యాజమాన్యం మాట్లాడుతూ అత్యాధునిక వైద్య పరికరాలు, అనుభవజ్ఞులైన వైద్య సిబ్బంది సేవలు అందుబాటులో ఉంటాయని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో , కోదాడ మున్సిపల్ చైర్ పర్సన్ ఎర్నేని కుసుమ వెంకటరత్నం బాబు, వైస్ చైర్ పర్సన్ దేవరపల్లి మల్లేశ్వరి, కాంగ్రెస్ నాయకులు ఎర్నేని బాబు , కారింగుల అంజన్ గౌడ్,అమినాబాద్ మాజీ సర్పంచ్ ముత్తినేని కోటేశ్వరరావు ,మున్సిపల్ కౌన్సిలర్లు, కందుల కోటేశ్వరరావు , కాంగ్రెస్ మహిళ నాయకులు కోదాడ టౌన్ లో ఉన్న వివిధ హాస్పిటల్ డాక్టర్స్ తదితరులు పాల్గొన్నారు.

# అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ పాఠశాలల పైన చర్యలు తీసుకోవాలి




- **ఆల్ ఇండియా స్టూడెంట్స్, జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అమ్మ వెంకటేష్**

**జమ్మికుంట, అఖండ సూర్య :**

.జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రైవేట్ పాఠశాలలు జీవో నెంబర్ 42 కి విరుద్ధంగా అధిక ఫీజులు వసూలు చేస్తూ ప్రభుత్వ నియమ నిబంధనలను తుంగలో తొక్కి వారి ఇష్టా రాజ్యాంగ వ్యవహరిస్తున్నారని, ఆల్ ఇండియా స్టూడెంట్స్ జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అమ్మ వెంకటేష్, ఈ సందర్భంగా మండల విద్యాధికారికి వినతి పత్రం అందజేశారు. అనంతరం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, నేడు ప్రైవేట్ పాఠశాలలో ఐఐటి మెడికల్ ఫౌండేషన్ కర్కులం ఆక్టివిటీస్ పేరిట విద్యార్థుల తల్లిదండ్రుల నుండి అధిక ఫీజులు వసూలు చేస్తూ వారి రక్తాన్ని జలగల పిలుస్తున్నారు, అధిక ఫీజుల దోపిడీ మీద ఉన్న ఆలోచన విద్యార్థుల భవిష్యత్తు మీద లేకుండా పోయింది, విద్యదానం చేయాల్సినటువంటి విద్యా సంస్థలు విద్యార్థుల పాలిట శాపంగా మారి వేలాది రూపాయల ఫీజులను దండుకుంటున్నారు, నేడు ప్రైవేట్ విద్యా సంస్థలు డబ్బుల మీద ఉన్నటువంటి వ్యామోహం విద్యార్థుల భవిష్యత్తు మీద లేకుండా పోయింది, ప్రతి విద్య సంవత్సరం విద్యార్థుల మార్కుల పాస్ పర్సంటేజ్ లో మాత్రం విద్యాసంస్థలు పూర్తిస్థాయిలో విఫలమవుతున్నాయి, అధిక ఫీజుల దోపిడీ మీద ఉన్నటువంటి ఆలోచన విద్యార్థులు భవిష్యత్తు మీద ఉంటే బాగుంటుందని, విద్యార్థుల భవిష్యత్తును ఆలోచించకుండా అధిక ఫీజుల దోపిడికి పాల్పడుతున్నటువంటి పలు ప్రైవేట్ పాఠశాల పైన ఎంక్వయిరీ చేసి శాఖ పరమైనటువంటి చర్యలు తీసుకోవాలని అమ్మ వెంకటేష్, ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

# ప్రతిభకు ట్రిపుల్ ఐటీ పట్టం

- **జడ్.పి.హెచ్.ఎస్ అచలాపూర్ విద్యార్థి ఘన విజయం**
- **ఎసఎస్ సి లో మండలంలో రెండో స్థానం..**
- **ఇప్పడు ట్రిపుల్ ఐటీలో సీటు సాధించి మరోసారి సత్తా చాటిన హరిచరణ్**


**తాండూర, అఖండ సూర్య;**

తాండూర్ మండలం అచలాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి చీర్ల హరిచరణ్ ట్రిపుల్ ఐటీ లో సీటు సాధించి పాఠశాలకు, గ్రామానికి గర్వ కారణంగా నిలిచాడని ప్రధానోపాధ్యాయురాలు పీ. ఉమాదేవి తెలిపారు.మార్చి?2026లో నిర్వహించిన ఎసఎస్ సీ పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల విభాగంలో తాండూర్ మండల స్థాయిలో రెండో స్థానం సాధించిన హరిచరణ్, తాజాగా ప్రకటించిన ట్రిపుల్ ఐటీ ప్రవేశ ఫలితాల్లోనూ సీటు దక్కించుకుని తన ప్రతిభను మరోసారి నిరూపించాడు.ఈ సందర్భంగా హరిచరణ్‌ను పాఠశాల ఎసఎంసీ చైర్పర్సన్ చిలుకమ్మ, సర్పంచ్ మారిశెట్టి స్రవంతి శ్రీనివాస్, ఉపసర్పంచ్ గట్టు సంతోష్, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయ బృందం ఘనంగా అభినందించి, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు.

# పేదవాడికి ఇండ్ల పోరాటానికి వామపక్షాలు సంసిద్ధం

- **ప్రతి నిరుపేదకు ఇల్లు,**
- **ఇల్లు ఉన్నవారికి పట్టాలకు సర్వేలు, దరఖాస్తుల స్వీకరణ**
- **10 వేల మందితో ఈ నెల 27న హనుమకొండలో భారీ ప్రదర్శన**
- **జూలై 1న రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాలు, కలెక్టర్ కార్యాలయాల ముందు పెద్దఎత్తున ముట్టడి, నిరసన ప్రదర్శనలు**
- **పేదలకు ఇళ్లను సాధించడమే లక్ష్యంగా సమరశీల పోరాటాలు**
- **మహత్తర గుడిసెల పోరాటానికి' ఏ పేరు పెట్టాలనేది జూలై 2న జరుగు సమావేశం లో స్పష్టత**
- **కూనంనేని సాంబశివరావు వెల్లడి..**

**హైదరాబాద్, అఖండ సూర్య :**



రాష్ట్రంలోని ప్రతి నిరుపేదకు ఇళ్లు, ఇంటి స్థలం సాధించడమే లక్ష్యంగా వామపక్షపార్టీల ఆధ్వర్యంలో విద్యుత్ ఉద్యమం తరహాలో మరో పోరాటానికి శ్రీకారం చుట్టనున్నట్లు వామపక్ష పార్టీల నేతలు ప్రకటించారు. ఇందులో భాగంగా గుండ్ల సింగారం, గోపాల్ పూర్ తొలగించిన గుడిసెల స్థానాలలో పేదలకు ఇళ్ల కట్టించాలని డిమాండ్ చేస్తూ సిపిఐ, సిపిఐ(ఎం) ఇతర వాపపక్ష పార్టీల ఆధ్వర్యంలో 10 వేల మందితో ఈ నెల 27న హనుమకొండలో భారీ ప్రదర్శనను నిర్వహించనున్నట్లు వెల్లడించారు. హనుమకొండ జిల్లాలోని గుండ్ల సింగారంలో పేదలు నిలువ నీడ కోసం వేసుకున్న గుడిసెలను అధికారులు బందిపోటు దొంగలల చోరబడి రాత్రి రాత్రికి వాటిని తొలగించారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అత్సుహంతో అధికారులు ఎక్కడెక్కడ గుడిసెలు తొలగించారో అక్కడ తిరిగి గుడిసె వాసులకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలని లేకపోతే ప్రభుత్వాన్ని ప్రతిఘటిస్తామని వారు హెచ్చరించారు. సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్ ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ ఏ కూనంనేని సాంబశివరావు, సహాయ కార్యదర్శులు తక్కెళ్ల పల్లి శ్రీనివాసరావు, ఈ.టి.నరసింహా, కార్యదర్శివర్గ సభ్యురాలు పశ్యపద్మ, సిపిఐ ఎంఎల్ సి నెల్లికంటి సత్యం,హైదరాబాద్ జిల్లా కార్యదర్శి బి.స్టాలిన్, వరంగల్ జిల్లా సెక్రటరీ బాషామియా, హనుమకొండ జిల్లా పార్టీ కార్యదర్శి కర్రె భిక్షపతి, సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు అబ్బాస్ , సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు కె.గోవర్ధన్, ఎంసిపిఐ నాయకులు సుధాకర్, ఎస్ నాయకులు భరత్ పాల్గొన్నారు. పేదలకు ఇళ్లను సాధించడమే లక్ష్యంగా సమరశీల పోరాటాలు : కూనంనేని సాంబశివరావుసమావేశంలో కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ రాష్ట్రంలో ఇళ్లు లేని నిరు పేదలకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు దక్కేలా కమ్యునిస్టు పార్టీలు సమరశీల పోరాటాలకు సన్నద్ధం కావాలని వామపక్ష పార్టీలు చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నాయని ప్రకటించారు. ఇందుకు సంబంధించిన దశల వారి ఉద్యమ కార్యాచరణను ఆయన వెల్లడించారు. ఇళ్ల స్థలాలు, ఇళ్ల కోసం జూలై 1న రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాలు, కలెక్టర్ కార్యాలయాల ముందు పెద్దఎత్తున ముట్టడి, నిరసన ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన పేదల నుంచి దరఖాస్తులను సేకరించి జూలై 6న హైదరాబాద్ (ఇందిరాపార్క్) వేలాది మందితో ధర్నా నిర్వహించనున్నట్లు వారు చెప్పారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి పేదల నుంచి సేకరించిన దరఖాస్తులను నేరుగా సమర్పిస్తామన్నారు. ఆ తర్వాత ముఖ్యమంత్రి స్పందన మేరకు తమ ఉద్యమ కార్యాచరణ ఉంటుందని వారు చెప్పారు. ఈ 'మహత్తర గుడిసెల పోరాటానికి' ఏ పేరు పెట్టాలనేది జూలై 2న సమావేశమై నిర్ణయించనున్నట్లు కూనంనేని సాంబశివరావు వెల్లడించారు. అధికారులు, పోలీసులు దొంగల మాదిరిగా అర్ధ రాత్రి ఇళ్ళను కూల్చడం దుర్మార్గంహనుమకొండ జిల్లా గుండ్ల సింగారంలో గత 4 ఏళ్లుగా నిరుపేదలు గుడిసెలు వేసుకుని జీవిస్తుంటే అధికారులు, పోలీసులు దొంగల మాదిరిగా అర్ధరాత్రి సమయంలో గ్రామంపై పడి ఎలాంటి విచక్షణ లేకుండా పేదల ఇళ్ళను కూల్చివేయడం దుర్మార్గమని సాంబశివరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలు, పిల్లలు అని కూడా చూడకుండా బలవంతంగా లాగిపడేసి అడ్డంవచ్చిన యువకులు, వృద్ధుల కాళ్ళు చేతులు మడిచి మరీ బలవంతంగా వాహనాల్లోకి ఎక్కించి, సుమారు 300 నుండి 400 మందిని అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఒకప్పుడు అక్కడ ఉన్న 'కోమల కుంట' అనే చెరువును ప్రభుత్వం పూడ్చి, ఎస్ కాల్వను తవ్వేందుకు సిద్ధమైందని, ఇదే క్రమంలో ఉమ్మడి రాష్ట్రంలో 2009లోనే అప్పటి సిఎం రాజశేఖర్ రెడ్డి సర్వే నంబర్ 174, 175 కింద ఉన్న 56 ఎకరాల భూమిలో దాదాపు 1400 మంది పేదలకు పట్టాలు పంపిణీ చేశారన్నారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా మరో 40 మందికి ఇక్కడే పట్టాలు ఇవ్వగా ప్రస్తుతం బాధితులు కేవలం 8 ఎకరాల పరిధిలోనే గుడిసెలు వేసుకుని నివసిస్తున్నారని తెలిపారు. ఇక్కడ, కాల్వ ద్వారా నీరు వచ్చే పరిస్థితి లేకపోయినా అధికారులు అత్సుహంతో గుడిసెలు కూల్చివేశారని, ఇప్పటికే ఈ సర్వే నంబర్లలోని వందలాది ఎకరాలు ఇతరుల ఆధీనంలో ఉన్నాయని, వాటిని ఎందుకు కూల్చివేయలేదని ఆయన ప్రశ్నించారు. ఈ కూల్చివేతలకు సంబంధించి స్థానిక ఎంఎల్ ఏ వివరణ కోరగా తనకు తెలియదని తప్పించుకున్నారన్నారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి, సలహాదారు నరేందర్ రెడ్డి దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు తెలిపారు. ఇదే తరహాలో రెండు రోజుల కింద గోపాల్ ప్రాంతంలో సిపిఐ(ఎం) నాయకత్వంలో పేదలు వేసుకున్న గుడిసెలను కూడా ఎలాంటి దయాదాక్షిణ్యాలు లేకుండా కూల్చేసి, చుట్టూ ఫెన్సింగ్ వేశారన్నారు. గతంలో వెలుగుమట్లలోనూ ఇలాగే జరిగిందని, కూల్చేసిన చోటే మళ్ళీ ఇళ్ళు కట్టించి ఇస్తామని ప్రభుత్వం చెప్పడం వారి ద్వంద్వ విధానానికి నిదర్శనమని విమర్శించారు. గోపాల్ గుండ్ల సింగారం బాధితులకు వెలుగుమట్ల తరహాలోనే ప్రత్యామ్నాయ ఇళ్ళు కట్టించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ మహానగరంతో పాటు రంగారెడ్డి, మేడ్చల్, వరంగల్, మహబూబాబాద్, భూపాలపల్లి, కొత్తగూడెం, ఖమ్మం, కరీంనగర్ జిల్లాల్లో లక్షలాది మంది పేదలు 25, 30, 50 గజాల లోపు చిన్న చిన్న గుడిసెల్లో, మురికివాడల్లో నివసిస్తున్నారని వివరించారు. వీరంతా భూదాన్ భూములు, ప్రభుత్వ భూములు, మిగులు భూముల్లో దశాబ్దాలుగా ఉంటున్నారని వీరందరికి పట్టాలను ఇవ్వాలని సాంబశివరావు డిమాండ్ చేశారు. పేదలపై అక్రమ కేసులు అన్యాయం : అబ్బాస్ అబ్బాస్ మాట్లాడుతూ హన్మకొండ జిల్లా గుండ్ల సింగారం, గోపాల్ వెలుగుమట్ల, జగిత్యాల ప్రాంతాల్లో పేదలు వేసుకున్న దాదాపు 2 వేల గుడిసెలను ప్రభుత్వం అమానుషంగా కూల్చివేయడాన్ని సిపిఐ(ఎం) తీవ్రంగా ఖండిస్తున్నదన్నారు. పేదలపై అక్రమంగా కేసులు బనాయించి 40 నుండి 50 రోజుల పాటు జైళ్లలో పెట్టడం అత్యంత దారుణమన్నారు. 2007లో జరిగిన భూపోరాటంలో ముదిగొండ కాల్పుల్లో ఏడుగురు పేదలు ప్రాణాలు కోల్పోయారని, ఆతర్వాతే అప్పటి సిఎం వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి పేదలందరికీ ఇళ్ల స్థలాలు, ఇళ్లు కట్టించి ఇచ్చేందుకు 'ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని' ప్రారంభించారని గుర్తు చేశారు. నాడు ఆ పథకం కింద పట్టాలు పొందిన వారి ఇళ్లను కూడా నేడు ప్రభుత్వం కూల్చివేయడం దుర్మార్గమని ఆవేదన వ్యక్తం చేశారు.పేద ప్రజలపై బుల్డోజర్లు ఎక్కించకండి: గోవర్ధన్ప్రభుత్వం పేద ప్రజలపై యుద్ధం చేయవద్దని, వారిపై బుల్డోజర్లు ఎక్కించి ఉసురు పోసుకోవద్దని కె. గోవర్ధన్ కోరారు. తెలంగాణ రాష్ట్రంలో 'గుడిసె రహిత' లేదా ఇల్లు లేని కుటుంబం అంటూ ఏదీ లేకుండా, ప్రతి కుటుంబానికి నిలువ నీడ ఉండేలా ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దొంగల్లాగా, బందిపోట్లలాగా తెల్లవారుజామున వెళ్లి ఇళ్లను కూల్చడం సరైన పద్ధతి కాదన్నారు. కమ్యూనిస్టులుగా తాము ఎలాంటి గొంతెమ్మ కోరికలు కోరడంలేదన్నారు. కేవలం పేదలు తల దాచుకునేందుకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు ఇవ్వాలని సిఎం రేవంత్ రెడ్డికి, కాంగ్రెస్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. కబ్జాల చిట్టా ఇస్తాం.. చర్యలు తీసుకోండి: సుధాకర్నిలువ నీడ లేని పేదల పక్షాన నిలబడి పోరాడేది కమ్యూనిస్ట్ పార్టీలేనని, రాష్ట్రంలో ఎక్కడెక్కడ ప్రభుత్వ భూములు కబ్జాకు గురయ్యాయో, ఎక్కడెక్కడ రియల్ ఎస్టేట్ వ్యాపారులు భూములను అక్రమించుకున్నారో ఆ వివరాలన్నీ తాము ఇస్తామని, ధైర్యముంటే వారిపై చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రికి, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని సుధాకర్ సవాల్ చేశారు. ప్రభుత్వ భూమి కబ్జాకు గురవుతోందని వెలుగులోకి తెచ్చింది కమ్యూనిస్టులేనని, బడా బాబుల నుంచి ప్రభుత్వ భూములను కాపాడుతున్నది కూడా తామేనని స్పష్టం చేశారు.అధికారుల అత్యుత్సాహంపై విచారణ జరపాలి : భరత్ కొంతమంది పోలీస్ అధికారులు, కలెక్టర్లు, ఉన్నతాధికారులు కొందరు పెద్దల అండతో పేదలపై అత్యుత్సాహం ప్రదర్శిస్తూ ఇళ్లను కూల్చివేస్తున్నారని భరత్ ఆగ్రహంవ్యక్తం చేశారు. అసలు ఈ కూల్చివేతలు ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జరుగుతున్నాయా లేక అధికారులు ఇష్టారాజ్యంగా చేస్తున్నారా అని ప్రశ్నించారు. ఒక వేళ ప్రభుత్వం నుండి ఎలాంటి ఉత్తర్వులు లేకుండా, అధికారులే సొంత నిర్ణయాలతో అత్యుత్సాహం ప్రదర్శిస్తూ పేదలపై దాడులకు తెగబడుతున్న అధికారులను ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

# ఆర్ పీఐ(A) తెలంగాణ ఓబీసీ చైర్మన్‌గా కొంకిసా పాప సచిన్ గౌడ్ నియామకం

**హైదరాబాద్, అఖండ సూర్య :**




రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అథవాలే) తెలంగాణ రాష్ట్ర OBC విభాగం చైర్మన్‌గా కొంకిసా పాప సచిన్ గౌడ్ ను నియమించినట్లు పార్టీ జాతీయ అధ్యక్షులు, కేంద్ర మాజీ మంత్రి గౌరవనీయులు శ్రీ రామ్‌దాస్ అథవాలే ఆదివారం ప్రకటించారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, బహుజనులు, వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేసే నాయకత్వ లక్షణాలను గుర్తించి ఈ బాధ్యతలను అప్పగించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.ఈ సందర్భంగా శ్రీ కొంకిసా పాప సచిన్ గౌడ్ మాట్లాడుతూ, తనపై విశ్వాసం ఉంచి తెలంగాణ రాష్ట్ర OBC చైర్మన్‌గా నియమించిన పార్టీ జాతీయ అధ్యక్షులు శ్రీ రామ్‌దాస్ అథవాలేకి, పార్టీ రాష్ట్ర మరియు జాతీయ నాయకత్వానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేలా అంకితభావంతో పనిచేస్తానని, రాష్ట్రవ్యాప్తంగా OBC వర్గాలను పార్టీతో అనుసంధానం చేసి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. అలాగే పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, యువతను, సామాజిక న్యాయం కోరుకునే వర్గాలను పార్టీ వైపు ఆకర్షించే దిశగా పనిచేస్తానని తెలిపారు. "తెలంగాణ రాష్ట్రంలో OBC వర్గాల అభ్యున్నతి, సామాజిక న్యాయం, రాజకీయ సాధికారత కోసం మరింత చురుకుగా పనిచేస్తాను. రాష్ట్ర వ్యాప్తంగా వెనుకబడిన వర్గాలను పార్టీతో అనుసంధానం చేసి పార్టీ బలోపేతానికి కృషి చేస్తాను" అని సచిన్ గౌడ్ పేర్కొన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పార్టీ నిర్మాణాన్ని మరింత బలపరిచే దిశగా కార్యక్రమాలు చేపడతానని తెలిపారు.యువతను రాజకీయాల్లోకి ప్రోత్సహించడం, సామాజిక న్యాయం కోరుకునే వర్గాలను పార్టీ వైపు ఆకర్షించడం, బహుజన వర్గాల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడం తన ప్రధాన లక్ష్యాల్లో భాగమని ఆయన చెప్పారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజలకు చేరవేసే కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహిస్తామని వెల్లడించారు.రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అథవాలే) దేశవ్యాప్తంగా బహుజన, దళిత, వెనుకబడిన వర్గాల హక్కుల కోసం పనిచేస్తున్న రాజకీయ పార్టీగా గుర్తింపు పొందింది. సామాజిక సమానత్వం, రాజ్యాంగ విలువల పరిరక్షణ, అణగారిన వర్గాల అభ్యున్నతి వంటి అంశాలను ప్రధాన అజెండాగా తీసుకుని ముందుకు సాగుతోంది. తెలంగాణలో కూడా పార్టీ కార్యకలాపాలను విస్తరించే దిశగా నాయకత్వం చర్యలు చేపడుతోంది.రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం, OBC వర్గాల్లో పార్టీ ప్రాతినిధ్యాన్ని పెంచేందుకు ఈ నియామకం కీలకంగా మారే అవకాశం ఉంది. ముఖ్యంగా యువ నాయకత్వాన్ని ప్రోత్సహిస్తూ సామాజిక వర్గాల మధ్య పార్టీ ప్రభావాన్ని పెంచేందుకు ఇది ఉపయోగపడుతుందని భావిస్తున్నారు.పార్టీ నాయకులు, కార్యకర్తలు సచిన్ గౌడ్ నియామకాన్ని స్వాగతిస్తూ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణలో పార్టీని మరింత బలోపేతం చేసి, OBC వర్గాల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారనే నమ్మకాన్ని వ్యక్తం చేశారు.ఈ నియామకంతో తెలంగాణ రాజకీయాల్లో ఆర్పీఐ (అథవాలే) తన కార్యకలాపాలను మరింత విస్తరించే దిశగా అడుగులు వేస్తోందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. రాష్ట్రంలోని వెనుకబడిన వర్గాల మధ్య పార్టీ ప్రాబల్యాన్ని పెంచేందుకు కొత్త నాయకత్వం ఎలాంటి కార్యాచరణ చేపడుతుందనే అంశంపై ఆసక్తి నెలకొంది.

# తెలంగాణ పోలీస్ అకాడమీలో ఎన్డీపీఎస్ పై ప్రత్యేక శిక్షణ






**హైదరాబాద్, అఖండ సూర్య:**

మాదక ద్రవ్యాల నియంత్రణలో పోలీసు సామర్థ్యాల పెంపుకు ప్రత్యేక శిక్షణ మాదక ద్రవ్యాలు మరియు మానసిక ప్రభావిత పదార్థాల చట్టం (NDPS Act) కింద నమోదయ్యే కేసుల దర్యాప్తులో పోలీసు అధికారుల నైపుణ్యాలు, చట్టపరమైన అవగాహన మరియు దర్యాప్తు సామర్థ్యాలను మెరుగుపరచే లక్ష్యంతో తెలంగాణ పోలీస్ అకాడమీలో 37వ బ్యాచ్ "NDPS కేసుల దర్యాప్తు కోర్సు" నేడు (జూన్ 22 ) ప్రారంభమైంది. ఈ కోర్సు ప్రారంభమైనప్పటి నుండి ఇప్పటివరకు 5,000 మందికి పైగా పోలీసు అధికారులు శిక్షణ పొందడం విశేషం.

**నాలుగు రోజుల ప్రత్యేక శిక్షణ కార్యక్రమం**

అకాడమీ డైరెక్టర్ శ్రీమతి అభిలాష బిస్త్, IPS ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ఈ నాలుగు రోజుల శిక్షణా కార్యక్రమంలో సిద్ధాంతపరమైన అవగాహనతో పాటు ప్రాయోగిక దర్యాప్తు నైపుణ్యాలకు ప్రాధాన్యత ఇవ్వబడుతోంది. ఎన్డీపీఎస్ చట్టం, దర్యాప్తు విధానాలు, SOPలు, సన్నివేశ ఆధారిత ప్రాక్టికల్ వ్యాయామాలు, డిజిటల్ టూల్స్ వినియోగం మరియు తాజా న్యాయ తీర్పులపై శిక్షణ అందించనున్నారు.

**మొదటి రోజు ముఖ్యాంశాలు**

మొదటి రోజు నిర్వహించిన సెషన్లలో:
ఎన్డీపీఎస్ చట్టంపై సమగ్ర అవగాహన
ఎన్డీపీఎస్ కేసుల దర్యాప్తు SOP
దర్యాప్తులో తప్పనిసరిగా పాటించాల్సిన 25 కీలక దశలు
చట్టపరమైన అనుసరణ, డాక్యుమెంటేషన్ మరియు శాస్త్రీయ దర్యాప్తు విధానాలు అనే అంశాలపై ప్రత్యేక శిక్షణ అందించబడింది.

**ప్రత్యేక ఫ్యాకల్టీ ద్వారా శిక్షణ**

ఈ సెషన్లను ఈగల్ ఫోర్సెస్‌కు చెందిన శ్రీ నర్సింగ్ రావు, ACP నిర్వహించారు. ఆయన ఎన్డీపీఎస్ చట్టంలోని ముఖ్యమైన నిబంధనలను వివరించడంతో పాటు, ఈగల్ ఫోర్సెస్ రూపొందించిన తాజా దర్యాప్తు SOPను శిక్షణార్థులకు వివరించారు. దర్యాప్తులో జరిగే సాధారణ పొరపాట్లు, చట్టపరమైన జాగ్రత్తలు మరియు విజయవంతమైన అభియోగ నిరూపణకు అవసరమైన అంశాలపై విలువైన సూచనలు అందించారు.

**అధికారుల విశేష స్పందన**

ఈ కోర్సులో మొత్తం 60 మంది పోలీసు అధికారులు పాల్గొంటున్నారు. వీరిలో 14 మంది కానిస్టేబుళ్లు, 15 మంది హెడ్ కానిస్టేబుళ్లు, 9 మంది ASIలు, 19 మంది సబ్ ఇన్‌స్పెక్టర్లు మరియు 3 మంది ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు. శిక్షణార్థులు సెషన్లలో చురుకుగా పాల్గొని మాదక ద్రవ్యాల నియంత్రణకు సంబంధించిన తాజా దర్యాప్తు విధానాలపై అవగాహన పెంపొందించుకున్నారు.

**అకాడమీ ఫ్యాకల్టీ భాగస్వామ్యం**

ఈ శిక్షణలో అకాడమీ ఇండోర్ ఫ్యాకల్టీ, పోలీస్, లా, ప్రాసిక్యూషన్ మరియు ఫోరెన్సిక్ విభాగాల సభ్యులు పాల్గొన్నారు. అదనంగా అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీ నాగేశ్వరరావు, నరహరి, DSPలు శ్రీ సతీష్ కుమార్, శ్రీ జ్ఞానేంద్ర రెడ్డి, శ్రీ ఆదూరి శ్రీనివాసరావు, శ్రీ సందీప్ రెడ్డి, శ్రీ భాస్కర్, శ్రీ రామారావు దేవరెడ్డి, లా ఫ్యాకల్టీ శ్రీమతి వరలక్ష్మి, డాక్టర్ రవికుమార్ తదితరులు హాజరయ్యారు.ఈ కోర్సునకు ధనజ కోర్సు డైరెక్టర్ గా వ్యవహరిస్తున్నారు.

AKHANDAA SURYAA అఖండ సూర్య తెలుగు దినపత్రిక
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షల, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార,
ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలను 'అఖండ సూర్య' దినపత్రికలో ప్రచురించుటకు వెంటనే సంప్రదించండి.
98481 66029
96188 80945
85005 09808

# శాంతి బాటలో అమెరికా ఇరాన్

**మొదటిపేజీ తరువాయి**

అంగీకారానికి వచ్చాయి. ఇందుకోసం ప్రత్యేక వర్కింగ్ గ్రూప్‌లను ఏర్పాటు చేసేందుకు ఇరు దేశాలు సమ్మతించాయి. మధ్యప్రాచ్యంలో యుద్ధ మేఘాలు కమ్ముకున్న వేళ.. ప్రపంచ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీస్తున్న అమెరికా ఇరాన్ వివాదాన్ని పరిష్కరించేందుకు పాకిస్థాన్, ఖతార్ దేశాలు ప్రత్యేక చొరవ తీసుకున్నాయి. స్విట్జర్లాండ్‌లోని బర్గెన్‌స్టాక్ రిసార్ట్ వేదికగా జరిగిన ఈ రహస్య దౌత్య సమావేశంలో ఇరు దేశాలను ఒకే టేబుల్ పైకి తీసుకురావడంలో మధ్యవర్తులు విజయం సాధించారు. చర్చల అనంతరం విడుదల చేసిన ఉమ్మడి ప్రకటనలో.. రాబోయే 60 రోజుల్లో (రెండు నెలల్లో) ఒక చారిత్రాత్మక తుది శాంతి ఒప్పందానికి చేరుకునేలా స్పష్టమైన రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేసుకున్నట్లు వెల్లడించారు. ఈ శాంతి చర్చల ప్రక్రియ నిరంతరాయంగా సాగేందుకు, తీసుకున్న నిర్ణయాలను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించేందుకు ఒక ప్రత్యేక హై లెవల్ (ఉన్నత స్థాయి) కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ కమిటీలో అమెరికా తరపున వైస్ ప్రెసిడెంట్ జేడీ వాన్స్, ఇరాన్ దేశం తరపున పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ బాఘర్ ఘాలిబాఫ్ ప్రధాన చర్చాకర్తలుగా బాధ్యతలు తీసుకోనున్నారు. అణు కార్యక్రమాల నియంత్రణ, ఆర్థిక ఆంక్షల సడలింపు, ఒప్పందాల అమలు తీరును ఈ ఉన్నత స్థాయి కమిటీ ఎప్పటికప్పుడు సమీక్షిస్తుంది. గత కొన్ని నెలలుగా లెబనాన్ సరిహద్దుల్లో జరుగుతున్న భీకర సైనిక దాడులకు ముగింపు పలకడం ఈ చర్చల్లో అత్యంత ప్రధానమైన అంశంగా మారింది. అక్కడ తక్షణమే శాంతిని నెలకొల్పేందుకు మరియు కాల్పుల విరమణను పక్కాగా అమలు చేసేందుకు 'డీకాన్ఫ్లిక్షన్ సెల్' పేరిట ఒక ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయడానికి అమెరికా, ఇరాన్, లెబనాన్ దేశాలు అంగీకరించాయి. మధ్యవర్తి దేశాల సమన్వయంతో పనిచేసే ఈ సెల్.. సరిహద్దుల్లో రక్తాపాతాన్ని ఆపడానికి నిరంతరం శ్రమిస్తుంది. ప్రపంచ చమురు రవాణాకు అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధిలో గత కొంతకాలంగా అంతర్జాతీయ వాణిజ్య నౌకలపై దాడులు జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ సమస్యకు పరిష్కారంగా, సముద్ర మార్గంలో నౌకలు ఎలాంటి భయం లేకుండా సురక్షితంగా ప్రయాణించేలా చూసేందుకు ఒక ఉమ్మడి సమాచార వ్యవస్థను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. దీనివల్ల అంతర్జాతీయ చమురు రవాణాకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా భద్రత లభిస్తుంది. స్విట్జర్లాండ్ చర్చల ఫలితాలపై ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చీ సోషల్ మీడియా వేదికగా హర్షం వ్యక్తం చేశారు. లెబనాన్ సంక్షోభానికి ముగింపు పలికే దిశగా తమ చర్చలు గొప్ప పురోగతి సాధించాయన్నారు. ఈ చర్చల వల్ల ఇరాన్ ఆర్థిక రంగానికి ఊరట లభించిందని, ఇరాన్ చమురు, పెట్రోకెమికల్ ఉత్పత్తుల ఎగుమతులపై అమెరికా విధించిన కఠినమైన ఆర్థిక ఆంక్షలకు మినహాయింపులు లభించాయని వెల్లడించారు. ఇరాన్ పునర్నిర్మాణానికి ఈ నిర్ణయం ఎంతో దోహదపడుతుందన్నారు. ఆంక్షల సడలింపుతో పాటు ఇరాన్ నౌకాశ్రయాలపై (పోర్టులపై) ఉన్న అమెరికా నౌకాదళ దిగ్బంధనాన్ని పూర్తిగా ఎత్తివేసేందుకు అగ్రరాజ్యం ఒప్పుకుంది. అలాగే గతంలో వివిధ అంతర్జాతీయ బ్యాంకులు, విదేశీ ఖాతాల్లో అమెరికా ఒత్తిడితో స్తంభింపజేసిన (ఫ్రీజ్ చేసిన) ఇరాన్ దేశానికి చెందిన కొన్ని వేల కోట్ల విలువైన సొంత ఆర్థిక ఆస్తులను తిరిగి విడుదల చేసేందుకు కూడా అమెరికా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇరాన్ దేశ ఆర్థిక పురోభివృద్ధికి ఇవి ఎంతో కీలకం కానున్నాయి. అయితే, ఈ చర్చలు జరుగుతున్న సమయంలోనే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ఒక ప్రకటన చర్చల్లో తీవ్ర కలకలం రేపింది. లెబనాన్‌లోని ఇరాన్ మద్దతు గల సాయుధ ముఠాలు తమ దాడులను తక్షణమే ఆపకపోతే ఇరాన్‌పై అంతకుమించిన కఠిన చర్యలు తీసుకుంటామని ట్రంప్ హెచ్చరించారు. ఈ బెదిరింపు వ్యాఖ్యలపై ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఇస్మాయెల్ బఘాయి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అమెరికా వైఖరికి నిరసనగా చర్చల నుంచి తాత్కాలికంగా తప్పుకోవాలని భావించినప్పటికీ, పాకిస్థాన్, ఖతార్ ప్రతినిధులు ఇరాన్ బృందాన్ని నచ్చజెప్పి తిరిగి చర్చల టేబుల్ ముందుకు తెచ్చారు. ప్రస్తుతానికి ప్రధానాంశాలపై ప్రాథమిక అంగీకారం కుదిరినందున, స్విట్జర్లాండ్‌లోని ప్రసిద్ధ బర్గెన్‌స్టాక్ రిసార్ట్‌లో ఈ వారం మొత్తం ఇరు దేశాల అంతర్జాతీయ చట్ట నిపుణులు, సాంకేతిక బృందాల మధ్య అంతర్గత చర్చలు కొనసాగనున్నాయి. మిగిలిపోయిన చిన్నచిన్న సాంకేతిక వివాదాలపై పూర్తి స్పష్టత తెచ్చుకుని, వచ్చే రెండు నెలల గడువులోగా ఎలాంటి లోపాలు లేని ఒక శాశ్వత చారిత్రాత్మక శాంతి ఒప్పందంపై సంతకాలు చేయడమే లక్ష్యంగా ఇరు దేశాలు ముందుకు సాగుతున్నాయి.




# పాక్ ఐఎస్ఐ స్లీపర్ సెల్ గుట్టురట్టు

**మొదటిపేజీ తరువాయి**

కింద కేసు నమోదు చేసి, జ్యుడిషియల్ కస్టడీకి తరలించారు. ఈ అరెస్ట్‌తో దేశంలోని ప్రధాన విద్యుత్ కేంద్రాలపై జరగబోయే పెద్ద ప్రమాదం తప్పిందని రక్షణ వర్గాలు భావిస్తున్నాయి.

**పవర్ కంపెనీలో కాంట్రాక్ట్ కార్మికుడిగా ఉంటూ గూఢచర్యం**

పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. పంజాబ్ రాష్ట్రంలోని సరిహద్దు జిల్లా తర్న్ తారన్‌కు చెందిన సేవక్ సింగ్ గత నాలుగు నెలల క్రితం ఛత్తీస్‌గఢ్‌కు వచ్చాడు. జాంజ్‌గిర్ చంపా జిల్లా పరిధిలోని అకల్తారా నగరంలో గల మినీ మాతా చౌక్ ప్రాంతంలో రాజీవ్ కేడియా అనే వ్యక్తికి చెందిన ఇంట్లో అద్దెకు దిగాడు. ఇక్కడ ఉంటున్న ఒక బంధువు సాయంతో స్థానికంగా ఉన్న ప్రముఖ 'జేఎస్‌డబ్ల్యూ' పవర్ కంపెనీలో ఉద్యోగం సంపాదించాడు. ఆ సంస్థలో ఒక సాధారణ కాంట్రాక్ట్ కార్మికుడిగా చేరి, ఎవరికీ ఎలాంటి అనుమానం రాకుండా లోపల తిరుగుతూ రహస్యంగా గూఢచర్యానికి పాల్పడటం ప్రారంభించాడు. జాంజ్‌గిర్ చంపా జిల్లాలో ఇటీవల కాలంలో అపరిచిత నేరాలు పెరుగుతుండటం, ఇతర రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో వలస కార్మికులు వస్తుండటంతో జిల్లా ఎస్పీ విజయ్ కుమార్ పాండే ఒక కీలక నిర్ణయం తీసుకున్నారు. జిల్లాలోని అద్దెదారులు, బయటి వ్యక్తుల వివరాలను పూర్తి స్థాయిలో వెరిఫికేషన్ చేయాలని స్థానిక పోలీసులను ఆదేశించారు. ఈ తనిఖీల్లో భాగంగానే అకల్తారా పోలీసులు సేవక్ సింగ్ ఉంటున్న అద్దె ఇంటికి వెళ్లి విచారించారు. ఆ సమయంలో పోలీసుల ప్రశ్నలకు సమాధానం చెప్పలేక సేవక్ సింగ్ తీవ్ర భయాందోళనకు గురయ్యాడు. అతని ప్రవర్తన తేడాగా అనిపించడంతో పోలీసులు అతని మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకుని తనిఖీ చేయగా అసలు నిజం బయటపడింది. పోలీసులు సేవక్ సింగ్ మొబైల్ ఫోన్‌ను లోతుగా స్కానింగ్ చేయగా విస్తుపోయే విషయాలు వెల్లడయ్యాయి. ఆ మొబైల్ ద్వారా నిందితుడు పాకిస్థాన్‌కు చెందిన పలు అనుమానాస్పద కోడ్ నంబర్లతో నిరంతరం టచ్‌లో ఉన్నట్లు తేలింది. ఐఎస్ఐ ఏజెంట్లతో రహస్యంగా మాట్లాడిన వీడియో కాల్ రికార్డులు, దేశ రక్షణకు నష్టం కలిగించేలా ఉన్న వాట్సాప్ చాటింగ్‌లు లభ్యమయ్యాయి. ఈ కాల్ రికార్డులు, ఆడియో, వీడియో సంభాషణల పక్కా ఆధారాలతో అతడు ఐఎస్ఐ స్లీపర్ సెల్ సభ్యుడేనని పోలీసులు తేల్చారు. తదుపరి లోతైన విచారణ కోసం ఈ వ్యవహారాన్ని రాష్ట్ర యాంటీ టెర్రరిజం స్క్వాడ్ కు బదిలీ చేశారు. అరెస్ట్ అనంతరం పోలీసులు నిందితుడు సేవక్ సింగ్‌ను తమదైన శైలిలో విచారించగా విస్తుపోయే నిజాలు ఒప్పుకున్నాడు. సోషల్ మీడియాలో దేశ వ్యతిరేక ఐఎస్ఐ వీడియోలను చూసి తాను ప్రభావితమయ్యానని తెలిపాడు. ఆ వీడియోల కింద ఉన్న ఒక అపరిచిత నంబర్‌కు తన వ్యక్తిగత వివరాలను పంపినట్లు పేర్కొన్నాడు. ఆ తర్వాత అవతలి వైపు ఉన్న ఐఎస్ఐ హ్యాండ్లర్ ఇతనితో మాట్లాడి, తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించవచ్చని ఆశ చూపించాడు. అందులో భాగంగానే ప్రాథమిక ఖర్చుల నిమిత్తం సేవక్ సింగ్ అకౌంట్‌కు రూ.20,000 ఆన్‌లైన్ ద్వారా పంపినట్లు నిందితుడు విచారణలో అంగీకరించాడు. నిందితుడికి అడ్వాన్స్ డబ్బులు పంపిన పాక్ ఏజెంట్.. అతను ప్రస్తుతం ఉంటున్న లొకేషన్, ఆ పరిసర ప్రాంతాల రహస్య వీడియోలను పంపాలని ఆదేశించాడు. దీంతో డబ్బు ఆశకు లోనైన సేవక్ సింగ్.. తాను కాంట్రాక్ట్ కార్మికుడిగా పనిచేస్తున్న జేఎస్‌డబ్ల్యూ పవర్ కంపెనీ ఆవరణతో పాటు, బిలాస్‌పూర్ జిల్లాలో దేశానికే ఎంతో కీలకమైన ఎన్‌టీపీసీ థర్మల్ పవర్ ప్లాంట్‌కు సంబంధించిన అత్యంత సున్నితమైన భద్రతా లొకేషన్ వివరాలను, ప్లాంట్ల లోపలి దృశ్యాలను వీడియోలు తీసి పాకిస్థాన్‌కు చేరవేశాడు. ఈ స్లీపర్ సెల్ కేవలం సమాచారాన్ని సేకరించడమే కాకుండా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో ఒక పెద్ద కుట్రను అమలు చేయడానికి ఐఎస్ఐ ప్లాన్ చేసిందని జాంజ్‌గిర్ చంపా జిల్లా ఎస్పీ విజయ్ కుమార్ పాండే అధికారికంగా ధృవీకరించారు. నిందితుడు సేవక్ సింగ్ కేవలం పవర్ ప్లాంట్ల సమాచారమే కాకుండా.. రాష్ట్రంలోని కీలక భద్రతా ప్రాంతాలు, ఆర్మీ వాహనాల కదలికలు మరియు ఛత్తీస్‌గఢ్‌లోని పలువురు ప్రముఖ రాజకీయ, సామాజిక నాయకులకు సంబంధించిన వ్యక్తిగత వివరాలను, వారి నివాసాల రూట్ మ్యాప్‌లను కూడా పాకిస్థాన్ నంబర్లకు పంపినట్లు చాటింగ్‌ల ద్వారా స్పష్టమైందని ఎస్పీ వెల్లడించారు. పోలీసుల విచారణలో అత్యంత ప్రమాదకరమైన ఉగ్రవాద కోణం కూడా వెలుగులోకి వచ్చింది. సేవక్ సింగ్ త్వరలోనే పంజాబ్‌లోని తన సొంత గ్రామానికి వెళ్లాల్సి ఉంది. అతను అక్కడికి చేరుకున్నాక, భారత్‌పాక్ అంతర్జాతీయ సరిహద్దుల గుండా పాకిస్థాన్ నుంచి అత్యాధునిక డ్రోన్ల ద్వారా భారీగా ఆయుధాలు, పేలుడు పదార్థాలు మరియు ఉగ్రవాద కార్యకలాపాలకు సంబంధించిన సామగ్రిని ఇతనికి పంపేందుకు ఐఎస్ఐ ప్రణాళికలు సిద్ధం చేసింది. ఈ ఆయుధాలను ఉపయోగించి ఛత్తీస్‌గఢ్, పంజాబ్‌లలో ప్రముఖ వ్యక్తులను లక్ష్యంగా చేసుకుని హత్యలు చేయాలని, తద్వారా దేశంలో అలజడి సృష్టించాలని భావించినట్లు పోలీసులు గుర్తించారు. సాధారణంగా నక్సలైట్ల సమస్య ఉండే ఛత్తీస్‌గఢ్‌లోని జాంజ్‌గిర్ చంపా వంటి అత్యంత ప్రశాంతమైన జిల్లాలో.. ఇలా అంతర్జాతీయ పాకిస్థానీ నిఘా సంస్థకు చెందిన స్లీపర్ సెల్ సభ్యుడు పట్టుబడటం దేశవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపుతోంది. దేశ రక్షణకు, అంతర్గత భద్రతకు సంబంధించిన సీరియస్ కేసు కావడంతో రాష్ట్ర పోలీసులు కేంద్ర ఇంటెలిజెన్స్ బ్యూరో, నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ వంటి కేంద్రీయ భద్రతా సంస్థల అధికారులకు సమాచారాన్ని అందించారు. ఈ నెట్‌వర్క్‌లో మరికొంతమంది ఉన్నారనే అనుమానంతో డిజిటల్ ఆధారాలను విశ్లేషించేందుకు ఫోరెన్సిక్ సైన్స్ బృందం సహాయం కూడా తీసుకుని విచారణను మరింత తీవ్రతరం చేశారు.

# మత్తు వదలండి.. మైదానాలు చేరండి

**మొదటిపేజీ తరువాయి**

క్రీడా మౌలిక సదుపాయాల కోసం ఇప్పటికే ప్రభుత్వం సుమారు రూ. 80 కోట్ల నిధులను మంజూరు చేసిందన్నారు. రాబోయే రోజుల్లో గ్రామీణ ప్రాంతాల నుంచి అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులను తయారు చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇందుకోసం అవసరమైతే పాలమూరు జిల్లాలో క్రీడల కోసం రూ. 100 కోట్లయినా ఖర్చు చేయడానికి ప్రభుత్వం వెనుకడబోదని మంత్రి స్పష్టం చేశారు. క్రీడా రంగ పనుల్లో ఎలాంటి ఆలస్యం జరగకుండా ఉండేందుకు ప్రభుత్వం 'గ్రీన్ ఛానల్' పద్ధతిని తీసుకువచ్చిందని, దీని ద్వారా నిధుల విడుదల, సాంకేతిక అనుమతులు త్వరితగతిన లభిస్తాయని మంత్రి వెల్లడించారు. జిల్లాలోని స్విమ్మింగ్ పూల్‌ను ఇకపై స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (శాట్స్) ఆధ్వర్యంలోనే నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. క్లబ్‌లు, క్రీడా అసోసియేషన్లు కేవలం నగరాలకే పరిమితం కాకుండా గ్రామాల్లో దాగి ఉన్న అసలైన ప్రతిభను వెలికితీయడానికి చురుగ్గా పని చేయాలని సూచించారు. ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. మంత్రి వాకిటి శ్రీహరి క్రీడాశాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలి సంతకంతో మహబూబ్‌నగర్ జిల్లాకే నిధులు మంజూరు చేయడం సంతోషకరమన్నారు. జిల్లాలో త్వరలోనే వాలీబాల్, కబడ్డీ అకాడమీలతో పాటు అత్యాధునిక క్రికెట్ స్టేడియం నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. భవిష్యత్తులో ఒలింపిక్ క్రీడల్లో మన దేశం తరపున పాలమూరు బిడ్డలు ప్రాతినిధ్యం వహించి దేశానికి బంగారు పతకం సాధించేలా అత్యుత్తమ శిక్షణ ఇప్పిస్తామని, అవసరమైతే ఇందుకోసం మరిన్ని భూములను సేకరిస్తామని స్పష్టం చేశారు. రాష్ట్ర ఢిల్లీ అధికార ప్రతినిధి, క్రీడా వ్యవహారాల సలహాదారు ఎపి జితేందర్ రెడ్డి మాట్లాడుతూ.. గత ప్రభుత్వాల హయాంలో క్రీడల బడ్జెట్ కేవలం రూ. 50 కోట్లు మాత్రమే ఉండేదని, కానీ సీఎం రేవంత్ రెడ్డి క్రీడలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ బడ్జెట్‌ను రికార్డు స్థాయిలో పెంచారని కొనియాడారు. మొదట ఈ బడ్జెట్‌ను రూ. 350 కోట్లకు, ఆ తర్వాత రూ. 640 కోట్లకు పెంచినట్లు వివరించారు. మహబూబ్‌నగర్ జిల్లాలో క్రీడా పాఠశాల (స్పోర్ట్స్ స్కూల్) ఏర్పాటు చేయాలని మంత్రిని కోరారు. దీనికోసం ఇప్పటికే 30 ఎకరాల ప్రభుత్వ భూమిని కూడా సిద్ధంగా ఉంచినట్లు జితేందర్ రెడ్డి వెల్లడించారు. తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ (శాట్స్) చైర్మన్ శివసేనా రెడ్డి మాట్లాడుతూ.. 2014 నుంచి 2024 వరకు గత పదేళ్ల కాలంలో క్రీడలకు కేటాయించిన బడ్జెట్ ఎప్పుడూ రూ. 300 కోట్లు దాటలేదన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత తొలి బడ్జెట్‌లోనే రూ. 360 కోట్లు, రెండో బడ్జెట్‌లో రూ. 468 కోట్లు, తాజా మూడో బడ్జెట్‌లో ఏకంగా రూ. 640 కోట్లు కేటాయించి క్రీడా రంగానికి కొత్త ఊపిరి పోసిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా గతంలో నిర్లక్ష్యానికి గురైన స్టేడియాలు, స్విమ్మింగ్ పూల్స్‌ను పునరుద్ధరిస్తున్నామని, ఉమ్మడి పాలమూరులోని ప్రతి జిల్లాకు రూ. 15 నుండి రూ. 18 కోట్ల వరకు క్రీడా అభివృద్ధి కోసం ఇస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో 2009 తర్వాత క్రీడా కోచ్‌ల నియామకాలే జరగలేదని, ప్రస్తుత ప్రభుత్వం క్రీడాకారులకు నిపుణులైన శిక్షకులను అందుబాటులోకి తెచ్చేందుకు దాదాపు 350 మంది కొత్త కోచ్‌ల నియామక ప్రక్రియను చేపట్టిందని శాట్స్ చైర్మన్ శివసేనా రెడ్డి తెలిపారు. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు 'సీఎం కప్' పోటీలను నిర్వహిస్తున్నామని, మొదటి విడతలో 3.5 లక్షల మంది, రెండో విడతలో 5.5 లక్షల మంది పాల్గొనగా.. రాబోయే మూడో ఎడిషన్‌లో ఏకంగా 10 లక్షల మంది విద్యార్థులను భాగస్వామ్యం చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఎంపికైన పేద క్రీడాకారుల వసతి, ప్రయాణ ఖర్చులన్నీ ప్రభుత్వమే భరిస్తుందని స్పష్టం చేశారు. ఈ నెల 17 నుండి 26 వరకు దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న 'నషా ముక్త్ భారత్ సప్తాహ్' (వ్యసన ముక్త భారత వారోత్సవాలు) లో భాగంగా మంత్రి, ప్రజాప్రతినిధులు, అధికారులు, క్రీడాకారులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని, డ్రగ్స్ నిర్మూలనకు శ్రమిస్తామని ఘనంగా ప్రతిజ్ఞ చేశారు. అనంతరం మాదకద్రవ్యాల నిర్మూలనపై రూపొందించిన ప్రత్యేక అవగాహన పోస్టర్‌ను మంత్రి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, జిల్లా ఎస్పీ డి. జానకి, మున్సిపల్ మేయర్ గుమ్మాల మమత శ్రీనివాస్, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్, ఒలింపిక్ సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, స్థానిక నాయకులు, వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో యువ క్రీడాకారులు పాల్గొన్నారు.

# వర్షా కాలంలో ప్రజల భద్రతే ప్రాధాన్యం

**మొదటిపేజీ తరువాయి**

మార్గదర్శకాల ప్రకారం.. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఇంజినీరింగ్ అధికారులు పూర్తి అప్రమత్తతతో వ్యవహరించాలని మంత్రి కోమటిరెడ్డి సూచించారు. వర్షాలు ప్రారంభం నుంచి చివరి వరకు వర్షాకాలం ముగిసే వరకు సూపరింటెండింగ్ ఇంజనీర్ (SE) ల నుంచి క్షేత్రస్థాయి అసిస్టెంట్ ఇంజనీర్ల వరకు ఏ ఒక్కరూ కేంద్ర స్థానాలను వదిలి వెళ్లకూడదని స్పష్టం చేశారు. అత్యవసర పరిస్థితుల్లో తక్షణమే స్పందించి రహదారుల పునరుద్ధరణ పనులను చేపట్టడమే ఈ నిబంధనల ముఖ్య ఉద్దేశమని మంత్రి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడైనా భారీ వర్షాల వల్ల రహదారులు కొట్టుకుపోతే లేదా వంతెనలు దెబ్బతింటే తక్షణమే మరమ్మతులు చేపట్టేందుకు అవసరమైన భారీ యంత్రాలను ముందుగానే సిద్ధం చేసుకోవాలని మంత్రి ఆదేశించారు. అన్ని జిల్లాల్లో జేసీబీలు, ఎక్స్‌కవేటర్లు, టిప్పర్లు, నీటిని తోడే డీవాటరింగ్ పంపులను సిద్ధంగా ఉంచాలన్నారు. వీటితో పాటు ఇసుక సంచులు, కంకర, తారు, ఆర్‌సీసీ పైపులు, హెచ్‌పీసీ పైపుల వంటి అత్యవసర సామాగ్రిని ముందస్తుగా నిల్వ చేసుకోవాలని ఇంజినీర్లకు సూచించారు. రాష్ట్రంలో గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని, వరద ప్రభావిత ప్రాంతాలను, ముంపు ప్రమాదం పొంచి ఉన్న రహదారులను, బలహీనంగా ఉన్న వంతెనలను, కల్వర్టులను ముందుగానే గుర్తించాలని మంత్రి కోమటిరెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రమాదకరంగా మారే అవకాశం ఉన్న ప్రతి ప్రాంతానికి సంబంధించిన ప్రత్యామ్నాయ (డైవర్షన్) మార్గాలను ముందే ప్లాన్ చేసుకోవాలన్నారు. దీనివల్ల ఒక వైపు రహదారి బంద్ అయినా ప్రజల ప్రయాణాలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా రవాణా సాగుతుందని పేర్కొన్నారు. భారత వాతావరణ శాఖ (ఐఎండీ) తో పాటు తెలంగాణ రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ జారీ చేసే హెచ్చరికలను ఆర్ అండ్ బి అధికారులు ప్రతి నిమిషం పర్యవేక్షించాలని మంత్రి సూచించారు. క్షేత్ర స్థాయిలో విపత్తులు సంభవించినప్పుడు కేవలం ఒకే శాఖపై ఆధారపడకుండా పోలీస్, రెవెన్యూ, ఇరిగేషన్, విద్యుత్ శాఖల అధికారులతో నిరంతరం సమన్వయం (కోఆర్డినేషన్) చేసుకోవాలన్నారు. భారీ వర్షాలు కురిసిన వెంటనే రహదారుల వద్ద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసి ట్రాఫిక్‌ను మళ్లించాలని ఆదేశించారు. వరద నీరు తగ్గుముఖం పట్టిన వెంటనే తాత్కాలిక పునరుద్ధరణ పనులను యుద్ధప్రాతిపదికన ప్రారంభించాలని మంత్రి స్పష్టం చేశారు. రోడ్లు దెబ్బతిన్న 24 గంటల్లోపే క్షేత్రస్థాయి ఫోటోలు, జీపీఎస్ లొకేషన్ వివరాలతో కూడిన నష్ట అంచనా నివేదికలను ప్రభుత్వానికి సమర్పించాలని ఆదేశించారు. ప్రజల ప్రాణ భద్రతకు సంబంధించిన అత్యవసర పనుల్లో ఎలాంటి జాప్యం జరగకుండా జిల్లా కలెక్టర్లకు ఉన్న ప్రత్యేక అధికారాలను వాడుకుని తక్షణ పనులు చేపట్టాలని, వీటికి ఎస్‌డీఆర్ఎఫ్, ఎన్‌డీఆర్ఎఫ్ నిధులను నిబంధనల మేరకు వాడుకోవచ్చని తెలిపారు. వర్షపాతం తీవ్రతను బట్టి ఆర్ అండ్ బి శాఖలో ప్రత్యేకంగా 'కలర్ కోడ్' ఆధారిత హెచ్చరికల వ్యవస్థను అమలు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. 24 గంటల్లో 64.5 మి.మీ కంటే తక్కువ వర్షం పడితే 'గ్రీన్ అలర్ట్' గా భావించి యంత్రాలను తనిఖీ చేస్తారు. 64.5 నుంచి 115 మి.మీ వర్షం కురిస్తే 'ఎల్లో అలర్ట్' కింద అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు సున్నితమైన ప్రాంతాలను సందర్శిస్తారు. అలాగే 115 నుండి 204 మి.మీ వర్షపాతం నమోదైతే 'ఆరెంజ్ అలర్ట్' గా ప్రకటించి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేస్తారు. ఒకవేళ రాష్ట్రంలో ఎక్కడైనా 24 గంటల వ్యవధిలో 204 మిల్లీమీటర్ల కంటే ఎక్కువ వర్షపాతం నమోదైతే దానిని 'రెడ్ అలర్ట్' గా పరిగణిస్తామని మంత్రి కోమటిరెడ్డి వివరించారు. ఇటువంటి అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో అధికారులు, సిబ్బంది 24 గంటల పాటు నిద్ర లేకుండా క్షేత్రస్థాయిలోనే అందుబాటులో ఉండి సహాయక చర్యలు చేపట్టాలన్నారు. అక్కడి పరిస్థితులను ఎప్పటికప్పుడు పై అధికారులకు నివేదించాలని, ఫీల్డ్ సిబ్బందికి ఉన్నతాధికారుల ప్రత్యేక అనుమతి లేనిదే ఎలాంటి సెలవులు మంజూరు చేయబోమని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని ఆర్ అండ్ బి ప్రధాన కార్యాలయంలో ఇప్పటికే ప్రత్యేక వర్షాకాల కంట్రోల్ రూమ్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్టు మంత్రి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న జిల్లాల పరిధిలోని రహదారుల పరిస్థితిని ఎప్పటికప్పుడు ఈ కంట్రోల్ రూమ్‌కు నివేదికలు పంపడం తప్పనిసరి అని ఆదేశించారు. ఒకవేళ ఏ జిల్లా పరిధిలో ఎలాంటి నష్టం జరిగినా సరే, నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని, విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి హెచ్చరించారు.

# కోర్టుకు అల్లు అర్జున్ డుమ్మా!

**మొదటిపేజీ తరువాయి**

కాలేదు. షూటింగ్ బిజీ షెడ్యూల్ కారణంగానే ఆయన రాలేకపోయారని తెలుస్తోంది. కోర్టుకు రాకపోవడంపై సర్వత్రా ఆసక్తికర చర్చ నడుస్తోంది. ఈ కేసుకు సంబంధించి కోర్టు మొత్తం 19 మంది నిందితులకు సమన్లు జారీ చేసింది. జూన్ 22న అందరూ న్యాయమూర్తి ఎదుట హాజరుకావాలని ఆదేశించింది. కోర్టు ఆదేశాల ప్రకారం.. అల్లు అర్జున్ మినహా మిగిలిన 18 మంది నిందితులు సోమవారం ఉదయమే నాంపల్లి కోర్టుకు చేరుకున్నారు. వీరంతా న్యాయమూర్తి సమక్షంలో విచారణకు హాజరై, తమకు కేటాయించిన వ్యక్తిగత షూరిటీ బాండ్లపై సంతకాలు పూర్తి చేశారు. ప్రస్తుతం అల్లు అర్జున్ బాలీవుడ్ పరిధిలోని ముంబై నగరంలో ఒక ముఖ్యమైన సినిమా షూటింగ్‌లో ఉన్నట్లు ఆయన లీగల్ టీమ్ ప్రకటించింది. ముంబై షెడ్యూల్ ఎంతో కీలకమైనది కావడం వల్లే ఆయన హైదరాబాద్ వచ్చి విచారణకు భౌతికంగా హాజరుకాలేకపోతున్నారని జాతీయ వార్తా సంస్థ 'ఏఎన్ఐ' ప్రతినిధులకు ఆయన న్యాయవాదులు ముందుగా తెలియజేశారు. కోర్టుకు స్వయంగా రాలేని పక్షంలో.. అల్లు అర్జున్ వీడియో కాన్ఫరెన్స్ (వర్చువల్ పద్ధతి) ద్వారా నాంపల్లి కోర్టు విచారణలో పాల్గొంటారని మొదట ఆయన లీగల్ టీమ్ ప్రచారం చేసింది. ముంబై షూటింగ్ స్పాట్ నుంచే ఆయన ఆన్‌లైన్ ద్వారా హాజరవుతారని భావించారు. అయితే, సాంకేతిక లేదా ఇతర కారణాల వల్ల ఆయన వర్చువల్‌గా కూడా విచారణకు హాజరుకాలేదు. దీంతో చేసేదేం లేక అల్లు అర్జున్ తరపు న్యాయవాది కోర్టులో అధికారికంగా 'ఆబ్సెంట్ పిటిషన్' దాఖలు చేయాల్సి వచ్చింది. నిందితుడి స్థానంలో ఉన్న అల్లు అర్జున్ అటు భౌతికంగా, ఇటు వర్చువల్‌గా కూడా కోర్టు విచారణకు రాకపోవడంపై న్యాయస్థానం స్పందించింది. ఆయన వ్యక్తిగతంగా హాజరుకానందున, అందుకు గల సరైన కారణాలను వివరిస్తూ తక్షణమే ఒక సమగ్రమైన 'మెమో' దాఖలు చేయాలని అల్లు అర్జున్ న్యాయవాదులకు కోర్టు గట్టిగా సూచించింది. చట్టం ముందు అందరూ సమానమేనని స్పష్టం చేసింది. రెండు వైపులా వాదనలు విన్న అనంతరం నాంపల్లి న్యాయమూర్తి ఈ కేసు తదుపరి విచారణను వచ్చే నెల జూలై 6వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. కాగా, వచ్చే విచారణ సమయానికైనా అల్లు అర్జున్ అందుబాటులోకి వస్తారా అన్న ప్రశ్నకు ఆయన లాయర్ సమాధానమిచ్చారు. జూలై 6న జరిగే తదుపరి విచారణకు అల్లు అర్జున్ ఖచ్చితంగా వర్చువల్ పద్ధతిలో న్యాయస్థానం ముందు హాజరవుతారని న్యాయమూర్తికి హామీ ఇచ్చారు. అసలు ఈ వివాదం 2024 డిసెంబర్ నెలలో ప్రారంభమైంది. అప్పట్లో మోస్ట్ అవైటెడ్ మూవీ 'పుష్ప 2: ది రూల్' సినిమా ఘనంగా విడుదలవుతున్న సందర్భంగా హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని సంధ్య థియేటర్ ఆవరణలో భారీ ప్రీమియర్ ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ వేడుకకు హీరో అల్లు అర్జున్ వస్తున్నారనే సమాచారంతో వేలాది మంది అభిమానులు ఒక్కసారిగా థియేటర్ ముట్టడించారు. ఈ క్రమంలో జరిగిన ఘోర తొక్కిసలాటలో రేవతి అనే ఒక వివాహిత ప్రాణాలు కోల్పోగా.. ఆమె కుమారుడు శ్రీతేజ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. పలువురు అభిమానులు కూడా క్షతగాత్రులయ్యారు. ఈ ప్రమాదంపై బాధితురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు చిక్కడపల్లి పోలీసులు క్రిమినల్ కేసు నమోదు చేశారు. ఈ కేసులో సంధ్య థియేటర్ యాజమాన్యం మరియు నిర్వాహకులను ఏ1 నుంచి ఏ10 నిందితులుగా చేర్చారు. తొక్కిసలాట జరగడానికి నటుడి రాక, భద్రతా లోపాలే కారణమంటూ అల్లు అర్జున్‌ను ఈ కేసులో ఏ11 నిందితుడిగా పోలీసులు చేర్చడం అప్పట్లో టాలీవుడ్‌లో పెను సంచలనం సృష్టించింది. ఈ కేసు దర్యాప్తులో భాగంగా గతంలో చిక్కడపల్లి పోలీసులు అల్లు అర్జున్‌ను అరెస్ట్ చేయగా, ఆయన ఒక రాత్రి మొత్తం జైలు గదిలో గడపాల్సి వచ్చింది. ఆ మరుసటి రోజు ఉదయమే ఆయనకు కోర్టు నుంచి బెయిల్ లభించింది.

# ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు రక్షణ శాఖ మద్దతు

**మొదటిపేజీ తరువాయి**

కోరారు. దీనితో పాటు భారీ ఎత్తున వస్తు రవాణాకు అనుకూలంగా ఉండే 'కార్గో' సేవలను, విమానాల మరమ్మతుల కోసం 'ఎంఆర్‌వో' వసతులను మరియు అధునాతన హ్యాంగర్ సౌకర్యాలను పెద్ద ఎత్తున ఏర్పాటు చేసేందుకు కేంద్రం నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఇటీవల మధ్య ఆసియా దేశాలలో చోటుచేసుకుంటున్న భౌగోళిక, రాజకీయ పరిణామాల నేపథ్యంలో ప్రపంచ ప్రసిద్ధిగాంచిన అంతర్జాతీయ ఎయిర్‌లైన్స్ సంస్థలు తమ విమానాల భద్రత, నిర్వహణ కొరకు సురక్షితమైన ప్రదేశాలలో కొత్త హ్యాంగర్స్‌ను ఏర్పాటు చేసుకోవడానికి ఆసక్తి చూపుతున్నాయని రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా గుర్తుచేశారు. భౌగోళికంగా మరియు వాతావరణ పరంగా అంతర్జాతీయ హ్యాంగర్ల ఏర్పాటుకు ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ అత్యంత సురక్షితమైన, అనుకూలమైన ప్రదేశమని.. కాబట్టి కేంద్ర రక్షణ శాఖ ఆ దిశగా వ్యూహాత్మకంగా అడుగులు వేయాలని కోరారు. రక్షణ రంగ పరిశోధన సంస్థలైన డీఆర్‌డీవో, డీఆర్‌డీఎల్ తమ అత్యంత కీలకమైన సరికొత్త ప్రాజెక్ట్ ఏర్పాటు కోసం మహబూబ్‌నగర్ జిల్లాలోని దేవరకద్ర సమీప ప్రాంతాన్ని ఎంపిక చేసుకున్న విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ ప్రాజెక్ట్ వల్ల ఉమ్మడి పాలమూరు జిల్లా ఎంతో అభివృద్ధి చెందుతుందని, యువతకు ఉపాధి లభిస్తుందని వివరించారు. కాబట్టి ఈ డీఆర్డీవో ప్రాజెక్టుకు రక్షణ శాఖ తరపున త్వరితగతిన తుది అనుమతులు మంజూరు చేసి పనులు ప్రారంభమయ్యేలా చూడాలని రాజ్‌నాథ్ సింగ్‌ను కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభ్యర్థనలపై కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఎంతో సానుకూలంగా స్పందించారు. తెలంగాణ అభివృద్ధికి, దేశ భద్రతకు ముడిపడి ఉన్న ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ విస్తరణ పనులను తాము వేగవంతం చేస్తామని హామీ ఇచ్చారు. పౌర విమానయాన రంగానికి, కార్గో సేవల విస్తరణకు అవసరమైన సాంకేతిక నివేదికలను సిద్ధం చేయాల్సిందిగా తన శాఖ అధికారులను ఆదేశిస్తామన్నారు. అలాగే దేవరకద్ర డీఆర్డీవో ప్రాజెక్టు అనుమతుల ఫైలును కూడా త్వరలోనే పరిశీలిస్తామని సీఎంకు స్పష్టం చేశారు. దేశ రాజధానిలో జరిగిన ఈ అత్యంత ప్రాధాన్యత కలిగిన దౌత్య సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన పలువురు ఐఏఎస్ అధికారులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ (ఆర్ అండ్ బీ) ప్రత్యేక కార్యదర్శి వికాస్‌రాజ్, ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ కే.ఎస్. శ్రీనివాసరాజు, ముఖ్యమంత్రి కార్యదర్శి మాణిక్ రాజ్, స్పెషల్ సెక్రటరీ కోఆర్డినేషన్ అద్వైత్ కుమార్ సింగ్‌లు హాజరై ప్రాజెక్టులకు సంబంధించిన మ్యాపులు, సాంకేతిక వివరాలను కేంద్ర రక్షణ శాఖ అధికారులకు వివరించారు.

# మహారాష్ట్ర రాజకీయాల్లో పెను భూకంపం


**మొదటిపేజీ తరువాయి**

వెల్లడించారు. ఈ పరిణామంతో లోక్‌సభలో తమ పార్టీ ఎంపీల సంఖ్య ప్రస్తుతమున్న 7 నుండి ఒక్కసారిగా 13కి పెరుగుతుందని వివరించారు. హిందూ హృదయ సామ్రాట్ బాలాసాహెబ్ ఠాక్రే ఆశయాలు, సిద్ధాంతాలను నిజాయితీగా అనుసరించే వారంతా తమ వైపు వస్తున్నారని, శివసేనను మరింత బలోపేతం చేసేందుకు వారికి ఘన స్వాగతం పలుకుతున్నామని సర్నాయిక్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉద్ధవ్ ఠాక్రే వర్గంపై మంత్రి ప్రతాప్ సర్నాయిక్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. శివసేనలో అసంతృప్తులను చేర్చుకునే 'ఆపరేషన్ టైగర్' అనేది కేవలం ఈరోజుతో ముగిసేది కాదని, ఇది ఏడాది పొడవునా 365 రోజులూ నిరంతరాయంగా కొనసాగుతూనే ఉంటుందని హెచ్చరించారు. ఈ సందర్భంగా యూబీటీ పార్టీ రాజ్యసభ ఎంపీ సంజయ్ రౌత్‌కు ఆయన వ్యంగ్యంగా కృతజ్ఞతలు తెలిపారు. గతంలో సంజయ్ రౌత్ ప్రవర్తన వల్లే విసిగిపోయి మొదట ఎమ్మెల్యేలంతా షిండే వైపు వచ్చారని, ఇప్పుడు ఆయన పుణ్యమా అంటూ ఆరుగురు లోక్‌సభ ఎంపీలు కూడా తమ పార్టీలోకి వస్తున్నారని ఎద్దేవా చేశారు. యూబీటీ ఎంపీల పార్టీ మార్పు వ్యవహారంపై శివసేన ఎంఎల్‌సీ డాక్టర్ మనీషా కయాండే ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పార్టీ మారుతున్న ఆరుగురిని తిరుగుబాటుదారులు అనడం కంటే, వారు తమ సొంత గూటికి తిరిగి వస్తున్న 'శివ సైనికులు' అని పిలవడం కరెక్ట్ అని అభిప్రాయపడ్డారు. ఈ విలీనానికి సంబంధించి తనకు ఇంకా పూర్తి స్థాయి అధికారిక సమాచారం అందనప్పటికీ, ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే ఈ నిర్ణయాన్ని మనస్ఫూర్తిగా స్వాగతించారని చెప్పారు. ఇప్పటికే ఎంపీ ఓమ్రాజే నింబాల్కర్ వంటి నేతలు తమ నియోజకవర్గాల ప్రజల అభిప్రాయాలను తెలుసుకుని ఈ అడుగు వేశారని, సోమవారం సాయంత్రానికి రాష్ట్ర ప్రజలకు ఒక మంచి శుభవార్త అందుతుందని ఆమె ధీమా వ్యక్తం చేశారు. మరోవైపు, శివసేన (యూబీటీ) కు గుడ్‌బై చెబుతున్నట్లు తిరుగుబాటు ఎంపీ నగేశ్ పాటిల్ అష్టికర్ అధికారికంగా ప్రకటించారు. ఈ మేరకు ఆయన ఫేస్‌బుక్ వేదికగా ఒక వీడియో సందేశాన్ని విడుదల చేశారు. తనకు పార్టీ అధినేత ఉద్ధవ్ ఠాక్రేపై ఎలాంటి వ్యక్తిగత అసంతృప్తి లేదన్నారు. అయితే, ఇటీవల ఢిల్లీలో జరిగిన పార్లమెంటరీ పార్టీ సమావేశానికి కొన్ని అనివార్య కారణాల వల్ల తాను హాజరుకాలేకపోయానని, దానికి పార్టీ పెద్దలు తనపై తీవ్ర అవిశ్వాసం ప్రదర్శించారని ఆవేదన వ్యక్తం చేశారు. తమపై కఠినమైన, అవమానకరమైన భాషను వాడటం వల్లే తీవ్ర మనస్థాపానికి గురై పార్టీని వీడాల్సి వస్తోందని స్పష్టం చేశారు. కాగా, ఇదే సమయంలో పార్టీ వ్యతిరేక పనులకు పాల్పడుతున్నారంటూ నగేశ్ పాటిల్ కుమారుడు కృష్ణ అష్టికర్‌ను యూబీటీ యాజమాన్యం పార్టీ నుండి బహిష్కరించడం గమనార్హం.

# బ్రిటన్ ప్రధాని రాజీనామా..

**మొదటిపేజీ తరువాయి**

వివరించారు. 10 డౌనింగ్ స్ట్రీట్ (ప్రధాని అధికార నివాసం) వెలుపల కీర్ స్టార్మర్ భావోద్వేగంగా మాట్లాడారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో లేబర్ పార్టీని విజయతీరాలకు చేర్చడానికి, ముందుకు నడిపించడానికి ఎవరు అత్యంత సమర్థులనే ప్రశ్న ఇప్పుడు అందరి మదిలో మెదులుతోందన్నారు. "నేను పార్టీని నడిపించడానికి సరైన వ్యక్తినా కాదా అని నా సహచరులు ప్రశ్నించారు. వారి మనోభావాలను నేను విన్నాను, గౌరవపూర్వకంగా అంగీకరిస్తున్నాను. అందుకే తప్పుకుంటున్నాను. నా దేశంపై ఉన్న ప్రేమతోనే ఈ నిర్ణయం తీసుకున్నాను" అని స్టార్మర్ స్పష్టం చేశారు. ఈ రాజీనామా నిర్ణయాన్ని అధికారికంగా ప్రకటించడానికి ముందే తాను ఉదయం బ్రిటన్ రాజు చార్లెస్‌తో మాట్లాడి వివరాలను తెలియజేసినట్లు ప్రధాని స్టార్మర్ చెప్పారు. సెప్టెంబరులో జరగబోయే పార్లమెంటు తదుపరి సమావేశాల కంటే ముందే కొత్త నాయకుడిని ఎన్నుకునే ప్రక్రియను పూర్తి చేయాలని లేబర్ నేషనల్ ఎగ్జిక్యూటివ్‌ను కోరతానని వెల్లడించారు. రాబోయే ఎన్నికల్లో లేబర్ పార్టీకి రెండోసారి స్పష్టమైన అధికారం దక్కేలా చూసేందుకు, తన తర్వాత రాబోయే కొత్త నాయకుడికి పూర్తి మద్దతు ఇస్తానని, మరింత బలమైన బ్రిటన్‌ను వారికి వారసత్వంగా అందిస్తున్నానని ఆయన ధీమా వ్యక్తం చేశారు. లేబర్ పార్టీ కొత్త రథసారథిని ఎంపిక చేసేందుకు వీలుగా తక్షణమే చర్యలు ప్రారంభించాలని పార్టీ నేషనల్ ఎగ్జిక్యూటివ్ కమిటీని స్టార్మర్ కోరారు. ఈ ప్రతిపాదన ప్రకారం, బ్రిటన్ కొత్త ప్రధాని ఎంపిక కోసం జూలై 9వ తేదీన అధికారికంగా నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానుంది. అనంతరం జూలై 16 నాటికి నామినేషన్ల గడువు ముగుస్తుంది. ఒకవేళ ఏకాభిప్రాయం కుదిరితే జూలైలోనే కొత్త ప్రధాని పీఠంపై కూర్చుంటారు. లేనిపక్షంలో అంతర్గత ఎన్నికల ద్వారా సెప్టెంబరు నాటికి సరికొత్త నాయకుడు బ్రిటన్ బాధ్యతలు చేపడతారు. కీర్ స్టార్మర్ వైదొలగడంతో లేబర్ పార్టీ తదుపరి అగ్రనేతగా, బ్రిటన్ కాబోయే ప్రధానిగా అండీ బర్న్‌హామ్ పేరు లండన్ రాజకీయాల్లో బలంగా వినిపిస్తోంది. ప్రస్తుత సమాచారం ప్రకారం ఆయనకు మద్దతు ఇస్తున్న అధికార పక్ష ఎంపీల సంఖ్య ఇప్పటికే 300 మార్కుకు చేరుకుంది. ఇదిలా ఉండగా, బ్రిటన్ రాజకీయాల్లో గత దాదాపు పదేళ్ల కాలంలోనే ఆరుగురు ప్రధానులు మారిపోవడం గమనార్హం. ఇప్పుడు స్టార్మర్ రాజీనామాతో బ్రిటన్ దేశం మరో పదేళ్లలోనే ఏడో ప్రధానికి స్వాగతం పలికేందుకు సిద్ధమవుతోంది. 2024లో కీర్ స్టార్మర్ భారీ మెజారిటీతో బ్రిటన్ ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. అయితే ఇటీవల కాలంలో లేబర్ పార్టీకి ప్రజాదరణ క్రమంగా తగ్గుతున్నట్లు పలు సర్వేలు వెల్లడించాయి. ముఖ్యంగా నైజెల్ ఫరాజ్ నేతృత్వంలోని 'రిఫార్మ్ యూకే' పార్టీకి ప్రజల్లో ఆదరణ విపరీతంగా పెరుగుతోంది. దీనికి తోడు ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో లేబర్ పార్టీ ఘోరమైన ఫలితాలను మూటగట్టుకుంది. అదే సమయంలో మేకర్‌ఫీల్డ్ పార్లమెంటరీ ఉపఎన్నికలో బర్న్‌హామ్ ఘన విజయం సాధించడంతో, స్టార్మర్ నాయకత్వ సామర్థ్యంపై సొంత పార్టీలోనే అనుమానాలు, అసమ్మతి మొదలయ్యాయి. రాజకీయ వైఫల్యాలతో పాటు స్టార్మర్ తీసుకున్న కొన్ని వివాదాస్పద నిర్ణయాలు కూడా ఆయన పదవిని ముంచాయి. ముఖ్యంగా తీవ్రమైన 'ఎప్‌స్టీన్ కుంభకోణం' ఆరోపణలు ఎదుర్కొంటున్న తన అత్యంత సన్నిహిత స్నేహితుడు పీటర్ మాండెల్సన్‌ను అమెరికాకు యూకే రాయబారిగా నియమించాలని స్టార్మర్ మొండిగా నిర్ణయించారు. ఈ నిర్ణయంపై బ్రిటన్ వ్యాప్తంగా తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ఈ పరిణామాల నేపథ్యంలో స్టార్మర్ వెంటనే ప్రధాని పదవి నుంచి తప్పుకోవాలంటూ క్యాబినెట్ మంత్రులతో పాటు సొంత పార్టీ ఎంపీల నుంచి ఆయనపై ఊహించని స్థాయిలో ఒత్తిడి పెరిగింది. సొంత పార్టీ నుంచే తిరుగుబాటు మొదలైనప్పటికీ.. మొదట్లో కీర్ స్టార్మర్ ఎక్కడా తగ్గేదే లేదన్నట్లు వ్యవహరించారు. తాను ప్రధాని పదవి నుంచి వైదొలిగే ప్రసక్తే లేదని, ఏ శక్తులకైనా ఎదురొడ్డి పోరాడుతానని ప్రకటించారు. కానీ రోజురోజుకూ మంత్రులు, ఎంపీల మద్దతు తగ్గిపోవడం, తిరుగుబాటు తీవ్రరూపం దాల్చడంతో ఆయనకు వేరే దారి లేకుండా పోయింది. చివరకు ప్రస్తుత రాజకీయ వాస్తవాలను, సంక్షోభాన్ని అంగీకరిస్తూ ప్రధాని పదవికి రాజీనామా చేయక తప్పలేదు. దీంతో బ్రిటన్ రాజకీయాల్లో కొన్ని రోజులుగా నడుస్తున్న ఉత్కంఠకు తెరపడింది.



# జైపూర్ సిటీ.. చూసొద్దాం రండి

సెలవులు వస్తే చాలూ చాలామందికి ఎక్కడికైనా విహారయాత్రకు వెళ్లాలని ఉంటుంది. కానీ చాలా మంది ఏ ప్లేస్‌కి వెళ్తే బాగుంటుందని ఆలోచిస్తుంటారు. అలాంటి వారు ఈ బ్యూటిఫుల్ ప్లేస్ గురించి తెలుసుకోవాల్సిందే. దసరా సెలవులకు మీరు మీ ఫ్యామిలీ, ఫ్రెండ్స్‌తో కలిసి అందాల పింక్ సిటీ చూడటానికి వెళ్లండి. అది ఓ చారిత్రక కోట. ఇంతకీ అదెక్కడుంది అనుకుంటున్నారా? రాజస్థాన్‌లోని జైపూర్ నగరం చాలా అందమైన ప్రదేశం. దీనిని పింక్ సిటీ అని కూడా అంటారు. ప్రతి సంవత్సరం లక్షలాది మంది పర్యాటకులు ఇక్కడికి వస్తుంటారు. ఇక్కడ అనేక అందమైన ప్రదేశాలు ఉన్నాయి. ఇక్కడ భారతీయ సంస్కృతి, చరిత్ర సంగ్రహావలోకనం పొందవచ్చు. జైపూర్‌లో ఉన్న హవా మహల్, జల్ మహల్ గురించి చాలా సార్లు విని ఉంటారు. అయితే ఇక్కడ చాలా అందమైన ప్రదేశాలు కూడా ఉన్నాయి. ఇక్కడ పర్యటన కోసం ఒంటరిగా లేదా కుటుంబం లేదా స్నేహితులతో సందర్శించడానికి వెళ్లవచ్చు. ఇక్కడ అనేక చారిత్రక అందమైన ప్రదేశాలు ఉన్నాయి.

**జైపూర్ సిటీ ప్యాలెస్...**

జైపూర్‌లోని సిటీ ప్యాలెస్ రాజస్థాన్‌లోని అత్యంత ప్రసిద్ధ పర్యాటక ప్రదేశాలలో ఒకటి. ఈ ప్యాలెస్‌ను జైపూర్ వ్యవస్థాపకుడు మహారాజా సవాయి జై సింగ్ నిర్మించారు. ఇది చాలా అందమైన ప్యాలెస్. మొఘల్, రాజ్‌పుత్ నిర్మాణ శైలికి సంబంధించిన అందమైన మిశ్రమం. సిటీ ప్యాలెస్ కాంప్లెక్స్‌లో ముబారక్ మహల్, క్వీన్స్ ప్యాలెస్ కూడా ఉన్నాయి. ముబారక్ మహల్‌లో ఇప్పుడు మహారాజా సవాయి మాన్ సింగ్ II మ్యూజియం కూడా ఉంది. ఇక్కడ రాజ వేషధారణతో పాటు సున్నితమైన పష్మినా, శాలువాలు, బనారస్ పట్టు చీరలు, మరెన్నో వస్తువులు ఉన్నాయి.

**గల్తాజీ ఆలయం...**

జైపూర్‌లోని గల్తాజీ ఆలయాన్ని కూడా సందర్శించవచ్చు. ఆరావళి కొండల మధ్య ఉద్యానవనాలకు ఆవల ఉన్న ఈ ప్రకృతి దృశ్యం ఆలయాలు, పవిత్రమైన చెరువులు, మంటపాలు, చుట్టూ పచ్చదనంతో మనసును ఆకట్టుకుంటుంది. గల్తాజీ దేవాలయం జైపూర్ నుండి 10 కి.మీ దూరంలో ఉంది. ఆలయ సముదాయంలో సహజమైన మంచినీటి బుగ్గ, 7 పవిత్రమైన చెరువులు ఉన్నాయి. గ్రాండ్ టెంపుల్ పింక్ ఇసుకరాయితో నిర్మించబడింది. జైపూర్ వెళుతున్నట్లయితే ఇక్కడ కూడా సందర్శించడం మరచిపోకండి.

**అమెర్ కోట...**


అమెర్ కోట లేదా అంబర్ కోట అని కూడా పిలువబడే అంబర్ ప్యాలెస్ జైపూర్‌లో ఉంది. ఇది జైపూర్‌లో చాలా పెద్ద కోట. చాలా ఆకర్షణీయమైన పర్యాటక ప్రదేశం. ఈ కోట జైపూర్ నుండి 11 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈ కోట పసుపు, గులాబీ రంగులతో నిర్మించబడింది. రాజ్‌పుత్, మొఘల్ వాస్తుశిల్పానికి ఉదాహరణగా ఈ కోట నిలుస్తుంది. ఇందులో దివాన్‌ఎఆమ్ లేదా, దివాన్‌ఎఖాస్, షీష్ మహల్ లేదా జై మందిర్, సుఖ్ నివాస్ ఉన్నాయి. ఈ రాజభవనం రాజ్‌పుత్ మహారాజులతో పాటు వారి కుటుంబాలు నివసించేవి.


**పన్నా మీనా కుండ్...**

పన్నా మీనా చెరువును పన్నా మీనా మెట్ల బావి అని కూడా అంటారు. ఇది చారిత్రక పురాతన మెట్ల బావి. పూర్వ కాలంలో ఇది నీటికి ముఖ్యమైన వనరు. చాలా మంది ప్రజలు దీనిని ఉపయోగించారు. అయితే నేడు ఇది పర్యాటక కేంద్రంగా మారింది. ప్రజలు తరచుగా ఇక్కడకు వెళ్లి ఫోటోలు క్లిక్ చేయడానికి ఇష్టపడతారు.

**కనక బృందావనం...**

కనక బృందావనం జైపూర్‌లో ఉన్న ఒక తోట. ఇది ఆరావళి కొండల చుట్టూ ఉన్న లోయలో అమెర్ కోటకు వెళ్లే మార్గంలో నహర్‌ఘర్ కోట క్రింద ఉంది. ఈ ప్రదేశం జైపూర్ నుండి దాదాపు 8 కి.మీ.ల దూరంలో ఉంది. ఈ కాంప్లెక్స్‌లో అనేక పచ్చటి ప్రదేశాలు ఉన్నాయి. అమెర్ ఫోర్ట్, నహర్‌ఘర్ కోట, జైగర్ కోట కూడా ఉన్నాయి. ఈ ఉద్యానవనం సుమారు 280 సంవత్సరాల క్రితం జైపూర్‌కు చెందిన కచ్‌వాహ రాజ్‌పుత్ మహారాజా సవాయి జై సింగ్ నిర్మించారు. దీనికి మహారాజ్ రాణి కనకడే పేరు పెట్టారు.







# సీమ చింతకాయతో డయాబెటీస్ కంట్రోల్


సీమ చింతకాయల గురించి గ్రామాల్లో ఉండే వారికి ఖచ్చితంగా తెలిసే ఉంటుంది. సిటీల్లో ఉండే వారికి మాత్రం వీటి గురించి పెద్దగా తెలీదు. ఇవి గ్రామాల్లో ఎక్కువగా కనిపిస్తాయి. గ్రామాల్లో పెరిగిన వారికి వీటి గురించి.. ఇందులో ఉండే పోషకాల గురించి బాగా తెలిసే ఉంటుంది. ఈ చింతకాయలు దొరకడం చాలా కష్టం. కేవలం సీజన్ల వారీ గానే లభిస్తాయి. ఈ చింతకాయలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. ఇవి ఆరోగ్యానికి అమృతంతో సమానమని చెప్పొచ్చు. వీటిని పలు రకాల పేర్లు పెట్టి పిలుస్తూ ఉంటారు. ఈ చింతకాయల్లో మెగ్నీషియం, కార్బోహైడ్రేట్స్, విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు, ప్రోటీన్లు, ఐరన్, పొటాషియం లభిస్తాయి. ఈ చింతకాయలు తియ్యగా, పుల్లగా ఉంటాయి. నోట్లే వేసుకున్న వెంటనే కరిగిపోతుంది. డయాబెటీస్ పేషెంట్లు.. వీటిని తినడం ఎంతో మంచిది. వీటిల్లో యాంటీ డయాబెటిక్ గుణాలు ఉంటాయి. కాబట్టి షుగర్ వ్యాధితో బాధ పడేవారు వీటిని తింటే షుగర్ కంట్రోల్ అవుతుంది. ఈ చెట్టు ఆకుల రసాన్ని తీసుకున్నా కూడా మధుమేహాన్ని కంట్రోల్ చేయవచ్చని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. సీమ చింతకాయలు తిన్నా, ఈ చెట్టు ఆకుల రసాన్ని తాగినా.. రక్తంలో షుగర్ లెవల్స్ కంట్రోల్ అవుతాయి. అదే విధంగా ఈ చింతకాయలు తింటే.. చెడు కొలెస్ట్రాల్, గుండె పోటు, స్ట్రోక్ వంటి సమస్యలు తగ్గుతాయి. రోగ నిరోధక శక్తి కూడా బలపడుతుంది. రక్తహీనత సమస్య తగ్గుతుంది. పొట్ట ఆరోగ్యాన్ని కూడా పెంచుతుంది. కాబట్టి ఇవి కనిపిస్తే ఖచ్చితంగా తినండి.





# పెయిన్ కిల్లర్స్ అతిగా వాడితే.. కొత్త నొప్పులే..

మనలో చాలా మంది కాస్త తలనొప్పి అనిపించగానే పెయిన్ కిల్లర్స్ వాడుతుంటారు. బాడీ పెయిన్స్‌కి కూడా ట్యాబ్లెట్స్‌ను వేసుకుంటారు. అయితే పెయిన్ కిలర్స్‌ని వాడడం వల్ల వెంటనే నొప్పి తగ్గిన భావన కలిగినా దీర్ఘకాలంలో మాత్రం తీవ్ర సమస్యలు ఎదురవుతాయని నిపుణులు చెబుతున్నారు. మరీ ముఖ్యంగా వైద్యులను సంప్రదించకుండా పెయిన్ కిల్లర్స్‌ని వాడడం వల్ల ఎన్నో సమస్యలకు దారి తీస్తుందని అంటున్నారు.



**పెయిన్ కిల్లర్స్ వల్ల కలిగే దుష్ప్రభావాలు...**

* పెయిన్ కిల్లర్స్ వేసుకోగానే నొప్పి తగ్గిన భావన కలిగినా తర్వాత తలనొప్పి పెరిగే అవకాశం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. పెయిన్ కిల్లర్స్‌ను అతిగా వాడే వారిలో తరచూ తలనొప్పి వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని నిపుణులు చెబుతున్నారు.

* కొన్ని రకాల పెయిన్ కిల్లర్స్‌ని ఎక్కువ రోజులు వాడడం వల్ల కడుపు సంబంధిత సమస్యలు వస్తాయని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా కడుపులో చికాకు, అల్సర్, అంతర్గత రక్తస్రావం వంటి సమస్యలు వస్తాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

* ఇక ట్యాబ్లెట్స్‌ను ఎక్కువగా వేసుకోవడం వల్ల ఎదురయ్యే ప్రధాన సమస్యల్లో కిడ్నీలు దెబ్బతినడం ఒకటి. పెయిన్ కిల్లర్స్ అధికంగా వాడే వారిలో మూత్రపిండాల వైఫల్యం ఎక్కువగా కనిపిస్తుందని నిపుణులు చెబుతున్నారు.

* పెయిన్ కిల్లర్స్‌ను అధికంగా వాడడం వల్ల కాలేయంపై ప్రతికూల ప్రభావం పడుతుందని నిపుణులు చెబుతున్నారు. ఎసిటమైనోఫెన్ ట్యాబ్లెట్స్‌ను ఎక్కువగా తీసుకోవడం వల్ల కాలేయ వైఫల్యానికి దారి తీస్తుంది. పెయిల్ కిల్లర్స్‌ను వాడే సమయంలో కొన్ని పద్ధతులు పాటించాలని నిపుణులు చెబుతున్నారు. పెయిన్ కిల్లర్స్‌ను తీసుకునే సమయంలో ఒక ట్యాబ్లెట్‌కి మరో ట్యాబ్లెట్‌కి మధ్య కనీసం 5 గంటలు ఉండేలా చూసుకోవాలి. అలాగే వారానికి 23 సార్లు కంటే ఎక్కువ తీసుకోకూడదు. నొప్పి చాలా కాలం పాటు కొనసాగితే లేదా తరచుగా సంభవిస్తే వైద్యుడిని సంప్రదించాలి. మరీ ముఖ్యంగా వైద్యులను సంప్రదించకుండా పెయిన్ కిల్లర్స్‌ని వాడడం వల్ల ఎన్నో సమస్యలకు దారి తీస్తుందని అంటున్నారు. పైన తెలిపిన వివరాలు ఇంటర్నెట్‌లో అందుబాటులో ఉన్న సమాచారం మేరకు అందించినవి మాత్రమే. ఆరోగ్యానికి సంబంధించి వైద్యుల సూచనలు పాటించడమే ఉత్తమం.



## రూ.3 కోట్ల లాటరీ గెలుచుకున్న క్యాబ్ డ్రైవర్..



- పంజాబ్ లాటరీలో హిమాచల్ ప్రదేశ్ క్యాబ్ డ్రైవర్‌కు బంపర్ ప్రైజ్
- రూ.3 కోట్ల జాక్‌పాట్ గెలుచుకున్న కల్యాణ్ చంద్
- ప్రయాణికుడిని దించేందుకు వెళ్లి లాటరీ టికెట్ కొనుగోలు
- వచ్చిన డబ్బుతో పాత ఇంటిని తిరిగి నిర్మిస్తానన్న విజేత

**అఖండ సూర్య :**

హిమాచల్ ప్రదేశ్‌కు చెందిన ఒక సాధారణ ట్యాక్సీ డ్రైవర్ రాత్రికి రాత్రే కోటీశ్వరుడిగా మారారు. పంజాబ్ ప్రభుత్వం నిర్వహించిన 'డియర్ సమ్మర్ స్పెషల్ బంపర్ లాటరీ'లో ఆయన ఏకంగా రూ.3 కోట్ల ప్రథమ బహుమతిని గెలుచుకున్నారు. కాంగ్రా జిల్లా సతానా గ్రామానికి చెందిన కల్యాణ్ చంద్ ఈ జాక్‌పాట్ విజేతగా నిలిచారు.వివరాల్లోకి వెళితే.. కల్యాణ్ చంద్ ఇటీవలే ఒక ప్రయాణికుడిని పంజాబ్‌లోని బటిండాలో దింపేందుకు తన ట్యాక్సీలో వెళ్లారు. అక్కడ ఒకే నంబర్‌తో ఉన్న రెండు లాటరీ టికెట్లను ఒక్కోటి రూ.500 చొప్పున కొనుగోలు చేశారు. తాజాగా లాటరీ ఫలితాలు విడుదల కాగా, ఆయన కొనుగోలు చేసిన ఒక టికెట్‌ను మొదటి బహుమతి వరించింది. దీంతో ఆయన సంతోషానికి అవధుల్లేకుండా పోయాయి. ప్రస్తుతం నెలకు రూ.15,000 నుంచి రూ.16,000 వరకు సంపాదిస్తున్న తనకు ఇంత పెద్ద మొత్తంలో నగదు బహుమతి రావడంపై కల్యాణ్ చంద్ హర్షం వ్యక్తం చేశారు. "ఈ డబ్బుతో నా తండ్రి చిరకాల కలను నెరవేరుస్తాను. మా గ్రామంలో ఉన్న రెండు గదుల ఇంటిని పునర్నిర్మిస్తాను" అని ఆయన తెలిపారు. లాటరీ గెలిచిన విషయాన్ని నిర్ధారించుకున్న అనంతరం, కల్యాణ్ తన కుటుంబ సభ్యులతో కలిసి బటిండా వెళ్లి బహుమతి మొత్తం కోసం దరఖాస్తు చేసుకున్నారు.

## రైళ్లలో భిక్షాటన, అనధికారిక వ్యాపారాలపై కేంద్రం ఉక్కుపాదం..



- జన్ విశ్వాస్ చట్టం-2026 కింద రైల్వే నిబంధనలు మరింత కఠినతరం
- రైళ్లలో పొగతాగితే అప్పటికప్పుడే రూ.2,000 జరిమానా
- అనధికారిక వ్యాపారాలు, భిక్షాటనపై పూర్తి నిషేధం
- జరిమానా కట్టకపోతే 3 నెలల జైలు లేదా రూ.5,000 ఫైన్
- నిబంధనలు ఉల్లంఘిస్తే రైలు నుంచి దించివేసేలా అధికారులకు పవర్స్

**అఖండ సూర్య :**

రైలు ప్రయాణికుల భద్రతను పెంపొందించడంతో పాటు ప్రయాణాన్ని మరింత ఆహ్లాదకరంగా మార్చేందుకు భారతీయ రైల్వే సంచలన నిర్ణయం తీసుకుంది. 'జన్ విశ్వాస్ (నిబంధనల సవరణ) చట్టం 2026' కింద రైల్వే నిబంధనలను మరింత కఠినతరం చేస్తూ కేంద్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. దీని ప్రకారం రైళ్లలో లేదా రైల్వే ప్రాంగణాలలో ధూమపానం, అనధికారికంగా వస్తువులు విక్రయించడం, భిక్షాటన చేయడాన్ని తీవ్రమైన నేరాలుగా పరిగణిస్తూ అప్పటికప్పుడు రూ.2,000 జరిమానా విధించనున్నారు. ఈ నెల 19న అధికారికంగా విడుదలైన ఈ నిబంధనలు తక్షణమే అమలులోకి వచ్చాయని రైల్వే శాఖ స్పష్టం చేసింది.

ఈ నూతన చట్టం ప్రకారం.. రైల్వే చట్టం 1989లోని సెక్షన్ 167 కింద గతంలో ధూమపానానికి ఉన్న రూ.100 స్వల్ప జరిమానాను ఇప్పుడు ఏకంగా రూ.2,000కు పెంచారు. అంతేకాకుండా స్మోకింగ్ చేస్తూ దొరికితే వెంటనే సదరు ప్రయాణికుడి పాస్ లేదా టికెట్‌ను రద్దు చేసి, తదుపరి స్టేషన్‌లో రైలు నుంచి కిందకు దించేసే అధికారాన్ని రైల్వే సిబ్బందికి కల్పించారు. ఒకవేళ అక్కడికక్కడే జరిమానా చెల్లించకపోతే కోర్టు ముందు హాజరుపరుస్తారు, అక్కడ నేరం రుజువైతే గరిష్టంగా రూ.5,000 వరకు జరిమానా పడే అవకాశం ఉంది. రైళ్లలో సంభవించే అగ్ని ప్రమాదాలను నివారించేందుకు, తోటి ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా చూసేందుకే ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు బోర్డు తెలిపింది.

మరోవైపు సెక్షన్ 144 కింద రైల్వే లైసెన్స్ లేకుండా రైళ్లలో తిరుగుతూ వ్యాపారం చేసే హ్యాకర్లు, భిక్షాటన చేసే వారిపై పూర్తి నిషేధం విధించారు. వీరికి కూడా రూ.2,000 జరిమానా విధిస్తారు. ఒకవేళ వీరు జరిమానా కట్టని పక్షంలో కోర్టు ద్వారా 3 నెలల వరకు జైలు శిక్ష, రూ.5,000 ఫైన్ లేదా ఈ రెండూ విధించేలా చట్టాన్ని సవరించారు. ఇక పదే పదే (నాలుగోసారి లేదా అంతకంటే ఎక్కువ) ఈ నిబంధనలు ఉల్లంఘిస్తూ దొరికిపోతే కనీసం 3 నెలల నుంచి గరిష్టంగా ఏడాది పాటు జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుంది. గతంలో లాగా కేవలం క్రిమినల్ ప్రాసిక్యూషన్ కోసం వేచి చూడకుండా, సివిల్, అడ్మినిస్ట్రేటివ్ చర్యల ద్వారా వేగంగా జరిమానాలు వసూలు చేసేలా రైల్వే అధికారులకు పూర్తి అధికారాలు ఇవ్వడంతో రాబోయే రోజుల్లో తనిఖీలు మరింత ముమ్మరం కానున్నాయి.

# ఉద్ధవ్ థాకరేకు బిగ్ షాక్..
# షిండే గూటికి నేడు ఆరుగురు శివసేన ఎంపీలు!

- ఫిరాయింపుల నిరోధక చట్టం నుంచి తప్పించుకునే వ్యూహం
- నిధుల కొరత, నేతల విమర్శల వల్లే పార్టీ వీడుతున్నట్లు ప్రకటన
- నేటి మధ్యాహ్నం 3 గంటలకు ఢిల్లీలో షిండే వర్గంలో విలీనం
- ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో ఉద్ధవ్ థాకరే అత్యవసర సమావేశం

**అఖండ సూర్య :**

మహారాష్ట్ర రాజకీయాల్లో మరోసారి పెను సంచలనం నమోదైంది. మాజీ ముఖ్యమంత్రి ఉద్ధవ్ థాకరే నేతృత్వంలోని శివసేన (యూబీటీ) పార్టీకి లోక్‌సభలో కోలుకోలేని దెబ్బ తగిలింది. ఆ పార్టీకి ఉన్న మొత్తం 9 మంది ఎంపీలలో ఆరుగురు సభ్యులు అధికార ఏకనాథ్ షిండే నేతృత్వంలోని శివసేన వర్గంలో చేరడానికి సిద్ధమయ్యారు.

'ఆపరేషన్ టైగర్' పేరుతో కొన్ని రోజులుగా సాగుతున్న ఈ రహస్య రాజకీయ వ్యూహం నేటి (జూన్ 22) మధ్యాహ్నం 3 గంటలకు ఢిల్లీలో అధికారికంగా కార్యరూపం దాల్చనుంది. తిరుగుబాటు ఎంపీలైన సంజయ్ దినా పాటిల్, సంజయ్ దేశ్‌ముఖ్, సంజయ్ జాదవ్, భావూ సాహెబ్ వాక్‌చౌరే, నగేష్ పాటిల్ అస్తికార్, ఓంప్రకాష్ రాజే నింబాల్కర్‌లు ఇప్పటికే ఉద్ధవ్ వర్గం నిర్వహించిన పార్లమెంటరీ సమావేశానికి గైర్హాజరై తమ అసమ్మతిని స్పష్టం చేశారు. ఫిరాయింపుల నిరోధక చట్టం కింద అనర్హత వేటు పడకుండా ఉండేందుకు అవసరమైన కచ్చితమైన మూడింట రెండు వంతుల మెజారిటీని ఈ తిరుగుబాటు వర్గం సాధించడం గమనార్హం.

ఈ తిరుగుబాటుపై ఇప్పటికే ఎంపీలు అస్తికార్, నింబాల్కర్ బహిరంగంగా ప్రకటనలు చేశారు. గత రెండేళ్లుగా తమ నియోజకవర్గాలకు అభివృద్ధి నిధులు అందకపోవడం, పార్టీలోని కొందరు సీనియర్ నేతలు తమపై చేసిన అనుచిత వ్యాఖ్యల వల్లే తాము ఉద్ధవ్ వర్గాన్ని వీడాల్సి వస్తోందని వారు స్పష్టం చేశారు. తాము కేవలం ఒక శివసేన గ్రూప్ నుంచి అసలైన సిద్ధాంతాలు కలిగిన మరో శివసేనలోకి మారుతున్నామని వారు సమర్థించుకున్నారు.

ఈ పరిణామాలపై మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్, ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే స్పందిస్తూ.. 'ఆపరేషన్ టైగర్' నూటికి నూరు శాతం విజయవంతమైందని, త్వరలోనే ఢిల్లీ నుంచి అధికారిక ప్రకటన వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. తిరుగుబాటు ఎంపీలు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను కలిసి తమను ప్రత్యేక గ్రూప్‌గా గుర్తించాలని కోరేందుకు సంబంధించిన ఫోటోలు, వీడియోలను షిండే వర్గం విడుదల చేయనుంది.



మరోవైపు ఈ భారీ విలీన ప్రక్రియ ఉద్ధవ్ థాకరే క్యాంప్‌లో కలకలం రేపింది. పార్టీ మారిన వారిని ఉద్ధవ్ థాకరే 'ద్రోహులు'గా అభివర్ణించారు. అధికార దాహం, డబ్బు కోసమే ప్రజలు ఇచ్చిన తీర్పును వీరు అగౌరవపరిచారని ఆయన మండిపడ్డారు. ఈ సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు, మిగిలిన ప్రజాప్రతినిధులు చేజారిపోకుండా చూసేందుకు ఉద్ధవ్ థాకరే నేటి మధ్యాహ్నం 2:30 గంటలకు నారిమన్ పాయింట్‌లోని 'శివాలయ' కార్యాలయంలో శివసేన (యూబీటీ) ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేశారు. మహారాష్ట్ర అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు జరుగుతున్న తరుణంలోనే ఈ పరిణామం చోటుచేసుకోవడం రాబోయే అసెంబ్లీ ఎన్నికలపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

## కార్యకర్తలపై ఖర్గే ఫైర్.. 'పనికిమాలిన వాళ్లు' అంటూ తీవ్ర వ్యాఖ్యలు

- 'డీకే డీకే' నినాదాలతో హోరెత్తించిన కార్యకర్తలపై కాంగ్రెస్ చీఫ్ ఖర్గే ఆగ్రహం
- 'పనికిమాలిన వాళ్లు' అంటూ మండిపాటు.. క్రమశిక్షణా చర్యలు తప్పవని వార్నింగ్
- ఇది పార్టీ కార్యక్రమం, వ్యక్తిగత భజన కోసం కాదన్న ఖర్గే
- స్వయంగా జోక్యం చేసుకుని కార్యకర్తలను శాంతపరిచిన సీఎం డీకే శివకుమార్
- కర్ణాటక కాంగ్రెస్‌లో సిద్ధరామయ్య, డీకే వర్గాల మధ్య పోరు నేపథ్యంలో ఈ ఘటన

**అఖండ సూర్య :**

కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సొంత పార్టీ కార్యకర్తలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కర్ణాటకలో జరిగిన ఓ పార్టీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌కు మద్దతుగా కొందరు కార్యకర్తలు 'డీకే డీకే' అంటూ నినాదాలు చేయడంతో ఆయన సహనం కోల్పోయారు. 'పనికిమాలిన వాళ్లు' అంటూ వారిపై మండిపడ్డారు. కర్ణాటక పీసీసీ నూతన అధ్యక్షుడిగా బీకే హరిప్రసాద్ పదవీ బాధ్యతలు స్వీకరిస్తున్న వేదికపై ఈ ఘటన చోటుచేసుకుంది.

కార్యకర్తలు నినాదాలు ఆపకపోవడంతో ఖర్గే తీవ్ర స్వరంతో మాట్లాడారు. "నోరుమూయండి! కింద కూర్చోండి. దేశమంతా మీ చేతుల్లోకి వచ్చినట్టు ప్రవర్తిస్తున్నారు. ఇది కాంగ్రెస్ పార్టీ సమావేశం. ఎవరో ఒక వ్యక్తి కోసం ఏర్పాటు చేసింది కాదు. పార్టీని బలోపేతం చేయడానికి, ఐక్యంగా ఉంచడానికి అందరం ఇక్కడకు వచ్చాం. ఒకరు ఒకరి పేరు, మరొకరు ఇంకొకరి పేరు అరుస్తుంటే.. మిగిలిన వాళ్లు ఇక్కడ చెత్త ఊడ్చడానికి వచ్చారా?" అని గట్టిగా అరిచారు. ఈ సమయంలో ముఖ్యమంత్రి డీకే శివకుమార్ కూడా స్వయంగా లేచి నిలబడి, కార్యకర్తలను శాంతించాలని సైగలు చేయడం గమనార్హం.

అంతటితో ఆగకుండా పార్టీలో క్రమశిక్షణ చాలా అవసరమని ఖర్గే స్పష్టం చేశారు. "ఇక్కడ ఎవరు అల్లరి చేస్తున్నారో వీడియో ఫుటేజ్‌లో రికార్డ్ అవుతోంది. ఆ ఫుటేజ్ చూసిన తర్వాత కచ్చితంగా క్రమశిక్షణా చర్యలు తీసుకుంటాను. ఎవర్నీ వదిలిపెట్టను" అని తీవ్రంగా హెచ్చరించారు. పార్టీ వల్లే మనందరికీ గుర్తింపు అని, వ్యక్తిగత నినాదాలతో పార్టీ ప్రతిష్టను దెబ్బతీయవద్దని సూచించారు. కర్ణాటక కాంగ్రెస్‌లో కొంతకాలంగా నెలకొన్న వర్గపోరు నేపథ్యంలో ఈ ఘటన ప్రాధాన్యం సంతరించుకుంది.



2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించినప్పటి నుంచి ముఖ్యమంత్రి పదవి కోసం సిద్ధరామయ్య, డీకే శివకుమార్‌ల మధ్య తీవ్ర పోటీ నడిచింది. అధిష్ఠానం జోక్యంతో సిద్ధరామయ్య సీఎం కాగా, డీకే ఉపముఖ్యమంత్రి పదవితో సరిపెట్టుకున్నారు. రెండేళ్ల తర్వాత సీఎం మార్పు ఉంటుందనే ఒప్పందం కుదిరినట్టు అప్పట్లో వార్తలు వచ్చాయి.

ఒప్పందం ప్రకారం సిద్ధరామయ్య ప్రభుత్వం రెండున్నరేళ్లు పూర్తి చేయగానే డీకే వర్గం అధిష్ఠానంపై ఒత్తిడి పెంచింది. దీంతో రానున్న 2028 ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని అధిష్ఠానం నాయకత్వ మార్పునకు అంగీకరించింది. ఈ క్రమంలోనే గత మే 28న సిద్ధరామయ్య రాజీనామా చేయగా, వారం రోజుల తర్వాత డీకే శివకుమార్ సీఎంగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ రాజకీయ పరిణామాల నేపథ్యంలో తాజా ఘటన పార్టీలోని వర్గపోరును మరోసారి బహిర్గతం చేసింది.

## కాంగ్రెస్ ర్యాలీ ఎఫెక్ట్.. నీట్ పరీక్షకు హాజరుకాలేక విద్యార్థుల కన్నీళ్లు!

- బెంగళూరులో ట్రాఫిక్ కారణంగా నీట్ పరీక్షకు కొందరు విద్యార్థులు దూరం
- కాంగ్రెస్ పార్టీ ర్యాలీతో భారీగా నిలిచిపోయిన వాహనాలు
- పరీక్షా కేంద్రాల వద్ద కన్నీరుమున్నీరైన విద్యార్థులు, తల్లిదండ్రులు
- విద్యార్థుల భవిష్యత్తు కంటే రాజకీయాలే ముఖ్యమా అని బీజేపీ విమర్శ
- ఇతర రాష్ట్రాల్లోనూ ఇలా జరిగిందంటూ కాంగ్రెస్ ఎదురుదాడి

**అఖండ సూర్య :**



నీట్ యూజీ రీటెస్ట్ సందర్భంగా బెంగళూరులో ఉద్రిక్తత చోటుచేసుకుంది. కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన ర్యాలీ ప్రభావంతో నగరంలో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. దీనివల్ల పలువురు విద్యార్థులు నిర్ణీత సమయానికి పరీక్షా కేంద్రాలకు చేరుకోలేకపోయారు. నిబంధనల ప్రకారం అధికారులు వారిని లోపలికి అనుమతించకపోవడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కన్నీటిపర్యంతమయ్యారు. ఈ పరిణామం ప్రస్తుతం రాజకీయ దుమారానికి దారితీసింది.

దేశవ్యాప్తంగా ఆదివారం నీట్ రీటెస్ట్ నిర్వహించారు. మధ్యాహ్నం 2 గంటలకు పరీక్ష ప్రారంభం కానుండగా, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) నిబంధనల ప్రకారం గంటన్నర ముందుగానే, అంటే 1:30 గంటలకు గేట్లు మూసివేయాల్సి ఉంది. అయితే, అదే సమయంలో బెంగళూరు ప్యాలెస్ గ్రౌండ్స్‌లో బీకే హరిప్రసాద్ రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించే కార్యక్రమం జరగడంతో నగరంలోని పలు ప్రధాన మార్గాల్లో ట్రాఫిక్ స్తంభించిపోయింది. ఫలితంగా ప్రభుత్వ ఆర్‌సీ కళాశాల సహా పలు కేంద్రాలకు వెళ్లాల్సిన విద్యార్థులు ఆలస్యంగా చేరుకున్నారు. గేట్లు మూసివేసిన సిబ్బంది వారిని లోపలికి అనుమతించకపోవడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర వాగ్వాదానికి దిగారు. కొంతమంది విద్యార్థులు ప్రహరీ గోడలు దూకి లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించారు. సాధారణంగా 20 నిమిషాల్లో చేరుకోవాల్సిన 7 కిలోమీటర్ల దూరానికి ట్రాఫిక్ వల్ల 35 నిమిషాలకు పైగా సమయం పట్టిందని ఒక విద్యార్థి తండ్రి ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ ఘటనపై అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం మొదలైంది. విద్యార్థుల భవిష్యత్తు కంటే కాంగ్రెస్ పార్టీకి రాజకీయ ప్రయోజనాలే ముఖ్యమని బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య విమర్శించారు. పరీక్ష తేదీ ముందే ఖరారైనప్పటికీ, అదే రోజున ర్యాలీ నిర్వహించడం బాధ్యతారాహిత్యమని ఆయన మండిపడ్డారు. దీనిపై స్పందించిన కాంగ్రెస్ నేత ప్రియాంక్ ఖర్గే, బీజేపీ పాలిత రాష్ట్రాల్లోనూ ఇటువంటి ఘటనలు చోటుచేసుకున్నాయని, దీనిని రాజకీయం చేయడం తగదని హితవు పలికారు. విద్యార్థులకు కలిగిన అసౌకర్యానికి విచారం వ్యక్తం చేస్తూనే, పరీక్షల నిర్వహణలో కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను ఆయన ఎత్తిచూపారు. మరోవైపు, ఈ మొత్తం పరిణామం సిగ్గుచేటని జేడీఎస్ నేత, కేంద్ర మంత్రి హెచ్.డి. కుమారస్వామి వ్యాఖ్యానించారు.

ఆర్‌సీ కళాశాల కేంద్రంలో ముగ్గురు విద్యార్థులను పరీక్షకు అనుమతించలేదని అధికారులు ధ్రువీకరించారు. ప్రశ్నాపత్రాల లీకేజీ ఆరోపణల నేపథ్యంలో దేశవ్యాప్తంగా నెలకొన్న ఆందోళనల మధ్య ఈ రీటెస్ట్ నిర్వహించగా, తాజాగా చోటు చేసుకున్న ఈ పరిణామాలు విద్యార్థుల్లోను మరింత కుంగదీశాయి. పరీక్ష రాయలేకపోయిన విద్యార్థులు కంటతడి పెట్టుకోవడం చూపరులను కలిచివేసింది.

# టార్గెట్ 2027 వరల్డ్‌కప్ ఇప్పటినుంచే బీసీసీఐ మాస్టర్ ప్లాన్!

- **2027 వన్డే వరల్డ్‌కప్‌పై బీసీసీఐ ప్రత్యేక దృష్టి**
- **మెగా టోర్నీ కోసం ఇప్పటినుంచే రోడ్‌మ్యాప్ సిద్ధం**
- **సెలెక్టర్లు, కోచింగ్ స్టాఫ్ మధ్య పూర్తి సమన్వయం**
- **ఇంగ్లాండ్ సిరీస్‌ను కీలక పరీక్షగా భావిస్తున్న బోర్డు**
- **గిల్ సారథ్యంలో కొత్త వరల్డ్‌కప్ ప్రయాణానికి శ్రీకారం**



**అఖండ సూర్య :**

2023 వన్డే వరల్డ్‌కప్ ఫైనల్ ఓటమి గాయం ఇంకా భారత క్రికెట్ అభిమానులను వెంటాడుతూనే ఉంది. స్వదేశంలో అజేయంగా ఫైనల్ చేరిన టీమిండియా చివరి అడుగులో తడబడి ట్రోఫీని చేజార్చుకుంది. ఇప్పుడు ఆ నిరాశను తుడిచిపెట్టి 2027లో మళ్లీ ప్రపంచ కప్‌ను ముద్దాడాలనే లక్ష్యంతో భారత క్రికెట్ బోర్డు ముందడుగు వేస్తోంది. ఇందుకోసం ఇప్పటినుంచే ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నట్లు బీసీసీఐ స్పష్టం చేసింది.

**స్పష్టమైన రోడ్‌మ్యాప్**

2027 వన్డే వరల్డ్‌కప్ కోసం బీసీసీఐ ఇప్పటికే ప్రణాళికలు ప్రారంభించిందని బోర్డు కార్యదర్శి దేవజిత్ సైకియా వెల్లడించారు. అక్టోబర్‌నవంబర్ 2027లో జరగనున్న మెగా టోర్నీకి ముందు భారత జట్టు సరిపడా వన్డే క్రికెట్ ఆడేలా షెడ్యూల్ రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఆటగాళ్లను పరీక్షించడంతో పాటు బలమైన జట్టును తయారు చేయడమే లక్ష్యమన్నారు.

ఇంగ్లాండ్‌తో వచ్చే నెల జరిగే మూడు వన్డేల సిరీస్ కూడా ఈ ప్రణాళికలో భాగమేనని పేర్కొన్నారు. జులై 14 నుంచి 19 వరకు జరిగే ఈ సిరీస్ భవిష్యత్ కాంబినేషన్లను పరీక్షించేందుకు ఉపయోగపడనుంది. కొత్త వరల్డ్‌కప్ సైకిల్‌లో ఇది కీలక దశగా మారనుంది.

**అగార్కర్-గంభీర్ ఒకే దారిలో**

భారత జట్టు ఎంపిక కమిటీ ఛైర్మన్ అజిత్ అగార్కర్, ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ మధ్య పూర్తి సమన్వయం ఉందని బీసీసీఐ తెలిపింది. సెలెక్టర్లు, కోచింగ్ సిబ్బంది, జట్టు యాజమాన్యం అందరూ ఒకే లక్ష్యంతో పనిచేస్తున్నారని సైకియా వివరించారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని జట్టును నిర్మించడంపై దృష్టి పెట్టామన్నారు. కేవలం తక్షణ ఫలితాలే కాకుండా 2027 వరల్డ్‌కప్‌ను లక్ష్యంగా చేసుకుని ఆటగాళ్ల ఎంపిక, జట్టు కూర్పు, వ్యూహాలపై నిర్ణయాలు తీసుకుంటున్నట్లు సంకేతాలు ఇచ్చారు.

**ఇంగ్లాండ్ సిరీస్‌కు జట్టు ఖరారు**

అజిత్ అగార్కర్ నేతృత్వంలోని ఎంపిక కమిటీ ఇప్పటికే ఇంగ్లాండ్ పర్యటనకు 15 మంది సభ్యులతో కూడిన జట్టును ప్రకటించింది. సీనియర్ ఆటగాళ్లు విరాట్ కోహ్లీ, బుమ్రా జట్టులో చోటు దక్కించుకున్నారు. యువ పేసర్ హర్షిత్ రాణా కూడా తన స్థానాన్ని నిలబెట్టుకున్నాడు. అయితే ఇటీవల ఆఫ్ఘనిస్థాన్‌తో జరిగిన సిరీస్‌లో భాగమైన జైశ్వాల్, హర్ష్ దూబే, ప్రిన్స్ యాదవ్‌కు ఈసారి అవకాశం దక్కలేదు. దీంతో జట్టు కూర్పుపై చర్చ మొదలైంది.

**గిల్ యుగానికి ఆరంభం**

2023 వరల్డ్‌కప్ తర్వాత భారత వన్డే జట్టులో అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. కెప్టెన్‌గా రోహిత్ శర్మ స్థానంలో శుభ్‌మన్ గిల్ బాధ్యతలు చేపట్టాడు. కొత్త నాయకత్వంలో జట్టు ఇప్పటికే ఆఫ్ఘన్‌పై 30తో క్లీన్‌స్వీప్ చేసింది. ఇప్పుడు ఇంగ్లాండ్ సిరీస్‌తో పాటు రానున్న నెలల్లో జరిగే వన్డే మ్యాచ్‌లు 2027 వరల్డ్‌కప్ జట్టుకు పునాది వేయనున్నాయి. యువ ఆటగాళ్లతో పాటు అనుభవజ్ఞులైన క్రికెటర్లతో బ్యాలెన్స్ సాధించడంపై బీసీసీఐ ప్రత్యేక దృష్టి పెట్టింది.

# మహిళా క్రికెటర్లకు ఐసీసీ గుడ్ న్యూస్... ప్రెగ్నెన్సీ తర్వాత ఆడేందుకు కొత్త గైడ్‌లైన్స్

- **ప్రసవం తర్వాత మహిళా క్రికెటర్లు తిరిగి ఆడేందుకు ఐసీసీ మార్గదర్శకాలు**
- **'6-R' ఫార్ములాతో దశలవారీగా పునరాగమనానికి ప్రణాళిక**
- **మాతృత్వం, కెరీర్ రెండూ కొనసాగించేలా ప్రోత్సాహం**
- **ప్రతి క్రీడాకారిణికి ప్రత్యేక కేస్ మేనేజర్, వైద్య బృందం**
- **ఆటగాళ్ల వ్యక్తిగత గోప్యత, ఆరోగ్యానికే పెద్దపీట**



**అఖండ సూర్య :**

అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) సోమవారం మహిళా క్రికెటర్ల కోసం ఒక కీలకమైన ముందడుగు వేసింది. ప్రసవం తర్వాత తిరిగి మైదానంలోకి అడుగుపెట్టేందుకు వీలు కల్పించే మార్గదర్శకాలను (గైడ్‌లైన్స్) విడుదల చేసింది. మాతృత్వం కారణంగా మహిళా క్రికెటర్ల కెరీర్ ముగిసిపోకూడదనే లక్ష్యంతో, వారికి అవసరమైన మద్దతును అందించేందుకు ఈ కొత్త పాలసీని తీసుకొచ్చింది. మాతృత్వం, ప్రొఫెషనల్ క్రికెట్ రెండూ ఏకకాలంలో సాధ్యమేనని చాటిచెప్పడం ఈ మార్గదర్శకాల ముఖ్య ఉద్దేశం. ఈ గైడ్‌లైన్స్‌లో భాగంగా '6R' ఫార్ములాను ఐసీసీ ప్రతిపాదించింది. ఇందులో రెడీ (సిద్ధం కావడం), రివ్యూ (సమీక్ష), రీస్టోర్ (పునరుద్ధరణ), రీకండిషన్ (పునఃస్థితికి తీసుకురావడం), రిటర్న్ (తిరిగి ఆడటం), రిఫైన్ (మెరుగుపరచడం) అనే ఆరు దశలు ఉంటాయి. శారీరకంగా కోలుకోవడం నుంచి మొదలుకొని, వైద్య సమీక్షలు, నెమ్మదిగా శిక్షణ ప్రారంభించడం, క్రికెట్‌కు అవసరమైన కండిషనింగ్ సాధించడం, పోటీల్లోకి తిరిగి రావడం, ఆ తర్వాత కూడా ఆరోగ్యాన్ని పర్యవేక్షించడం వరకు ప్రతీ అంశాన్ని ఈ ప్రణాళికలో పొందుపరిచారు.

ఆస్ట్రేలియా జట్టు డాక్టర్, ఐసీసీ మెడికల్ అడ్వైజరీ కమిటీ సభ్యురాలు డాక్టర్ ఫిలిప్పా ఇంగే మాట్లాడుతూ, "ఈ మార్గదర్శకాల ముఖ్య ఉద్దేశం.. బిడ్డకు జన్మనివ్వడం కెరీర్‌కు ముగింపు కాదని క్రీడాకారిణులకు భరోసా ఇవ్వడమే. చాలా దేశాల బోర్డులకు గతంలో ఇలాంటి పాలసీలు లేవు. అందుకే అన్ని దేశాలకూ అనుకూలంగా ఉండేలా, వారి అవసరాలకు తగ్గట్టు మార్చుకునేలా ఈ గైడ్‌లైన్స్‌ను రూపొందించాం. ఇది ఒక టెంప్లేట్ లాంటిది. ప్రతి క్రీడాకారిణి, వారి కుటుంబ అవసరాలకు అనుగుణంగా మద్దతు అందించాలి" అని వివరించారు.

ఈ మార్గదర్శకాల ప్రకారం, ప్రతి క్రీడాకారిణికి ఒక ప్రత్యేక కేస్ మేనేజర్‌ను నియమించాలని సిఫార్సు చేశారు. సాధారణంగా డాక్టర్ లేదా ఫిజియోథెరపిస్ట్ ఈ బాధ్యతలు చూస్తారు. గర్భం దాల్చినప్పటి నుంచి తిరిగి మైదానంలోకి అడుగుపెట్టే వరకు వీరే ఆమెకు ప్రతినిధిగా వ్యవహరిస్తారు. అంతేకాకుండా, మెడికల్ సిబ్బంది, ఫిజియోథెరపిస్టులు, సైకాలజిస్టులు, డైటీషియన్లు, కోచ్‌లు, కుటుంబ సభ్యులతో కూడిన ఒక బృందం క్రీడాకారిణికి అండగా నిలవాలని ఐసీసీ సూచించింది.


ఆటగాళ్ల వ్యక్తిగత స్వేచ్ఛ, గోప్యతకు ఐసీసీ పెద్దపీట వేసింది. గర్భం దాల్చిన విషయాన్ని ఎప్పుడు ప్రకటించాలనే నిర్ణయం పూర్తిగా క్రీడాకారిణిదేనని స్పష్టం చేసింది. సభ్య దేశాల బోర్డులు తప్పనిసరిగా ప్రెగ్నెన్సీ టెస్టులు చేయించరాదని నిర్దేశించింది. గర్భధారణ సమయంలో వ్యాయామాన్ని ప్రోత్సహించినప్పటికీ, శిక్షణ, పోటీలకు సంబంధించిన నిర్ణయాలు వైద్యుల సంప్రదింపులతోనే తీసుకోవాలని పేర్కొంది. సాధారణంగా మొదటి త్రైమాసికం తర్వాత పోటీలకు దూరంగా ఉండాలని సూచించినా, ఎప్పటివరకు ఆడాలనే దానిపై కచ్చితమైన నిబంధన ఏదీ లేదని స్పష్టం చేసింది.

2021లో కుమారుడికి జన్మనిచ్చి, ప్రస్తుతం 2026 మహిళల టీ20 ప్రపంచకప్‌లో ఆడుతున్న వెస్టిండీస్ లెగ్ స్పిన్నర్ అఫీ ఫ్లెచర్ ఈ నిర్ణయాన్ని స్వాగతించింది. "మహిళల కోసం ఐసీసీ ఇలాంటి పాలసీని తీసుకురావడం గొప్ప విషయం. దీనివల్ల కుటుంబ బాధ్యతలు నిర్వర్తిస్తూనే కెరీర్‌ను కొనసాగించవచ్చు. శారీరకంగా కోలుకోవడం సవాలుగా అనిపించింది. అంతకంటే ఎక్కువగా నా బిడ్డను వదిలి వెళ్లడం నన్ను చాలా బాధపెట్టింది. అందుకే మైదానంలో ప్రతీ క్షణం వాడి కోసమే ఆడతాను. ప్రతి ఒక్కరి ప్రయాణం భిన్నంగా ఉంటుంది. సరైన మద్దతుతో ఆరోగ్యంగా మారి, ప్రక్రియను నమ్మాలి" అని ఆమె తన అనుభవాన్ని పంచుకున్నారు.

శిక్షణా వాతావరణంలో వెసులుబాటు, శిశువు సంరక్షణకు సలహాలు, మైదానంలో పిల్లలకు పాలివ్వడానికి లేదా చూసుకోవడానికి అనువైన గదులు, ప్రయాణ సౌకర్యాలు వంటి ఆచరణాత్మక మద్దతును కూడా ఈ మార్గదర్శకాలలో చేర్చారు. మహిళా క్రికెట్ అభివృద్ధికి తగ్గట్టుగా వారికి మెరుగైన వాతావరణం కల్పించడం చాలా అవసరమని ఐసీసీ ప్రతినిధి తెలిపారు.

# ఆటగాళ్ల ఆరోగ్యమా? ఆట స్వరూపమా?.. ఫిఫా వరల్డ్ కప్‌లో 'హైడ్రేషన్ బ్రేక్'పై వివాదం!

- **ఫిఫా వరల్డ్ కప్‌లో తప్పనిసరి హైడ్రేషన్ బ్రేక్‌పై తీవ్ర చర్చ**
- **ఈ విరామాలు ఆట లయను దెబ్బతీస్తున్నాయని కోచ్‌లు, ఆటగాళ్ల విమర్శ**
- **ఆటగాళ్ల ఆరోగ్యం దృష్ట్యా ఇది అవసరమేనంటున్న ఫిఫా, క్రీడా శాస్త్రవేత్తలు**
- **మూడు నిమిషాలు సరిపోవని, తీవ్రమైన వేడిలో మరింత సమయం కావాలంటున్న నిపుణులు**
- **ఆట సంప్రదాయం, ఆటగాళ్ల సంక్షేమం మధ్య ఫిఫాకు ఎదురైన సందిగ్ధత**




**అఖండ సూర్య :**

ప్రస్తుతం నార్త్ అమెరికాలో జరుగుతున్న ఫిఫా వరల్డ్ కప్‌లో తీవ్రమైన ఉష్ణోగ్రతల నుంచి ఆటగాళ్లను కాపాడేందుకు ప్రవేశపెట్టిన ఒక నిబంధన ఇప్పుడు టోర్నమెంట్‌లోనే అతిపెద్ద చర్చనీయాంశంగా మారింది. ప్రతి మ్యాచ్‌లోనూ రెండు అర్ధభాగాల్లో మూడు నిమిషాల చొప్పున రెండు పర్యాయాలు తప్పనిసరిగా 'హైడ్రేషన్ బ్రేక్' (డ్రింక్స్ బ్రేక్) ఇవ్వాలని ఫిఫా ఆదేశాలు జారీ చేసింది. వాతావరణంతో సంబంధం లేకుండా ప్రతి మ్యాచ్‌కు ఇది వర్తిస్తుంది. గతంలో వేడి ప్రదేశాల్లో జరిగిన టోర్నమెంట్‌ల అనుభవాల దృష్ట్యా, ఆటగాళ్లందరికీ ఒకే రకమైన రక్షణ కల్పించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నామని ఫిఫా చెబుతోంది.

అయితే, ఈ నిర్ణయంపై ఫుట్‌బాల్ ప్రపంచంలోని ప్రముఖుల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ విరామాలు ఆట సహజమైన గమనాన్ని, డైనమిక్స్‌ను పూర్తిగా మార్చేస్తున్నాయని వారు వాదిస్తున్నారు. ఈ నిబంధన ఫుట్‌బాల్‌లోని ప్రముఖుల నుంచి విమర్శలకు దారితీస్తోందని జిన్హువా తన కథనంలో పేర్కొంది. ఉరుగ్వే హెడ్ కోచ్ మార్సెలో బియెల్సా ఈ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్న వారిలో ముందున్నాడు.

"ఈ బ్రేక్స్ ఆట లయను దెబ్బతీస్తున్నాయి. రెండు భాగాలుగా జరగాల్సిన ఆటను నాలుగు భాగాలుగా విడదీస్తున్నాయి. ఇవి ఆటకు కొత్తగా ఏమీ జోడించడం లేదు, కానీ చాలా నష్టం చేస్తున్నాయి. ఈ నిర్ణయానికి ముందు ఫుట్‌బాల్‌కు ఒక ప్రత్యేకత ఉండేది, ఇప్పుడు అది మారిపోయింది. అభిమానులు దాని సహజ లక్షణాల వల్లే ఆటను ఇష్టపడతారు" అని అన్నాడు. నెదర్లాండ్స్ కెప్టెన్ వర్జిల్ వాన్ డైక్ కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశాడు. ఆటగాళ్ల ఆరోగ్యం ముఖ్యమే అయినా, వాతావరణ పరిస్థితులను బట్టి బ్రేక్స్ అవసరమో కాదో నిర్ణయించాలని, అన్ని మ్యాచ్‌లకు తప్పనిసరి చేయడం సరికాదని అన్నాడు.

మరోవైపు క్రీడా శాస్త్రవేత్తలు, మరికొందరు నిపుణులు ఫిఫా నిర్ణయాన్ని సమర్థిస్తున్నారు. వాతావరణం సాధారణంగా అనిపించినప్పటికీ, ఇది ఆటగాళ్ల ఆరోగ్యానికి అవసరమైన రక్షణ చర్య అని వారు స్పష్టం చేస్తున్నారు. ముఖ్యంగా వేసవిలో మధ్యాహ్నం జరిగే మ్యాచ్‌లలో ఆటగాళ్లు చెమట ద్వారా భారీగా ద్రవాలను కోల్పోతారని, ఇది వారి ఏకాగ్రతను, నిర్ణయాలు తీసుకునే సామర్థ్యాన్ని, శారీరక ప్రదర్శనను దెబ్బతీస్తుందని పరిశోధకులు చెబుతున్నారు.


కొలంబియా యూనివర్సిటీకి చెందిన జోషువా డివిన్సెంజో మాట్లాడుతూ.. "మూడు నిమిషాల హైడ్రేషన్ బ్రేక్‌ను మేము అత్యవసర పరిస్థితులను నివారించే ఒక మార్గంగా చూస్తున్నాము" అని వివరించారు. జర్మనీ హెడ్ కోచ్ జూలియన్ నాగెల్స్‌మన్ కూడా ఒక మ్యాచ్ సందర్భంగా ఈ బ్రేక్ తమ జట్టు వ్యూహాలు మార్చుకోవడానికి ఉపయోగపడిందని అంగీకరించాడు.

ఆసక్తికరంగా కొందరు పరిశోధకులు ఈ విధానాన్ని సమర్థిస్తూనే, మూడు నిమిషాల సమయం ఆటగాళ్లు తిరిగి శక్తిని పుంజుకోవడానికి, శరీరాన్ని చల్లబరుచుకోవడానికి సరిపోతుందా అని ప్రశ్నిస్తున్నారు. పరిశోధకుడు జూలియన్ పెరియార్డ్ ప్రకారం "ఈ విరామాలు కొద్దిగా సహాయపడగలవు కానీ, శరీర ఉష్ణోగ్రత పెరగడం వల్ల కలిగే అనారోగ్య ప్రమాదాన్ని పూర్తిగా తొలగించలేవు" అని పేర్కొన్నారు. తీవ్రమైన వేడి ఉన్నప్పుడు ఈ విరామ సమయాన్ని మరింత పెంచాలని, అప్పుడే ఆటగాళ్లకు పూర్తి రక్షణ లభిస్తుందని పలువురు నిపుణులు సూచిస్తున్నారు.

ఈ పరిణామాలతో ఫిఫాకు ఇరువైపుల నుంచి ఒత్తిడి ఎదురవుతోంది. ఒకవైపు ఆట సహజత్వాన్ని కాపాడాలని కోచ్‌లు, ఆటగాళ్లు కోరుతుంటే, మరోవైపు ఆటగాళ్ల సంక్షేమానికి మరింత ప్రాధాన్యత ఇవ్వాలని, అవసరమైతే బ్రేక్ సమయాన్ని పెంచాలని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. పెరుగుతున్న ప్రపంచ ఉష్ణోగ్రతల నేపథ్యంలో భవిష్యత్తులోనూ ఫుట్‌బాల్ అధికారులు ఆట సంప్రదాయం, ఆటగాళ్ల సంక్షేమం మధ్య సమతుల్యం సాధించాల్సిన సవాల్‌ను ఎదుర్కోక తప్పదు.

# ఫిఫా వరల్డ్ కప్‌లో ఈజిప్ట్ సంచలనం..

**అఖండ సూర్య :**



ఫిఫా ప్రపంచకప్2026 (FIFA World Cup 2026)లో మరో సంచలనం నమోదైంది. కెనడాలోని వాంకోవర్ వేదికగా జరిగిన గ్రూప్‌జి రౌండ్ మ్యాచ్‌లో ఈజిప్ట్ (Egypt) జట్టు 31 తేడాతో న్యూజిలాండ్ (New Zealand)పై తిరుగులేని విజయం సాధించింది. ఫిఫా ప్రపంచకప్ చరిత్రలోనే ఈజిప్ట్ దేశానికి ఇదే మొట్టమొదటి విజయం కావడం విశేషం. స్టార్ ప్లేయర్, కెప్టెన్ మహ్మద్ సలాహ్ ఒక గోల్, ఇకే ఒక అసిస్ట్‌తో జట్టును ధైర్యంగా ముందుండి నడిపించాడు.

**తొలి అర్ధభాగం ఆధిక్యంలో న్యూజిలాండ్..**

మ్యాచ్ ప్రారంభమైన 15వ నిమిషంలోనే న్యూజిలాండ్ ఆటగాడు ఫిన్ సుర్మాన్ (Finn Surman) అద్భుతమైన హెడర్ గోల్‌తో జట్టుకు 10 ఆధిక్యాన్ని అందించి ఈజిప్ట్‌కు షాకిచ్చాడు. అయితే ఆ తర్వాత ఈజిప్ట్ పుంజుకుంది. 58వ నిమిషంలో మోస్తఫా జికో హెడర్ ద్వారా గోల్ చేసి స్కోరును సమం చేశాడు. ఇక 67వ నిమిషంలో ఈజిప్ట్ స్టార్ కెప్టెన్ మహ్మద్ సలాహ్ (Mohamed Salah) క్లోజ్‌రేంజ్ ఫినిషింగ్‌తో కీలకమైన రెండో గోల్ చేసి జట్టును 21 ఆధిక్యంలోకి తీసుకెళ్లాడు. ఆట ముగిసేందుకు కేవలం 8 నిమిషాలు ఉండగా.. 82వ నిమిషంలో సబ్‌స్టిట్యూట్ ప్లేయర్ ట్రెజెగెట్ హెడర్ (Trezeguet's Header) కళ్లుచెదిరిగే మూడో గోల్ కొట్టి ఈజిప్ట్ 31 ఆధిక్యంలోకి తీసుకెళ్లి విజయాన్ని ఖరారు చేశాడు. తాజాగా విజయంతో ఈజిప్ట్ మొత్తం 4 పాయింట్లతో గ్రూప్‌జి పట్టికలో అగ్రస్థానానికి చేరుకుంది. తదుపరి మ్యాచ్‌లో ఇరాన్‌తో కనీసం డ్రా చేసుకున్నా ఈజిప్ట్ సులభంగా నాకౌట్ దశకు అర్హత సాధిస్తుంది.

# ఐపీఎల్‌లో మెగా ట్రేడ్?.. ముంబైని వీడనున్న హార్దిక్.. జైస్వాల్‌పై ఎంఐ కన్ను!

- **ముంబై ఇండియన్స్‌ను వీడనున్న కెప్టెన్ హార్దిక్ పాండ్యా**
- **యశస్వి జైస్వాల్ కోసం రాజస్థాన్‌తో ట్రేడింగ్ ఒప్పందం**
- **కెప్టెన్సీ దక్కకపోవడంతో రాజస్థాన్‌పై జైస్వాల్ అసంతృప్తి**
- **సూర్యకుమార్ యాదవ్ కూడా జట్టును వీడే యోచనలో ఉన్నట్టు సమాచారం**
- **జట్టులో ప్రక్షాళన దిశగా ముంబై ఇండియన్స్ యాజమాన్యం అడుగులు**

**అఖండ సూర్య :**

ఐపీఎల్‌లో అత్యంత విజయవంతమైన ఫ్రాంచైజీలలో ఒకటైన ముంబై ఇండియన్స్‌లో భారీ మార్పులకు రంగం సిద్ధమవుతున్నట్టు కనిపిస్తోంది. కెప్టెన్‌గా విఫలమైన స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా జట్టును వీడటం దాదాపు ఖాయమైంది. అతని స్థానంలో రాజస్థాన్ రాయల్స్ యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్‌ను ట్రేడింగ్ ద్వారా జట్టులోకి తీసుకురావాలని ముంబై యాజమాన్యం తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్టు జాతీయ క్రీడా వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.

గుజరాత్ టైటాన్స్ నుంచి భారీ అంచనాలతో ముంబైకి తిరిగివచ్చిన హార్దిక్ పాండ్యా, కెప్టెన్సీ బాధ్యతలు స్వీకరించిన తర్వాత జట్టును సమర్థంగా నడిపించలేకపోయాడు. జట్టు ప్రదర్శన పేలవంగా ఉండటంతో పాటు, డ్రెస్సింగ్ రూమ్‌లో కూడా విభేదాలు తలెత్తినట్టు వార్తలు వచ్చాయి. ఈ పరిణామాల నేపథ్యంలో, ముంబై ఇండియన్స్‌తో తన ప్రయాణాన్ని ముగించుకోవాలని హార్దిక్ నిర్ణయించుకున్నట్టు తెలుస్తోంది. 'RevSportz' కథనం ప్రకారం.. హార్దిక్ పాండ్యాను రాజస్థాన్ రాయల్స్‌కు ఇచ్చి, ప్రతిగా యశస్వి జైస్వాల్‌ను తీసుకునేందుకు ఇరు ఫ్రాంచైజీల మధ్య చర్చలు చివరి దశలో ఉన్నాయని సమాచారం.

మరోవైపు యశస్వి జైస్వాల్ కూడా రాజస్థాన్ రాయల్స్ ఫ్రాంచైజీతో సంతోషంగా లేనట్టు తెలుస్తోంది. సంజూ శాంసన్ నిష్క్రమణ తర్వాత జట్టులో కీలక ఆటగాడిగా, కెప్టెన్సీ రేసులో జైస్వాల్ ముందుంటాడని భావించారు. అయితే, యాజమాన్యం అతని స్థానంలో రియాన్ పరాగ్‌కు నాయకత్వ బాధ్యతలు అప్పగించింది. దీనికి తోడు 15 ఏళ్ల యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ రాకతో జైస్వాల్ ప్రాధాన్యం తగ్గినట్టు భావిస్తున్నారు. ముంబై రంజీ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న జైస్వాల్‌కు, ముంబై ఇండియన్స్‌లోకి రావడం కెరీర్ పరంగా ఎంతో మేలు చేస్తుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

హార్దిక్ మాత్రమే కాకుండా స్టార్ బ్యాటర్ సూర్యకుమార్ యాదవ్ కూడా ముంబై ఇండియన్స్‌ను వీడే యోచనలో ఉన్నట్టు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. జట్టులోని సీనియర్ ఆటగాళ్లను వదులుకోవాలని యాజమాన్యం భావిస్తుండటంతో సూర్యకుమార్ కొత్త జట్టు వైపు చూస్తున్నాడు. అతనికి కెప్టెన్సీ ఆఫర్ ఇచ్చేందుకు ఉత్తరాదికి చెందిన రెండు ఫ్రాంచైజీలు ఆసక్తి చూపుతున్నట్టు తెలుస్తోంది. రోహిత్ శర్మ కెరీర్ చివరి దశలో ఉండటం, హార్దిక్, సూర్యకుమార్ వంటి కీలక ఆటగాళ్లు జట్టును వీడితే ముంబై ఇండియన్స్‌కు కొత్త సూపర్ స్టార్లు అవసరమవుతారు. మూడు ఫార్మాట్లలో భారత జట్టులో కీలక ఆటగాడిగా ఎదుగుతున్న యశస్వి జైస్వాల్, జట్టు భవిష్యత్ ప్రణాళికలకు సరైన ఎంపిక అని యాజమాన్యం భావిస్తోంది. అయితే, అతనికి కెప్టెన్సీ బాధ్యతలు కూడా అప్పగిస్తారా? లేదా? అన్నది ఆసక్తికరంగా మారింది.



## ఐఐటీల్లో కొత్త నిబంధన.. ప్లేస్‌మెంట్ సీవీల్లో జేఈఈ, 'గేట్' ర్యాంకులు రాయొద్దు!

- **ఐఐటీల ప్లేస్‌మెంట్ సీవీల్లో జేఈఈ, గేట్ ర్యాంకులకు నో**
- **23 ఐఐటీల ఉమ్మడి ప్లేస్‌మెంట్ కమిటీ నిర్ణయం**
- **ర్యాంకుల ఆధారంగా వివక్ష నివారణే లక్ష్యం**
- **ఐఐటీలో సాధించిన విజయాలకే ప్రాధాన్యం**
- **సీవీలో ప్రాజెక్టులు, నైపుణ్యాలు ప్రముఖంగా చూపే అవకాశం**
- **నిర్ణయానికి మద్దతుతో పాటు విమర్శలు**

**అఖండ సూర్య :**

ఒకప్పుడు ఐఐటీలో సీటు సాధించడం మాత్రమే కాదు.. జేఈఈ లేదా 'గేట్'లో వచ్చిన ర్యాంక్ కూడా విద్యార్థుల గర్వకారణంగా ఉండేది. కానీ ఇకపై క్యాంపస్ ప్లేస్‌మెంట్లలో ఆ ర్యాంకులు కనిపించకపోవచ్చు. దేశంలోని 23 ఐఐటీల ఉమ్మడి ప్లేస్‌మెంట్ కమిటీ కీలక నిర్ణయం తీసుకుంది. ఉద్యోగాలు, ఇంటర్న్‌షిప్‌ల కోసం సమర్పించే సీవీల్లో జేఈఈ ర్యాంక్, గేట్ స్కోర్, పర్సంటైల్ వంటి వివరాలు చేర్చొద్దని విద్యార్థులకు సూచించింది.

**ఎందుకీ నిర్ణయం?**

విద్యార్థులను ప్రవేశ పరీక్షల్లో సాధించిన ర్యాంకుల ఆధారంగా కాకుండా ఐఐటీలో చేరిన తర్వాత వారి ప్రతిభ, నైపుణ్యాలు, సాధించిన విజయాల ఆధారంగా అంచనా వేయాలన్నదే ఈ నిర్ణయం వెనుక ఉద్దేశమని కమిటీ తెలిపింది. కొన్ని సందర్భాల్లో ర్యాంకులను బట్టి విద్యార్థి ఏ కేటగిరీలో సీటు పొందారో గుర్తించే అవకాశం ఉందని, దీంతో నియామక ప్రక్రియలో వివక్షకు తావుండొచ్చనే ఆందోళన వ్యక్తమైంది.

**సీవీలో ఏమేం ఉండొచ్చు?**

కొత్త మార్గదర్శకాల ప్రకారం విద్యార్థులు తమ సీపీఐ, విద్యా ప్రతిభ, ప్రాజెక్టులు, ఇంటర్న్‌షిప్‌లు, పరిశోధన, నాయకత్వ అనుభవం, సాంకేతిక నైపుణ్యాల వంటి వివరాలను సీవీలో పొందుపరచవచ్చు. ఒకవేళ కంపెనీలు ప్రత్యేకంగా అడిగితే మాత్రమే ప్రవేశ పరీక్షల ర్యాంకులు లేదా స్కోర్లు అందించే అవకాశం ఉంటుంది.

**మద్దతు.. విమర్శలు**

ఈ నిర్ణయాన్ని కొందరు సమాన అవకాశాలకు దోహదపడే చర్యగా స్వాగతించారు. మరోవైపు జేఈఈ, గేట్ ర్యాంకులు కష్టపడి సాధించిన విజయాలని, వాటిని దాచాల్సిన అవసరం ఏంటని మరికొందరు ప్రశ్నిస్తున్నారు. ప్రతిభకు గుర్తింపు తగ్గిపోతుందనే అభిప్రాయాలు కూడా వ్యక్తమవుతున్నాయి.



## అమెరికా-ఇరాన్ చర్చల ఎఫెక్ట్.. భారీగా పతనమైన ముడిచమురు ధరలు

- **3 శాతం వరకు పడిపోయిన అంతర్జాతీయ క్రూడ్ ఆయిల్**
- **బ్యారెల్ 79 డాలర్ల స్థాయికి చేరిన బ్రెంట్ క్రూడ్**
- **భారత్ వంటి దేశాలకు తగ్గనున్న దిగుమతుల భారం, ద్రవ్యోల్బణం**
- **చమురు ధరల పతనంతో లాభాల్లో ట్రేడ్ అవుతున్న స్టాక్ మార్కెట్లు**

**అఖండ సూర్య :**

అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధరలు సోమవారం భారీగా పతనమయ్యాయి. అమెరికా, ఇరాన్ మధ్య స్విట్జర్లాండ్‌లో జరిగిన చర్చలు ముగియడంతో చమురు సరఫరాపై నెలకొన్న ఆందోళనలు తగ్గాయి. దీంతో ఇరాన్ నుంచి చమురు ఎగుమతులు పెరిగే అవకాశం ఉందన్న అంచనాలతో ధరలు 3 శాతం వరకు క్షీణించాయి.

వివరాల్లోకి వెళ్తే, అంతర్జాతీయ బెంచ్‌మార్క్ బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర 2 శాతానికి పైగా తగ్గి బ్యారెల్‌కు 79 డాలర్ల వద్ద ట్రేడ్ అయింది. ట్రేడింగ్ ప్రారంభంలో బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 82 డాలర్ల పైకి చేరినప్పటికీ, చర్చల వార్తలతో వెంటనే దిగివచ్చింది. అదేవిధంగా అమెరికా వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ (డబ్ల్యూటీఐ) క్రూడ్ ధర 3శాతం తగ్గి బ్యారెల్‌కు 75 డాలర్లకు పడిపోయింది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలను తగ్గించి, బలహీనంగా ఉన్న కాల్పుల విరమణను పొడిగించే లక్ష్యంతో అమెరికా, ఇరాన్ సీనియర్ అధికారులు చర్చలు జరిపినట్లు వచ్చిన నివేదికలు ఈ పతనానికి ప్రధాన కారణంగా నిలిచాయి.ఇప్పటికే గత వారం కూడా ముడి చమురు ధరలు 8శాతానికి పైగా తగ్గాయి. గల్ఫ్‌లో నిలిచిపోయిన నౌకలను తిరిగి అనుమతించవచ్చని, ఇరాన్‌పై ఉన్న ఆంక్షలను అమెరికా సడలించవచ్చని మార్కెట్ వర్గాలు అంచనా వేశాయి. తమ దేశం నుంచి చమురు, పెట్రోకెమికల్ ఎగుమతులకు మినహాయింపులు లభించాయని, స్తంభింపజేసిన కొన్ని ఆస్తులను తిరిగి పొందేందుకు మార్గం సుగమమైందని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరఘ్చీ ప్రకటించడం ఈ అంచనాలకు మరింత బలం చేకూర్చింది. పశ్చిమాసియాలో అనిశ్చితి ఉన్నప్పటికీ బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 80 డాలర్ల దిగువన ఉండటం, మార్కెట్లు పెద్దస్థాయిలో ఘర్షణలను ఊహించడం లేదనడానికి సంకేతమని నిపుణులు విశ్లేషిస్తున్నారు. అయితే, స్విట్జర్లాండ్ చర్చల నుంచి ఇరాన్ వైదొలిగిందనే కొన్ని నివేదికల నేపథ్యంలో ఆసియాపసిఫిక్ మార్కెట్లలో మిశ్రమ స్పందన కనిపించిందని, భౌగోళిక రాజకీయ పరిస్థితులు ఇంకా అస్థిరంగానే ఉన్నాయని వారు హెచ్చరిస్తున్నారు.

మరోవైపు, ముడి చమురు ధరలు తగ్గడం ఈక్విటీ మార్కెట్లకు కలిసొచ్చింది. సోమవారం ఉదయం దేశీయ సూచీలు లాభాలతో ప్రారంభమయ్యాయి. ఈ ధరల తగ్గుదల భారత్ వంటి ప్రధాన చమురు దిగుమతి దేశాలకు పెద్ద ఊరటనివ్వనుంది. దిగుమతి ఖర్చులు, ద్రవ్యోల్బణం, కరెంట్ అకౌంట్ లోటుపై ఒత్తిడి తగ్గే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు భావిస్తున్నారు.



# నీట్ రీ-టెస్ట్‌లో మున్నాభాయ్' తరహా భారీ స్కామ్.. బట్టబయలు!

- **బీహార్‌లో నీట్ రీ-టెస్ట్ సందర్భంగా ప్రాక్సీ రాకెట్ బట్టబయలు**
- **లఖిసరాయ్‌లో 24 మందిని అరెస్ట్ చేసిన పోలీసులు**
- **అరెస్టయిన వారిలో మెడికల్ విద్యార్థులు, బయోమెట్రిక్ సిబ్బంది**




**అఖండ సూర్య :**

నీట్ యూజీ 2026 రీటెస్ట్ సందర్భంగా బీహార్‌లో 'మున్నాభాయ్ ఎంబీబీఎస్' తరహాలో చోటుచేసుకున్న భారీ ప్రాక్సీ రాకెట్‌ను పోలీసులు రట్టు చేశారు. లఖిసరాయ్ జిల్లాలో నిర్వహించిన ఆపరేషన్‌లో భాగంగా 24 మంది నిందితులను అరెస్ట్ చేశారు. వీరిలో 9 మంది ప్రాక్సీ అభ్యర్థులు, పలువురు మెడికల్ విద్యార్థులతో పాటు బయోమెట్రిక్ ఏజెన్సీకి చెందిన 14 మంది సిబ్బంది ఉండటం గమనార్హం. అసలు విద్యార్థులకు బదులుగా ఇతరులు పరీక్ష రాసే ప్రయత్నం బట్టబయలైంది.

ఆదివారం దేశవ్యాప్తంగా నీట్ రీటెస్ట్ నిర్వహించిన విషయం తెలిసిందే. లఖిసరాయ్‌లోని కేంద్రీయ విద్యాలయ, కేఆర్‌కే హైస్కూల్, హసన్‌పూర్ హైస్కూల్ తదితర పరీక్షా కేంద్రాల్లో బయోమెట్రిక్ ధృవీకరణ సమయంలో ఫొటోలు, వేలిముద్రలు సరిపోలకపోవడంతో ఈ కుంభకోణం వెలుగులోకి వచ్చింది. పాట్నా మెడికల్ కాలేజీలో మూడో సంవత్సరం చదువుతున్న మయాంక్ కశ్యప్ అనే విద్యార్థి, బయోమెట్రిక్ ఏజెన్సీ ఉద్యోగిగా నటిస్తూ పరీక్షా కేంద్రంలోకి ప్రవేశించగా పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు.

గతంలో నీట్ పేపర్ లీక్ కేసులో సీబీఐ విచారణను ఎదుర్కొన్న అర్పిత్ రాజ్‌తో పాటు, బీహెచ్‌యూ, ఎయిమ్స్ రాయ్‌బరేలీ, నలందా మెడికల్ కాలేజీలకు చెందిన విద్యార్థులు కూడా అరెస్టయిన వారిలో ఉన్నారు. అసలు అభ్యర్థుల తరఫున పరీక్ష రాసేందుకు ఒక్కొక్కరి నుంచి రూ.10 లక్షల నుంచి రూ.40 లక్షల వరకు ఒప్పందాలు కుదిరినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది.

లఖిసరాయ్ జిల్లా కలెక్టర్ (డీఎం), ఎస్పీ సహా ఉన్నతాధికారులు స్వయంగా పరీక్షా కేంద్రాలను సందర్శించి విచారణను ముమ్మరం చేశారు. ఈ నెట్‌వర్క్ వెనుక ఉన్న అసలు సూత్రధారులను గుర్తించేందుకు దర్యాప్తును వేగవంతం చేశారు. మరోవైపు, దేశవ్యాప్తంగా పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని, అక్కడక్కడా వెలుగుచూసిన కొన్ని ఘటనలు మినహా ఎలాంటి పేపర్ లీక్‌లు జరగలేదని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) స్పష్టం చేసింది.

## లక్నో అగ్నిప్రమాదంలో 14 మంది మృతి.. దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ప్రధాని మోదీ

- **లక్నో కోచింగ్ సెంటర్‌లో భారీ అగ్నిప్రమాదం**
- **ఘటనలో 14 మంది ప్రాణాలు కోల్పోయినట్లు నిర్ధారణ**
- **ప్రమాదంపై దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ప్రధాని మోదీ**
- **మృతుల కుటుంబాలకు రూ. 2 లక్షల పరిహారం ప్రకటన**
- **సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్న ఉన్నతాధికారులు**



**అఖండ సూర్య :**


ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలో సోమవారం ఘోర అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. అలీగంజ్‌లోని పురానియా ప్రాంతంలో ఉన్న ఓ మూడు అంతస్తుల భవనంలోని కోచింగ్ సెంటర్‌లో చెలరేగిన మంటల కారణంగా 14 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి (పీఎంఎన్‌ఆర్‌ఎఫ్) నుంచి రూ. 2 లక్షల చొప్పున, గాయపడిన వారికి రూ. 50,000 చొప్పున పరిహారం ప్రకటించారు.

వివరాల్లోకి వెళితే, పురానియాలోని ఓ వాణిజ్య భవనంలో నిర్వహిస్తున్న కోచింగ్ సెంటర్‌లో సోమవారం మధ్యాహ్నం ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. క్షణాల్లోనే దట్టమైన పొగ భవనం మొత్తాన్ని చుట్టుముట్టడంతో విద్యార్థులు, సిబ్బంది తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ప్రాణాలు కాపాడుకునేందుకు కొందరు భవనంపై అంతస్తుల నుంచి కిందికి దూకడంతో తీవ్రంగా గాయపడ్డారు. ఈ దుర్ఘటనలో మరణించిన వారంతా 20 నుంచి 24 ఏళ్లలోపు వయసు వారేనని అధికారులు తెలిపారు.

ఈ ప్రమాద వార్త తెలియగానే ఉప ముఖ్యమంత్రి బ్రజేష్ పాఠక్ హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షించారు. మరోవైపు, అలీగఢ్ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తన పర్యటనను అర్ధాంతరంగా రద్దు చేసుకుని లక్నోకు తిరిగి వచ్చారు. ఈ ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేసిన ఆయన, మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు, ఇతర బృందాలు సహాయక చర్యల్లో నిమగ్నమయ్యాయి. భవనం గోడలను పగలగొట్టి లోపల చిక్కుకున్న వారిని రక్షించే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదని, దర్యాప్తు చేస్తున్నామని అధికారులు వెల్లడించారు.

## బ్రిటన్ రాజకీయాల్లో సంచలనం.. ప్రధాని పదవికి కీర్ స్టార్మర్ రాజీనామా!

- **లేబర్ పార్టీ నాయకత్వాన్నీ వీడుతున్నట్లు ప్రకటన**
- **సొంత పార్టీ నుంచే పెరిగిన ఒత్తిడి**
- **దేశ ప్రయోజనాల కోసమే నిర్ణయమని స్టార్మర్ వ్యాఖ్య**
- **100 మందికిపైగా ఎంపీల నుంచి రాజీనామా డిమాండ్**
- **పదేళ్లలో బ్రిటన్‌కు ఏడో ప్రధాని మార్పు**



**అఖండ సూర్య :**

బ్రిటన్ రాజకీయాల్లో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. ప్రధానమంత్రి కీర్ స్టార్మర్ (63) తన పదవికి, అధికార లేబర్ పార్టీ నాయకత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. సొంత పార్టీ నుంచే పెరిగిన ఒత్తిడి, నాయకత్వంపై అసంతృప్తి నేపథ్యంలో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు.

డౌనింగ్ స్ట్రీట్‌లోని అధికార నివాసం నుంచి భార్యతో కలిసి బయటకు వచ్చిన స్టార్మర్‌కు మద్దతుదారులు చప్పట్లతో వీడ్కోలు పలికారు. అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన దేశ ప్రయోజనాలనే ఎప్పుడూ ముందుంచానని చెప్పారు. "నేను ప్రేమించే దేశాన్ని ముందు ఉంచడానికే ప్రతి నిర్ణయం తీసుకున్నాను" అని పేర్కొన్నారు.

2024 సాధారణ ఎన్నికల్లో లేబర్ పార్టీ ఘన విజయం సాధించిన విషయాన్ని స్టార్మర్ గుర్తు చేశారు. తమ ప్రభుత్వం పలు రంగాల్లో పురోగతి సాధించిందని తెలిపారు. ఆర్థిక వృద్ధి, వేతనాల పెరుగుదల, మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఆరోగ్య సేవల మెరుగుదల, కార్మికులుఅద్దెదారుల హక్కుల బలోపేతం వంటి అంశాలను ప్రస్తావించారు.

రక్షణ వ్యయాన్ని పెంచడం, అక్రమ వలసలను నియంత్రించేందుకు చర్యలు తీసుకోవడం, చిన్నారుల పేదరికం తగ్గించే కార్యక్రమాలు అమలు చేయడం తమ ప్రభుత్వ ప్రధాన విజయాలని పేర్కొన్నారు. అయితే గత కొన్ని నెలలుగా స్టార్మర్ నాయకత్వంపై విమర్శలు పెరుగుతున్నాయి. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను పూర్తిగా అమలు చేయలేకపోయారనే ఆరోపణలు ఎదుర్కొన్నారు. పలు విధానాలపై వెనక్కి తగ్గడం, ప్రజాదరణ తగ్గడం కూడా ఆయనపై ఒత్తిడిని పెంచింది. లేబర్ పార్టీకి చెందిన 100 మందికిపైగా ఎంపీలు స్టార్మర్ రాజీనామా చేయాలని లేదా పదవి వీడే గడువును ప్రకటించాలని బహిరంగంగా డిమాండ్ చేసినట్లు సమాచారం.

స్టార్మర్ వైదొలగడంతో గత పదేళ్లలో బ్రిటన్‌లో ఏడుగురు ప్రధానులు మారినట్లైంది. తరచూ నాయకత్వ మార్పులు చోటుచేసుకోవడం దేశ రాజకీయాల్లో నెలకొన్న అస్థిరతకు సంకేతంగా విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రజా సేవలపై ఒత్తిడి, ఆర్థిక సవాళ్లు, అక్రమ వలసల వంటి సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయనే విమర్శలు బ్రిటన్‌లో పెరుగుతున్నాయి.

## సన్నీ సరసన నటించొద్దన్నారు!



హిందీ ప్రేక్షకుల్ని విశేషంగా ఆకట్టుకున్న సినిమాల్లో 'గదర్' కూడా ముందు వరుసలో ఉంటుంది. సన్నీ దేఒల్, అమీషా పటేల్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమా ఇటీవలే విడుదలై 25ఏళ్లు పూర్తి చేసుకుంది. ఈ నేపథ్యంలోనే ఈ చిత్ర సమయంలో తనని సన్నీ సరసన నటించొద్దని సలహాలు ఇచ్చినట్లు ఆనాటి సంగతుల్ని గుర్తుచేసుకుంది అమీషా. "'గదర్' చేయొద్దని నాకు చాలా మంది చెప్పారు. ఎందుకంటే స్క్రిప్ట్ చూస్తే అందులో విజయానికి అవసరమైన అంశాలేవీ కనిపించలేదు. సన్నీ అప్పటికే సూపర్ స్టార్. కానీ నా కంటే చాలా పెద్దవారు. అంత వయసు తేడా ఉన్న వ్యక్తితో జంటగా ఎలా నటిస్తావని ప్రశ్నించారు. కథకు అవసరమైతే.. వయసులో వ్యత్యాసం ఉండటంలో ఎలాంటి తప్పు లేదు. కానీ కథకు అవసరం లేకపోయినా.. వయసులో వ్యత్యాసాన్ని జోడించినప్పుడు మాత్రం కచ్చితంగా దాన్ని ప్రశ్నించాల్సి ఉంటుంది. నిజాయతీగా చెప్పాలంటే ఈరోజుల్లో ప్రేక్షకులు కొన్ని సినిమాలను ఆదరించకపోవడానికి ఇది కూడా ఓ కారణం" అని చెప్పింది.

## నా కష్టాలకు ప్రతిఫలం అందుకునే దశలో ఉన్నా!

హీరోలకు దీటుగా యాక్షన్ సన్నివేశాలు చేస్తూ.. తెరపై అదరగొడుతుంటుంది బాలీవుడ్ కథానాయిక ప్రియాంక చోప్రా. ప్రస్తుతం పలు అంతర్జాతీయ వేదికలపై మెరుస్తూ.. హాలీవుడ్ చిత్రాలతో బిజీగా ఉంది భామ. మరోవైపు త్వరలో 'వారణాసి'తో తెరపైకి రావడానికి సన్నద్ధమవుతుంది. ఈ నేపథ్యంలోనే తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ప్రియాంక.. ఈ సినిమా గురించి మాట్లాడుతూ.. "మేము చాలా ప్రతిష్ఠాత్మకంగా రూపొందిస్తున్న చిత్రమిది. ఇది కేవలం భారతదేశంలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో విడుదల కానుండటం సంతోషంగా ఉంది. గత మూడేళ్లుగా మేము 'వారణాసి' కోసం చేస్తున్న కృషిని ప్రపంచ ప్రేక్షకులకు చూపించే అవకాశం లభించడం నాకు ఎంతో గర్వకారణం" అని అంది. తన కెరీర్ గురించి మాట్లాడుతూ.. "చిత్రపరిశ్రమలోకి అడుగుపెట్టినప్పుడు నా కోసం ప్రత్యేకంగా ఎవరూ స్క్రిప్ట్‌లు రాయలేదు. కానీ ఇటీవల నా భర్త అన్నట్లుగా నేను నా త్యాగాలకు, కష్టాలకు ప్రతిఫలం అందుకునే దశలో ఉన్నాను. ఇప్పుడు నాకు నచ్చిన ప్రాజెక్టులను ఎంపిక చేసుకునే స్వేచ్ఛ నాకుంద"ని చెప్పుకొచ్చింది ప్రియాంక.



## సరికొత్త హంగులతో 'ఒక్కడు'

మహేశ్‌బాబు సినీ ప్రయాణంలో ఓ మైలురాయిగా నిలిచిపోయిన 'ఒక్కడు' సినిమా 4కే హంగులతో ముస్తాబై ఈ నెల 26న ప్రేక్షకుల ముందుకు రానుంది. రాధా మాధవి ఫిల్మ్ డిస్ట్రిబ్యూటర్స్ సమర్పణలో రామకృష్ణ ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. గుణశేఖర్ దర్శకత్వంలో సుమంత్ ఆర్ట్ ప్రొడక్షన్స్ పతాకంపై ఎమ్మెస్ రాజు నిర్మించిన చిత్రమిది. మహేశ్‌బాబు సరసన భూమిక నటించారు. 2003లో విడుదలై ఘన విజయం సాధించిన ఈ చిత్రం ఇప్పటికే రీరిలీజ్‌గా పలు మార్లు ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఇటీవల అత్యాధునిక 4కే హంగులతో సినిమాని సరికొత్తగా తీర్చిదిద్ది మరోసారి ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. 'ఒక్కడు' ఎప్పటికప్పుడు క్రేజ్‌ని పెంచుకుంటూ ప్రేక్షకుల్ని అలరిస్తోందని, 4కే హంగులతో సినిమా విడుదలవుతుండడం ఆనందంగా ఉందన్నారు దర్శకుడు గుణశేఖర్.



## ఆ తేదీపై కన్నేసిన సంయుక్త మీనన్.. 'బ్లాక్ గోల్డ్' విడుదలపై సూపర్ అప్డేట్

మోస్ట్ బ్యూటిఫుల్ నటి సంయుక్తా మీనన్ ప్రస్తుతం 'ది బ్లాక్ గోల్డ్' చిత్రంలో ప్రధాన పాత్రలో నటిస్తోంది. ఇప్పటి వరకు క్లాస్, డీసెంట్ పాత్రలతో పాటు గ్లామర్ రోల్స్‌లో ప్రేక్షకులను ఆకట్టుకున్న ఈ భామ, ఈ సినిమాలో పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపించనుంది. దీంతో ఈ సినిమాపై ప్రేక్షకుల్లో మంచి అంచనాలు ఏర్పడ్డాయి. మొదట ఈ చిత్రాన్ని ఈ ఏడాది సమ్మర్‌లో విడుదల చేయనున్నట్లు వార్తలు వచ్చినప్పటికీ, సినిమా సమ్మర్ రేస్ నుంచి తప్పుకుంది. తాజాగా ఈ మూవీ విడుదల తేదీకి సంబంధించి ఓ క్రేజీ న్యూస్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ చిత్రాన్ని ఆగస్టు 14న విడుదల చేయాలని మేకర్స్ భావిస్తున్నట్లు, అందుకు అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు సమాచారం.

అన్నీ అనుకున్నట్లుగా జరిగితే దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన కూడా త్వరలోనే వెలువడే అవకాశం ఉందని తెలుస్తోంది. ఒకవేళ ఆగస్టు 14న సినిమా విడుదలైతే బాక్సాఫీస్ వద్ద గట్టి పోటీని ఎదుర్కొనే అవకాశాలు ఉన్నాయని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. యోగేశ్ కెఎంసీ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంలో మురళీ శర్మ, రావు రమేష్, నాజర్, మనీష్ వాధ్వా తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. శ్యామ్ సీఎస్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని హాస్య మూవీస్, మాగంటి పిక్చర్స్ బ్యానర్లపై రాజేశ్ దండా నిర్మిస్తున్నారు.



## కేవలం ఒక్క సీన్ కోసమే 1.2 కోట్ల ఖర్చు..

కోలీవుడ్ హీరో విష్ణు విశాల్, ఐశ్వర్య లక్ష్మి జంటగా నటించిన లేటెస్ట్ మూవీ 'గట్ట కుస్తీ-2'. ఈ సినిమా 2022లో వచ్చిన బ్లాక్ బస్టర్ హిట్‌కు సీక్వెల్‌గా రాబోతుండటంతో ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ ఫ్యామిలీ డ్రామాను చెల్లా అయ్యావు తెరకెక్కిస్తున్నారు. విష్ణు విశాల్ సొంత నిర్మాణ సంస్థ విష్ణు విశాల్ స్టూడియోస్ బ్యానర్‌తో పాటు వేల్స్ ఫిల్మ్ ఇంటర్నేషనల్‌తో కలిసి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సీక్వెల్‌లో కూడా కరుణాస్, మునీష్కాంత్, కాళీ వెంకట్ కీలక పాత్రలో కనిపించనున్నారు. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా జూలై-3న థియేటర్స్‌లో రాబోతుంది. ఈనేపథ్యంలో.. తాజాగా, మూవీ మేకర్స్ ప్రమోషన్స్ జోరు పెంచారు. దీంతో ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఐశ్వర్య లక్ష్మి ఆసక్తికర కామెంట్స్ చేశారు. 'గట్టా కుస్తీ' మొదటి భాగంలో వచ్చే ఇంటర్వెల్ ఫైట్ సీన్ గురించి ఒక షాకింగ్ విషయాన్ని బయటపెట్టారు. ఆ సీన్ కోసం ఏకంగా 1.2 కోట్ల రూపాయలు ఖర్చు చేసినట్లు ఆమె వెల్లడించారు. "గట్టా కుస్తీ పార్ట్ 1 ఇంటర్వెల్ సమయంలో నాకు ఒక పవర్‌ఫుల్ మాస్ సీన్ ఉంటుంది. ఆ సీన్ గురించి మాట్లాడినప్పుడల్లా నాకు ఒక ముఖ్యమైన విషయం గుర్తొస్తుంది. విష్ణు విశాల్ కెరీర్‌లో ఆయన నటించి, నిర్మించిన సినిమాలన్నింటిలో కెల్లా అత్యంత ఖరీదైన సీన్ ఏదైనా ఉందంటే అది ఆ ఇంటర్వెల్ ఫైట్ సీనే. కేవలం ఆ ఒక్క సీన్ కోసమే దాదాపు 1.2 కోట్లకు పైగా బడ్జెట్ కేటాయించారు" అని ఐశ్వర్య లక్ష్మి చెప్పారుసాధారణంగా సినిమాల్లో హీరోల ఇంటర్వెల్ బ్లాక్ కోసం అంత భారీగా ఖర్చు పెడుతుంటారు. కానీ, ఒక హీరోయిన్ రేంజ్ ఎలివేషన్ సీన్ కోసం అంత భారీ మొత్తాన్ని ఖర్చు చేయడం నిజంగా విశేషం. దీనిపై ఐశ్వర్య లక్ష్మి స్పందిస్తూ.. "మొదట కథ విన్నప్పుడు నేనొక చిన్న సీన్‌లాగే భావించాను. కానీ, దర్శకుడు చెల్లా అయ్యావు, విష్ణు విశాల్ గార్లు ఆ సీన్‌ను చాలా అద్భుతంగా ప్లాన్ చేసి మార్చేశారు. థియేటర్లలో ఆ సీన్ వస్తున్నప్పుడు ప్రేక్షకుల నుంచి అద్భుతమైన క్లాప్స్, రెస్పాన్స్ వచ్చాయి. అదొక టీమ్ ఎఫర్ట్. కథ విన్నప్పుడు నాకు నచ్చింది నేను చేశాను, కానీ స్క్రీన్ పై ఆ సీన్స్ చాలా పెద్దగా వర్కవుట్ అయ్యాయి" అంటూ సంతోషం వ్యక్తం చేశారు.



## నా బిడ్డే నా ప్రపంచం

స్టార్ హీరోయిన్ సమంత ప్రస్తుతం వ్యక్తిగతంగానూ, వృత్తిపరంగానూ హ్యాపీ మూడ్‌లో ఉన్నట్లు కనిపిస్తోంది. సుదీర్ఘ విరామం తర్వాత ఆమె ప్రధాన పాత్రలో నటించిన 'మా ఇంటి బంగారం' చిత్రం ప్రేక్షకులను ఆకట్టుకుని విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. మరోవైపు, సమంత తల్లి కాబోతుందనే వార్తలు సోషల్ మీడియాలో జోరుగా వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో గతంలో మాతృత్వంపై సమంత చేసిన వ్యాఖ్యలు మరోసారి వైరల్‌గా మారాయి. కొన్నేళ్ల క్రితం ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో సమంత మాతృత్వం గురించి ఎంతో భావోద్వేగంగా మాట్లాడింది. తల్లిగా మారడం తన జీవితంలో అత్యంత అందమైన, ప్రత్యేకమైన అనుభవంగా భావిస్తానని ఆమె తెలిపింది. నా బిడ్డే నా ప్రపంచం అవుతుంది. పిల్లల పెంపకం, కుటుంబ బాధ్యతలు, ఉద్యోగాన్ని సమతుల్యం చేసుకుంటూ ముందుకు సాగే మహిళలంటే నాకు ఎంతో గౌరవం అని సమంత పేర్కొంది. తన చిన్ననాటి జీవితం అంత సులభంగా సాగలేదని సమంత తెలిపింది. తాను ఎన్నో కష్టాలను ఎదుర్కొంటూ పెరిగానని, అందుకే భవిష్యత్తులో తన పిల్లలకు ఎలాంటి లోటు లేకుండా ప్రేమ, ఆప్యాయతలు, సౌకర్యవంతమైన జీవితం అందించాలని కోరుకుంటానని చెప్పింది. చిన్నప్పుడు ఎన్నో కష్టాలు పడ్డాను. అలాంటి అనుభవాలు ఎదుర్కొన్న వారు తమ పిల్లలకు మంచి జీవితం ఇవ్వాలని కోరుకుంటారు. నేను కూడా అదే కోరుకుంటాను అని సమంత వెల్లడించింది.

తల్లి అయిన తర్వాత కొన్ని సంవత్సరాల పాటు పూర్తిగా పిల్లల పెంపకానికే సమయం కేటాయించాలని తాను భావిస్తున్నట్లు సమంత తెలిపింది. నాకు బిడ్డ పుట్టిన తర్వాత కొన్ని సంవత్సరాలు తనను వదిలి ఎక్కడికీ వెళ్లను. నా బిడ్డే నా సర్వస్వంగా మారిపోతాడు లేదా మారిపోతుంది. కెరీర్ కంటే కుటుంబానికే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తాను అని ఆమె అప్పట్లో చెప్పింది. ఇటీవల జరిగిన 'మా ఇంటి బంగారం' విజయోత్సవ వేడుకల్లో సమంత కనిపించిన తీరు సోషల్ మీడియాలో చర్చనీయాంశమైంది. కొన్ని ఫొటోలు, వీడియోల ఆధారంగా ఆమె తల్లి కాబోతుందనే ఊహాగానాలు మొదలయ్యాయి. అయితే ఈ వార్తలపై ఇప్పటి వరకు సమంత నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంపై కూడా ఆమె స్పందించలేదు. సమంత గతంలో మాతృత్వంపై చేసిన భావోద్వేగ వ్యాఖ్యలు ఇప్పుడు మరోసారి వైరల్ అవుతుండటంతో అభిమానులు ఆసక్తిగా చర్చించుకుంటున్నారు.



## ప్రేక్షకులు థియేటర్లకు రావాలంటే ఇదే సరైన ఐడియా..



తేజ సజ్జ హీరోగా, అమృత అయ్యర్ హీరోయిన్‌గా, ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'హనుమాన్'. 2024 సంక్రాంతి సందర్భంగా విడుదలైన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకుంది. ఇప్పుడు ఈ చిత్రాన్ని జూన్ 25న 3డీ వెర్షన్‌లో మళ్లీ ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. ఈ సందర్భంగా చిత్ర బృందం ప్రత్యేక ఈవెంట్‌ను నిర్వహించింది. ఈ కార్యక్రమంలో తేజ సజ్జ మాట్లాడుతూ, "జూన్ 25న మా 'హనుమాన్' సినిమా 3డీలో విడుదల కాబోతోంది. అందరూ థియేటర్లకు వచ్చి సినిమాను చూడండి. మీరు కచ్చితంగా థియేటర్‌కే రావాలి. ఎందుకంటే బయట 3డీ గ్లాసులు దొరకవు కదా! ఇదో మంచి ఆలోచన. అన్ని సినిమాలను 3డీలో విడుదల చేస్తే ప్రేక్షకులు తప్పకుండా థియేటర్లకు వచ్చి సినిమాలు చూస్తారు" అంటూ సరదాగా వ్యాఖ్యానించారు. ప్రస్తుతం తేజ సజ్జ చేసిన ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఇప్పటికే భారీ విజయాన్ని అందుకున్న 'హనుమాన్' చిత్రం 3డీ వెర్షన్‌లో ప్రేక్షకులను ఏ స్థాయిలో ఆకట్టుకుంటుందో అనే ఆసక్తి సినీ అభిమానుల్లో నెలకొంది.

This Newspaper is Published by Petta Venkata Suryanarayana from Plot No 98/Part 1, Co-operative Industrial Estate Phase-ii, Gandhi Nagar, Medchal Malkajgiri,Telangana - 500037 on behalf of Petta Venkata Suryanarayana, edited by Petta Venkata Suryanarayana and printed by Petta Venkata Suryanarayana at Sree Sesha Sai Enterprises ,Plot No 98/Part 1, Co-operative Industrial Estate Phase-II, Gandhi Nagar, Medchal Malkajgiri, Telangana - 500037, e-mail: seshasai09@gmail.com, Phone: 96188vv80945